లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం


ప్రజలే ప్రభువులు

మార్చి 2020 రూ.10/-

## బడి: నాడు-నేడు

## విద్యా ప్రమాణాల్లో అదే దిగజారుడు


















# 'హైదరాబాద్ డిక్లరేషన్' అమలు తక్షణావసరాన్ని ప్రత్యక్షంగా చూశాం

తెలంగాణలో ఇటీవల జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ధనరాజకీయానికి తోడు ఫిరాయింపు రాజకీయాలు కూడా పెద్దఎత్తున జరిగాయని లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కన్వీనర్ బండారు రామ్మోహనరావు వరంగల్‌లో అన్నారు. వీటిని అరికట్టాలంటే పంచాయతీ, మునిసిపాలిటీ దగ్గర్నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రి వరకూ ప్రభుత్వాధినేతల ఎన్నికల్ని ప్రత్యక్షంగా నిర్వహించాలన్నారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ, ఎన్నికల నిఘావేదిక తరపున సుమారు 30 మునిసిపాలిటీల్లో సమావేశాలు ఏర్పాటు చేశామని, క్షేత్రస్థాయి పరిస్థితుల్ని పరిశీలించామని తెలిపారు. ప్రజలు అధికార టీఆర్ఎస్ వైపునకు మునిసిపోల్స్ కూడా మొగ్గు చూపారనటంలో సందేహం లేదని, కానీ ఇందులో డబ్బు, ప్రలోభాల పాత్ర కూడా ఎక్కువగానే ఉందని రామ్మోహనరావు స్పష్టం చేశారు. అలాగే దాదాపు 20 చోట్ల ఎక్స్‌అఫీషియో సభ్యుల ఓట్ల ద్వారా, మరో 11 చోట్ల పూర్తిగా అనైతిక పొత్తులు, ఫిరాయింపుల ద్వారా టీఆర్ఎస్ అధికారం చేజిక్కించుకుందన్నారు. ఇది రాజ్యాంగ ప్రజాస్వామ్యానికి, రాజకీయాల్లో నైతిక విలువలకు తూట్లు పొడవటమేనన్నారు. తిలాపాపం తలాపిడికెడు అన్నట్లు.. ఏ దొడ్లో ఈనినా దూడ నాదేనన్నట్లు వ్యవహరించిన అధికార పక్ష పార్టీ తప్పుడు రాజకీయానికి ప్రతిపక్షాల నుంచి కూడా మద్దతు లభించిందన్నారు. జెండాలు, రంగులు వేరైనా అన్ని రాజకీయ పార్టీలూ ఒకే తానులో గుడ్డల్లా వ్యవహరిస్తున్నాయన్నారు. ఎన్నికల సంస్కరణలను తీసుకొచ్చి పంచాయితీ స్థాయి నుంచి రాష్ట్రంలో ముఖ్యమంత్రి స్థాయి వరకూ ప్రత్యక్ష ఎన్నికలను తీసుకొస్తే ధనరాజకీయానికి, ఫిరాయింపులకు కళ్లెం పడుతుందన్నారు. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా, ఐఎస్‌బీ, హెచ్‌సీయూ ఆధ్వర్యంలో ధనరాజకీయాలపై ఇటీవల నిర్వహించిన సదస్సు వెలువరించిన 'హైదరాబాద్ డిక్లరేషన్'ను వేగంగా ఆచరణలోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతుందో ఈ ఎన్నికల్లో తాము ప్రత్యక్షంగా చూశామని రామ్మోహనరావు అన్నారు.







ప్రజలే ప్రభువులు

# జనబలం


లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 23 సంచిక 3

మార్చి 2020



సంపాదకవర్గం

బండారు రామ్మోహనరావు

శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్

దూసనపూడి సోమసుందర్


## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |


జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.


## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...


06 విద్యా ప్రమాణాల్లో అదే దిగజారుడు!

12 ఉపాధినివ్వని, సమాజం పట్టని చదువులెందుకు?

17 అన్ని పార్టీల్లో అంతర్మథనం కావాలి..

23 అతిశయోక్తులున్నా.. అర్థవంతం, ఆశావహం!



కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288

Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్




## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా **20**వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

సంపాదకీయం

# జాడలేని వికేంద్రీకరణ

అధికార వికేంద్రీకరణపై పాలకపక్షాల వాదనలు విడ్డూరంగా ఉన్నాయి. మూడు రాజధానులు ఏర్పాటు చేయడమే వికేంద్రీకరణగా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం గట్టిగా వాదిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల ఏర్పాటు విప్లవాత్మక పాలనా సంస్కరణలుగా స్వసంకీర్తనం చేసుకుంటోంది. వలంటీర్ల నియామకంతో లబ్దిదారుల ముంగిటకు సేవలు వచ్చి కూచుంటాయని అంటోంది. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు లక్షా 30వేల మంది సచివాలయ సిబ్బందినీ, రెండులక్షల ఎనభై వేల మంది వలంటీర్లను ప్రభుత్వం నియమించింది. పౌరసేవలు, పథకాల లబ్ది నేరుగా ప్రజలకు అందుతాయని ప్రభుత్వం అంటోంది. సంక్షేమ పథకాల వితరణ ఒక్కటే పరిపాలనకు లక్ష్యమన్నట్లుగా పాలకులు ప్రవర్తిస్తున్నారు. అమరావతిలో చట్ట సభలు, విశాఖలో సచివాలయం, కర్నూలులో హైకోర్టు పెట్టడం ద్వారా వికేంద్రీకరణ అమలయిపోయినట్లుగా చిత్రీకరిస్తున్నారు. పాలక, ప్రతిపక్షాల మధ్య సాగుతున్న బహిరంగ చర్చ వ్యక్తిగత నిందలకూ, దూషణలకూ దిగజారిపోవడం విచారకరం. నేతల, అనుచరుల, వందిమాగధుల రియల్ ఎస్టేట్ స్వప్రయోజనాల చుట్టూ చెలరేగుతున్న వివాదం నానాటికీ వికృతంగా తయారయ్యింది. మూడు రాజధానుల వివాదం కొనసాగుతుండగానే స్థానిక ఎన్నికల సమరం మొదలైంది. రానున్న రోజులలో పాలక ప్రతిపక్షాల మధ్య వాగ్వివాదాలు ఏ మేరకు పతనమవుతాయో ఆలోచించడానికే భీతి కలిగిస్తోంది. అసలు విషయాలపై చర్చ జరగడమే లేదు.

73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక ప్రభుత్వాలకు సంక్రమించాల్సిన అధికారాలు, విధులు, నిధులు సరిగ్గా బదలాయించలేదని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. రాజ్యాంగ సవరణ జరిగి పాతికేళ్లు పూర్తయిన సందర్భంగా ఐక్యరాజ్యసమితి అభివృద్ధి కార్యక్రమం విడుదల చేసిన నివేదిక వికేంద్రీకరణ లక్ష్యాలు నెరవేరకపోవడంలో ప్రభుత్వాలదే బాధ్యతని స్పష్టం చేసింది. రాజకీయ సంకల్పం కొరవడటం, క్రిందిస్థాయిలో సమర్థవంతమైన వ్యవస్థలు ఏర్పడకపోవడంతో నిజమైన వికేంద్రీకరణ జరగలేదని పేర్కొన్నది.

పంచాయతీ రాజ్ వ్యవస్థను బలోపేతం చేయడం గురించి 1957లో బల్వంత్ రాయ్ మెహతా కమిటీ చాలా స్పష్టమైన అభిప్రాయాలు చెప్పింది. ప్రభుత్వ పెత్తనంలేని పంచాయతీ రాజ్ వ్యవస్థ ఉండాలనీ, ప్రతి ఐదేళ్లకూ విధిగా ఎన్నికలు జరగాలనీ, వ్యవసాయాభివృద్ధి, గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటు, సమర్థవంతమైన పౌరసేవలు ఉండాలని అభిప్రాయపడింది. ఆ తర్వాతి కాలంలో అశోక్ మెహతా కమిటీ, జీవీకే రావు కమిటీ, ఎల్.ఎం. సింఘ్వీ కమిటీ అధికార వికేంద్రీకరణ గురించి మాట్లాడాయి. అప్పట్లోనే జిల్లా ప్రభుత్వం ఏర్పాటు గురించిన ఆలోచన వచ్చింది. ప్రణాళికల రూపకల్పన, గ్రామీణ పట్టణ ప్రాంతాల సమన్వయం, వనరుల వినియోగంపై స్థానిక సంస్థల స్వీయ అధికారం వంటి సూచనలు కూడా ఉన్నాయి.

పాలనా సంస్కరణలు, వికేంద్రీకరణపై ప్రపంచస్థాయిలో వచ్చిన చర్చ నేపథ్యంలో 1994లో భారత పార్లమెంటు 73, 74 రాజ్యాంగ సవరణలను ఆమోదించింది. స్థానిక సంస్థలను 'స్థానిక ప్రభుత్వం'గా రూపొందించాలని నిర్దేశించింది. రాజ్యాంగంలోని 243వ అధికరణాన్ని పటిష్టం చేసింది. మూడంచెల వ్యవస్థ, స్థానిక ప్రభుత్వాలలో రిజర్వేషన్లు, నియమితకాలంలో ఎన్నికలు, ఫైనాన్స్ కమిషన్ ఏర్పాటు వంటి చట్టబద్ధ ఏర్పాట్లు చేసింది.

అయితే సవరణల ఆమోదం జరిగి పాతికేళ్లు నిండినా రాష్ట్రాలలో వాటి అమలు అరకొరగానే సాగుతోంది. ప్రతి ఐదేళ్లకూ ఎన్నికలు జరపాలన్న రాజ్యాంగ ఆదేశాన్ని పాలకపక్షాలు నిస్సిగ్గుగా వాయిదాలు వేస్తున్నాయి. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ల ఏర్పాటు కూడా అంతమాత్రంగానే సాగుతోంది. నిధుల పంపిణీ, పన్నుల విధింపు, సంచితనిధి కేటాయింపులు, కొత్త ఆదాయ మార్గాల అన్వేషణ వంటి నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఇష్టారాజ్యంగా సాగిస్తున్నాయి. స్టేట్ ఫైనాన్స్ కమిటీల ఊసేలేని రాష్ట్రాలు కొన్నయితే, ఏర్పాటు చేసినా వాటి నిర్ణయాల అమలును నామమాత్రం చేసే రాష్ట్రాలు కొన్ని.

గ్రామ పంచాయతీలను, పురపాలికలను సామాజిక పరివర్తనకు వాహకాలుగా వినియోగించాలన్న రాజ్యాంగ లక్ష్యం నీరుగారుతోంది. దారిద్ర్య నిర్మూలన, సుస్థిర మానవాభివృద్ధి, కులం, లింగం ఆధారంగా బలంగా కొనసాగుతున్న సామాజిక వివక్షల అంతం, ప్రజా భాగస్వామ్యం ద్వారా స్థానిక వనరుల సక్రమ వినియోగం, జీవనోపాధికి భద్రత కల్పించే వనరుల వినియోగం వంటి లక్ష్యాల సాధనకు స్థానిక ప్రభుత్వాలు బలంగా ఉండాలని ఐరాస చెబుతోంది. గ్రామసభ ద్వారా ప్రజా భాగస్వామ్యం, జవాబుదారీతనం, సేవల సామర్థ్యాల పెంపుదల జరగాలని 73, 74 రాజ్యాంగ సవరణలు నొక్కి చెప్పాయి. గ్రామ సభ, వార్డ్స్ కమిటీలు, స్థానిక ప్రభుత్వాలతో చట్టబద్ధ కమిటీలు, ఏర్పాటు చేసి వాటిని పాలనకు కేంద్రాలుగా తీర్చిదిద్దాలని పేర్కొన్నాయి. అయితే రాష్ట్రాలలో అధికార కేంద్రీకరణ నానాటికీ మితిమీరిపోతున్నది. రాష్ట్రంలో ముఖ్యమంత్రి, నియోజకవర్గాలలో శాసనసభ్యులు సకల వ్యవస్థలపైనా పెత్తందార్లుగా అవతారం ఎత్తారు. వారి వ్యక్తిగత నియంతృత్వం స్థానిక ప్రభుత్వాలను నామమాత్రంగా మార్చేస్తున్నది.

నామమాత్రపు ఎన్నికలు, నిస్సారపు రిజర్వేషన్లు ఎన్నికైన 30 లక్షలమంది స్థానిక ప్రజా ప్రతినిధులను ఉత్సవ విగ్రహాలుగా మారుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాలు , వలంటీర్ల వ్యవస్థ అధికారుల చేతికింద, అధికారులు శాసనసభ్యుల కనుసన్నల్లోనూ పనిచేయడం 'వికేంద్రీకరణ' ఏ విధంగా భ్రష్టు పట్టిందో తార్కాణంగా చెప్పవచ్చు. గ్రామ సభల, వార్డు కమిటీల మాటేలేదు. స్టాటుట్యురీ, నాన్ స్టాటుట్యురీ కమిటీల జాడేలేదు. గ్రామ సభల్లో ప్రణాళికల రూపకల్పన, జమాఖర్చుల పరిశీలన, ఆడిట్ నివేదికల సమర్పణ, లబ్దిదారుల ఎంపిక జరగాలన్న రాజ్యాంగ నిర్దేశం గాలికి ఎగిరిపోయింది. పరిపాలనలో ప్రజల భాగస్వామ్యం, జవాబుదారీతనం లేనేలేదు. పరిపాలనలో సాంకేతికత చొరబడ్డాక స్థానిక ప్రభుత్వాల మాట వినేనాథుడే లేకుండా పోయాడు. పథకాల లబ్ది ఇంటికి అందించడానికి పెద్ద యంత్రాంగాన్ని ఏర్పాటు చేసిన ప్రభుత్వం క్రిందిస్థాయిలో ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేయకపోగా తమ కార్యకర్తలకు ఉపాధి కల్పించుకోవడానికి వ్యవస్థను వినియోగించుకుంటున్నదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం ఎన్నికల ముందయినా స్థానిక ప్రభుత్వాల అధికారాల గురించిన చర్చ జరిగేటట్లు పౌర సమాజం పూనుకోవాల్సి ఉంది.

డి. సోమ సుందర్

బడి: నాడు-నేడు..

# విద్యాప్రమాణాల్లో
# అదే దిగజారుడు!

బడికి పిల్లల్ని పంపించే పేదింటి తల్లులకు ఏటా రూ.15,000 ఇచ్చే పథకాన్ని 'అమ్మ ఒడి' పేరుతో ఆంధ్రప్రదేశ్‌లోని వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రారంభించింది. చదువు, ఆరోగ్యం ప్రధానంగా ప్రభుత్వ బాధ్యతే కాబట్టి, విద్యార్థులు కేంద్రబిందువుగానే డబ్బు వ్యయాన్ని చూపుతున్నారు కాబట్టి.. సూత్రప్రాయంగా ఈ స్కీమును ఆహ్వానించాల్సిందే. కానీ విద్యలో నాణ్యతను పట్టించుకోకుండా కేవలం డబ్బులిచ్చి వదిలేస్తే దీనివల్ల ఆట్టే ప్రయోజనముండదు.

స్కూళ్లు ఎలా ఉన్నాయో 'మనబడి నాడు-నేడు' పేరుతో తన సగం పాలనాకాలం తర్వాత ప్రజల ముందుంచుతానని ముఖ్యమంత్రి జగన్ చెబుతున్నారు. స్కూళ్లను బాగుచేయటానికి 9 సూత్రాల ప్రణాళికను ప్రకటించారు. కానీ అందులో దృష్టి సారించే వెసులుబాటు లేదు.

ఇంగ్లీషు మీడియం చదువులు చెప్పే పలు ప్రైవేటు స్కూళ్లలో కూడా చదువు అధ్వాన్నంగా ఉందన్న వాస్తవాన్ని గుర్తించకుండా, విద్యాప్రమాణాలను పట్టించుకోకుండా కేవలం గోడలకు రంగులేసే పనులకే ఈ ప్రభుత్వం కూడా పరిమితమైతే.. ఏ తల్లి గర్భాన పుట్టినా తమ శక్తిని వికసింప చేసుకుని ఉన్నతస్థాయికి ఎదగాలనే కోట్లాదిమంది ఆకాంక్షలు, రాజ్యాంగ లక్ష్యాలు నాడు-నేడు అలాగే అధ్వాన్నంగానే కొనసాగుతుంటాయి.

విద్యాసంవత్సరం ప్రారంభసమయంలోనే ఏపీలో జగన్ ప్రభుత్వ పాలన ప్రారంభమైంది. 2020 సంవత్సరం మొదలయ్యేనాటికి సగానికిపైగా విద్యాసంవత్సరం గడచిపోయింది. హాఫ్ ఇయర్లీ పైబడిన 'మనబడి నాడు-నేడు'



నాణ్యమైన విద్య అంటే ఆంగ్లమాధ్యమంలో బోధనే అన్నట్లు చెప్పుకొచ్చారు. అలాగే చట్టసవరణతో రాష్ట్రంలోని పాఠశాల విద్య రెగ్యులేటరీ అండ్ మానిటరింగ్ కమిషన్ అధికారాల్ని విస్తరించారు. ఇది కూడా ఆహ్వానించదగ్గ చర్యే. కానీ, ఈ బోర్డు నిర్దేశించిన 31 అంశాలు కూడా కలగాపులగంగా తయారై, బడులపై పెత్తనానికి ఎక్కువ ప్రాధాన్యం లభిస్తూ అసలు లక్ష్యమైన విద్యాప్రమాణాలు మరుగున పడిపోతున్నాయి. గ్రామ సచివాలయాల్లోని సంక్షేమ-విద్య సహాయకులకు కూడా నాణ్యమైన విద్యకు అవసరమైన సూక్ష్మ స్థాయి పరిశీలన మీద చూస్తే విద్యాప్రమాణాల్లో ఏమాత్రం ఆశాజనక పెరుగుదల కనిపించదు. పాలనలో ఆరేడు నెలలు, అందునా కొత్తగా వచ్చిన ప్రభుత్వానికి తక్కువ సమయమనటంలో సందేహం లేదు. అందునా విద్యారంగంలో మార్పులకు సమయం పడుతుంది. కానీ దురదృష్టమేమంటే, కనీసం ఆ దిశగా చిత్తశుద్ధితో ప్రయత్నం కూడా కొరవడటం! విద్యను బాగు చేస్తున్నట్లు కనిపించటం తప్ప.. నిజంగా విద్యను బాగు చేసే కృషి జగన్ సర్కారు పాలనా కాలంలో కూడా ఇంతవరకూ మొదలవలేదు.

అమ్మ ఒడితో విద్యారంగంలో విప్లవం సృష్టిస్తున్నామంటూ

రాష్ట్ర ప్రభుత్వం భారీ ప్రచారాలు జరుపుకుంటున్న సమయంలోనే విద్యాప్రమాణాలు ఎంత అధ్వాన్నంగా ఉన్నాయో ఒక మంత్రిగారు యధాలాపంగా జరిపిన పరిశీలనలో కూడా వెల్లడైంది. 2020 జనవరి 28న ఒక ప్రముఖ తెలుగు దినపత్రికలో వచ్చిన వార్త ఇది.

"కృష్ణా జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కొండపల్లి గ్రామంలోని మహాత్మా జోతిబా పూలే బాలుర సంక్షేమ గురుకుల పాఠశాలలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి శంకర నారాయణ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి విద్యార్థుల తరగతి గదులను సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాగా, ఆయన పాఠ్యాంశాల నుంచి అడిగిన ప్రశ్నలకు విద్యార్థులు సమాధానం చెప్పలేకపోయారు. అదేవిధంగా తెలుగు సంధులు ఎన్ని అని అడిగిన ప్రశ్నకు గెస్ట్ ఫ్యాకల్టీ కూడా సమాధానం చెప్పలేకపోవడంతో మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. టీడీపీ బీసీల పార్టీ అని చెప్పుకొనే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గత ఐదేళ్ల రెసిడెన్షియల్ స్కూళ్లను గాలికి వదిలేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాఠశాలల్లో మౌలిక వసతుల కోసం మన బడి నాడు-నేడు పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. నూతన విద్యాసంవత్సరంలో 1 నుంచి 6వ తరగతి వరకు ఇంగ్లీషు మీడియం విద్యను తీసుకురానున్నామన్నారు. పేద ప్రజానీకానికి సంక్షేమ ఫలాలు అందాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. పేద విద్యార్థులకు విద్యతోపాటు స్కిల్‌డెవలప్‌మెంట్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రతి పేదింటి విద్యార్థికీ విద్య అందాలన్నదే సీఎం ఆకాంక్ష అన్నారు. విద్యావ్యవస్థను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేస్తామని మంత్రి వెల్లడించారు" అని ఆ వార్త పేర్కొంది. తొమ్మిదో నెలలోకి ప్రవేశించే సమయానికి జగన్ పాలనలో మనబడి నాడు-నేడు ఇది.



మంత్రి గారు ఇందులో ప్రస్తావించిన అంశాలు.. ఇంగ్లీషు మీడియం విద్య కావచ్చు, పేదలకు స్కిల్‌డెవలప్‌మెంట్ కావచ్చు, ప్రతి పేద విద్యార్థికీ విద్య అందించటం కావచ్చు, విద్యావ్యవస్థ ప్రక్షాళన కావచ్చు.. వీటన్నిటికీ సమాధానం ఒక్కటే- నాణ్యమైన విద్య! అంతకుముందు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆ విషయాన్ని పట్టించుకోలేదనటంలో సందేహం లేదు. కానీ ఆ స్థానంలో వచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం సరిగా పట్టించుకుంటోందా? సమస్య మూలాన్ని గుర్తించిందా? విద్యాప్రమాణాలు బాగు చేయకుండా మనబడి నాడు-నేడు అని బోర్డులు పెట్టి ఎంత ఆకర్షణీయమైన రంగుల్లో చూపినా, ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టినా ప్రజలకు, వారి పిల్లలకు ఒరిగేదేంటి?

## అసర్ నివేదికలు నాడు-నేడు

ఆంధ్రప్రదేశ్‌లో పాఠశాల విద్యాప్రమాణాలు ఎలా దిగజారుడుగా ఉన్నాయో 'అసర్ నివేదికలు నాడు-నేడు'ను చూసినా అర్థమవుతుంది. పాఠశాల విద్యావార్షిక స్థితిగతుల నివేదిక (ఏఎస్ఈఆర్- అసర్) పేరుతో ప్రథమ్ అనే స్వచ్ఛందసంస్థ 2005 నుంచి నివేదికల్ని విడుదల చేస్తోంది.

ప్రభుత్వ స్కూళ్లు, ప్రభుత్వ-ప్రైవేటు స్కూళ్లు, వందల జిల్లాల నుంచి విస్తృత శాంపిళ్లు, ప్రాథమిక, ప్రాథమికోన్నత, 14 నుంచి 18 ఏళ్ల వయసువారు, కొన్ని ఎంపిక చేసిన జిల్లాల్లో శాంపిళ్లు.. ఇలా పలు రకాలుగా గ్రామీణ భారతంపై సర్వేలు విడుదలైనా మొత్తంగా మన దేశంలో, తెలుగు రాష్ట్రాల్లో పాఠశాల విద్యాప్రమాణాలు నాసిరకంగా ఉన్నాయన్నది ఈ 15 ఏళ్లలో (మధ్యలో ఓ వార్షిక నివేదిక విడుదల కాలేదు) అసర్ నివేదికల సారాంశం.

దేశీయంగా అసర్.. ప్రామాణికమైన సర్వే. వివిధ దేశాల మధ్య చేసే 'పీసా' సర్వేలోలాగా పెద్ద జటిలమైన ప్రశ్నలు కూడా లేకుండా సర్వే చేస్తారు. 'అసర్ నాడు - నేడు' అంటూ 2005లో.. 2019లో విద్యాప్రమాణాల్ని పరిశీలిస్తే, విద్యారంగంలో ఘోరవైఫల్యానికీ, కుట్రపూరితంగానో, అజ్ఞానంతోనో ప్రభుత్వాలుగా, సమాజంగా మనం చేస్తున్న నేరసమాన నిర్లక్ష్యానికీ ఈ సర్వేలు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి.

ఏపీలో ప్రాథమిక పాఠశాల స్థాయి అభ్యసన ప్రమాణాలు నాసిరకంగా ఉన్నాయని 'ఎర్లీ ఇయర్స్' పేరుతో విడుదలైన 2019-20 'అసర్' గ్రామీణ నివేదిక కూడా వెల్లడిస్తోంది.

తొలి 8 ఏళ్లనూ పిల్లల ఎదుగుదలకు కీలకమైన తొలి సంవత్సరాలుగా నిర్వచిస్తారు. ఆరేళ్ల వయసు వచ్చేసరికి పిల్లల మెదడులో 90 శాతం ఏర్పడుతుంది కాబట్టి.. అభ్యసనానికి, సృజనాత్మకతకు, భావోద్వేగపరంగా, తెలివిపరంగా వికసించటానికి, ఎదుగుదలకు కావలసిన సరంజామాను పిల్ల, పిల్లవాడికి ఈ పునాది దశలోనే అందించాల్సిన బాధ్యత విద్యావ్యవస్థ మీద ఉంది. కానీ ఈ ఎర్లీ ఇయర్స్‌లో 1వ తరగతిలో ఉన్న పిల్లల్లో 25 శాతం మంది పిల్లలు కనీసం అంకెలను కూడా గుర్తుపట్టలేకపోతున్నారని అసర్ సర్వే వెల్లడించింది. 51 శాతం మాత్రమే ఏక అంకె కూడిక చేయగలుగుతున్నారని, 39 శాతం మాత్రమే ఏక అంకె తీసివేతని, కేవలం 40 మంది పిల్లలు మాత్రమే మౌఖిక కూడికను చేయగలుగుతున్నారని తెలిపింది.

అంకెలను గుర్తించటం, సరికూర్చటం, ప్యాట్రన్లను గుర్తించటం, ముఖంలో భావోద్వేగాల్ని, పరిసరాల్లోని వివిధ వస్తువుల మధ్య పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోవటం, తేలికపాటి పజిల్లను పరిష్కరించటం వంటి అంశాలతో పిల్లల

అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు.

పూర్వ పాఠశాల (ప్రీ స్కూలు) దశ నుంచీ మొదలుపెట్టి ఒత్తిడిలేని విద్యాప్రమాణాల్ని అందించే బాధ్యతను ఇప్పుడు జగన్ సర్కారు కూడా పట్టించుకోకుంటే, నాడు-నేడులో కేవలం రంగులు, మెరుగులు కనిపిస్తాయి తప్ప.. పిల్లలకు మాత్రం పనికొచ్చే చదువు అందదు. ముఖ్యంగా ప్రీ స్కూలులో నాణ్యమైన చదువును అందించటంలో మాతృభాష ప్రాధాన్యత ఎంతో ఉంటుందని శాస్త్రీయ అధ్యయనాలు చెబుతున్నాయి. భవిష్యత్తులో కృత్రిమ మేధతో పోటీని అధిగమించి యువత ఉపాధిని పొందాలంటే.. పూర్వ, ప్రాథమిక పాఠశాల దశలో మాతృభాషలో చదువు ద్వారా పెంపొందే భావోద్వేగ ప్రజ్ఞ ఎంతో అవసరం. అందుకే ఆంగ్ల మాధ్యమమే సర్వరోగనివారిణి అనే మంకుపట్టుకు పోకుండా, హేతుబద్ధంగా ఆలోచించి మాతృభాష తెలుగులో కూడా నాణ్యమైన పాఠశాల చదువును అందించటం మీద దృష్టి పెట్టాలి. ఆంగ్ల భాషలో అనర్గళ ప్రావీణ్యానికి ఇంగ్లీషు ల్యాబ్‌ల ఏర్పాటు వంటి అంశాల్ని కూడా ఇందులో భాగం చేయండి. ఈ రకంగా అన్ని అంశాలనూ పరిగణలోకి తీసుకుని విద్యావిధానాన్ని అమలు చేయకుంటే, ఇంజినీరింగ్ చదివి ఏమాత్రం నైపుణ్యం అవసరంలేని చిరుద్యోగాల కోసం ఎగబడే యువతే మళ్లీ తయారవుతారు. అమ్మ ఒడిని డబ్బులు పంచుడుకు, నాడు-నేడును ఆకర్షణీయ ప్రచారానికి పరిమితం చేస్తే ఓట్లు వస్తాయేమోగానీ.. ఓ చారిత్రక ఘోరాన్ని కొనసాగించినవారవుతారు, ఇంకొన్ని తరాలు తీవ్రంగా నష్టపోతాయి.



ముఖ్యమంత్రి గారూ! నాటి నుండి నేటి దాకా అసర్ సర్వేలను తెప్పించుకోండి, 'పీసా' సర్వే, యునెస్కో అధ్యయన పత్రాలను తెప్పించుకోండి, రాష్ట్రవ్యాప్త సురాజ్య యాత్ర తర్వాత 2017 డిసెంబర్‌లో లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు స్వయంగా అందజేసిన నివేదికను తెప్పించుకోండి, విద్యారంగంలో చేపట్టాల్సిన మార్పులపై కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలకు జేపీ పంపిన నోట్‌లను తెప్పించుకోండి, ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ఆధ్వర్యంలో 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్' పేరుతో 2019లో ఏపీ, తెలంగాణల్లో నిర్వహించిన విద్యాయాత్ర అనంతరం రూపొందించిన నివేదికను, ఇంకా కావాలంటే 'ప్రీ స్కూల్'కు పెద్దపీట వేసిన నూతన జాతీయ విద్యావిధానం ముసాయిదా రూపకల్పన సమయంలో కస్తూరి రంగన్ కమిటీకి జేపీ వివిధ సందర్భాల్లో ఇచ్చిన సూచనల్నీ తెప్పించుకోండి.. అసలు సంక్షోభం ఏమిటో, నాడు-నేడులో ఏం చూపించాలో బోధపడుతుంది.

## తెలంగాణలోనూ అదే తరహా నాసిరకం ప్రమాణాలు

పిల్లల ఎదుగుదలకు, మంచి సమాజానికి కీలకమైన పాఠశాల విద్యలో నెలకొన్న ఈ సంక్షోభం ఒక్క ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం కాదు. సంపన్న రాష్ట్రంగా చెప్పే తెలంగాణలోనూ, దేశవ్యాప్తంగానూ కొనసాగుతోంది. ఐదవ తరగతిలోని పలువురు పిల్లలు రెండవ తరగతి పాఠం చదవలేకపోవటం దగ్గర్నుంచి తెలంగాణలో 14-18 ఏళ్ల వయసు విద్యార్థుల్లో సగం మందికి గడియారం చూసి నిమిషాలు, సెకన్లతో కచ్చితంగా సమయం చెప్పటం రాదు.. వరకూ ఎన్నో రకాల పరిశీలనల్ని పలు అధ్యయనాల నుంచి ఉటంకించవచ్చు. ఇందులో నేషనల్ ఎచీవ్‌మెంట్ సర్వే ఉంది, తెలంగాణ ప్రభుత్వం చేయించిన అధికారిక సర్వేలు కూడా ఉన్నాయి. ఇవి పట్టణ, నగర ప్రాంతాలలో కూడా విద్యార్థుల సామర్థ్యాల్ని బేరీజు వేశాయి.

"నేను ఇటీవల ఒకటి రెండు పాఠశాలలను తనిఖీ చేసినప్పుడు పిల్లల్లో ఆశించినస్థాయి ప్రతిభ కనిపించలేదు. ఇది ఆ విద్యార్థుల తప్పు కాదు. తెలంగాణలోని కొన్ని స్కూళ్లలో పదో తరగతి వరకూ 100 శాతం పాసవుతున్నారు. ఆ తరవాత వారంతా పక్కనే ఉన్న కాలేజీకి వెళుతున్నారు. అక్కడ ఉత్తీర్ణత కేవలం 38 శాతంగా ఉంటోంది. ఇందుకు కారణం పాఠశాల స్థాయిలో విద్య నాణ్యత దెబ్బతినడమే. వంద శాతం ఫలితాలు రావాలనే లక్ష్యం వెనక ఉద్దేశం పిల్లలకు చదువు నేర్పడమే తప్ప, నేర్పకుండా పాస్ చేయడం కాదు. చదువు రాలేదని ఫెయిల్ చేయవద్దు, చదువు రాకున్నా పాస్ చేయవద్దు. చదువు నేర్పి పాస్ చేయాలి" అని మంత్రి టి.హరీష్ రావు ఫిబ్రవరి మాసంలో ఒక ప్రముఖ పత్రికలో రాసిన వ్యాసంలో స్వయంగా పేర్కొన్నారు. కానీ.. "పాఠశాలలకు ప్రభుత్వం భవనాలు కట్టిస్తుంది, ఉపాధ్యాయులను నియమిస్తుంది, వాళ్లకు జీతాలు ఇస్తుంది, నిధులు ఇస్తూ తన విధిని నిర్వర్తిస్తుంది తప్ప చదువు రాకపోవటానికి ప్రభుత్వానిది మాత్రమే బాధ్యత కాదన్నట్లు" మంత్రి చేసిన వాదనను అంగీకరించలేం. సమస్య విధానపరమైనది. అందరితో చర్చించి విధానపరమైన మార్పుకి ప్రభుత్వం ముందుకొస్తే, కచ్చితంగా పెద్ద మార్పు మొదలవుతుంది. ప్రభుత్వం లోపభూయిష్ట విధానాన్ని అనుసరిస్తూ, సమాజంలో అందరూ భాగస్వాములు కావాలని నైతిక ప్రవచనాలకు పరిమితమైతే.. అక్కడక్కడా కొంత మార్పు కనిపిస్తుందేమోకానీ, ప్రజల డబ్బు, అత్యధిక శాతం పిల్లల ఎదిగే అవకాశాలు వృథా అవుతూనే ఉంటాయి.

'ఆరేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పాలనలో బడి నాడు-నేడు' అని పరిశీలిస్తే ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయని అసర్ 2019-20 నివేదికా తెలియచేస్తోంది. ఎన్‌రోల్‌మెంట్ కన్నా, విద్యాప్రమాణాల్ని పెంచటం, ప్రీ స్కూల్ సన్నద్ధతను పకడ్బందీగా

పెంచుకోవటం, మధ్యలో మానేసేవారి సంఖ్య (డ్రాపౌట్ల)ను తగ్గించటం అసలు సవాలని సూచిస్తోంది.

## టీఎస్‌లో కరీంనగర్ జిల్లా నుంచి...

విద్యాప్రమాణాల్ని పెంచటంలో నాణ్యమైన ప్రీ స్కూల్ ఆవశ్యకత గతేడాది అసర్ సర్వే, 2017లో అంబేద్కర్ యూనివర్సిటీ, అసర్ సెంటర్ రూపొందించిన ఇండియా ఎర్లీ చైల్డ్‌హుడ్ ఎడ్యుకేషన్ ఇంపాక్ట్ స్టడీల్లో కూడా తేటతెల్లమైంది. ఈసారి ఎర్లీ ఇయర్స్‌పైనే ఫోకస్ పెట్టి దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లోని 26 జిల్లాల్లో సర్వేను నిర్వహించారు. 1,541 గ్రామాల పరిధిలో 30,425 ఇళ్లకు వెళ్లి అసర్ ప్రతినిధులు 36,930 మంది పిల్లలతో మాట్లాడి వివరాలను సేకరించి నివేదికను రూపొందించారు. తెలుగు రాష్ట్రాల్లో.. తెలంగాణలో కరీంనగర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లాలో సర్వే చేశారు. కరీంనగర్ జిల్లాలోని 60 గ్రామాలకు చెందిన 1,201 ఇళ్లలో 1428 మంది విద్యార్థులను కలిసి 4 నుంచి 8 ఏళ్ల వయసు పిల్లల స్థితిగతులపై నివేదిక రూపొందించారు. ఆంధ్రప్రదేశ్‌లో శ్రీకాకుళం జిల్లాలోని 60 గ్రామాలు, 1,172 ఇళ్లు, 1,382 మంది 4 నుంచి 8 ఏళ్ల వయసు పిల్లల విద్యాస్థాయిపై రిపోర్టు తయారుచేశారు. పాఠశాలల్లో విద్యార్థులను లింగ ప్రాతిపదికన వివక్ష చూపుతూ చేర్చటంపై కూడా నివేదిక ప్రస్తావించింది.



## అసర్ 2019-20 .. మరికొన్ని ముఖ్యాంశాలు

- 1వ తరగతి చదివే పిల్లల్లో 41.1% మంది పిల్లలు మాత్రమే రెండంకెల సంఖ్యలను గుర్తించగలుగుతున్నారు.
- ఐదేళ్ల వయసు పిల్లల్లో అంగన్‌వాడీల్లోని 44 శాతం మంది, ప్రైవేటు ప్రీ స్కూల్స్‌లోని 50 శాతం మంది, ఏ రకమైన స్కూలులోనూ చేరనివారిలో 30 శాతం మంది మాత్రమే ఒక సాధారణ ప్యాట్రన్‌ను గుర్తించగలిగారు.
- విచారం, సంతోషం, కోపం, భయం.. ఇలా నాలుగు రకాల ముఖాలున్న కార్డులను ముందుంచితే, నాలుగేళ్ల వయసులో ఉన్న పిల్లల్లో కేవలం 24 శాతం మంది మాత్రమే నాలుగు భావోద్వేగాల్నీ గుర్తించగలిగారు. ఐదేళ్ల వయసు వారిలో కొంతమెరుగ్గా 33.6% మంది అన్ని భావోద్వేగాల్నీ చెప్పగలిగారు.
- ఒకటో తరగతిలో ఉన్న పిల్లల్లో కేవలం 16 శాతం మాత్రమే తమ తరగతికి తగ్గ స్థాయిలో చదవగలుగుతున్నారు. 39 శాతం మంది ఒక్క అక్షరాన్ని కూడా చదవలేకపోతున్నారు, 29 శాతం మంది అక్షరాలను గుర్తించగలుగుతున్నారు.
- ప్రాథమిక పాఠశాలల్లో (1-8 తరగతులు) విద్యాప్రమాణాలు నాసిరకంగా ఉన్నాయి. ఉదాహరణకు 5వ తరగతిలో 50.3 శాతం విద్యార్థులు మాత్రమే 2వ తరగతి పాఠాలు చదవగలరు. 3,5 తరగతుల్లో మునుపటితో పోలిస్తే అభ్యసన స్థాయిల్లో కొంత మెరుగుదల కనిపించినప్పటికీ, 8వ తరగతి, పైస్థాయిల్లో వెనుకబాటుతనం కనిపించింది.
- తల్లిదండ్రులు అబ్బాయిల చదువు కోసం ప్రైవేటు పాఠశాలలను, అమ్మాయిల కోసం ప్రభుత్వ పాఠశాలలను ఎంచుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో 4 నుంచి 8 ఏళ్ల వయసున్న విద్యార్థుల్లో ఎక్కువమంది బాలికలే ఉన్నారు. ప్రైవేటు బడుల్లో మాత్రం బాలుర ప్రవేశసంఖ్య ఎక్కువగా ఉంది. 6-8 సంవత్సరాల వయస్సులో 62.1 శాతం బాలికలు ప్రభుత్వ పాఠశాలల్లో చేరగా, అబ్బాయిలు 52.1 శాతం వెళ్తున్నారు. దేశవ్యాప్తంగా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి పరిస్థితి నెలకొంది.
- తక్కువ వయసు గల పిల్లలను స్కూలులోకి అనుమతించడం వల్ల కూడా వారు నేర్చుకోవడంలో ప్రతికూలతలు ఏర్పడుతున్నాయి. చిన్నారుల్లో ప్రారంభ భాష, ప్రారంభ సంఖ్యలు, సామాజిక భావోద్వేగాలతో కూడిన అభ్యసన సామర్థ్యాలపై ప్రభావం చూపుతున్నాయి. పట్టణాల్లో కనిపించే ఈ ధోరణి .. ప్రస్తుతం గ్రామాలకూ పాకింది. నిర్దిష్ట వయసు మేరకు ఫస్ట్ క్లాస్‌లో ఉన్నది 46.4 శాతమే.
- 4-8 ఏళ్ల మధ్య చిన్నారుల్లో 90 శాతానికిపైగా ఏదో ఒక విద్యాసంస్థలో ప్రవేశాలు పొందారు.
- 5 ఏళ్ల వయసు చిన్నారుల్లో 70 శాతం మంది అంగన్‌వాడీలు లేదా ప్రీ ప్రైమరీ క్లాస్‌లలో చేరారు. మరో 21.6 శాతం మంది పిల్లలు అప్పటికే ఫస్ట్ క్లాస్‌లో ఉన్నారు.
- 6 సంవత్సరాలకు అంగన్‌వాడీలు, ప్రీ ప్రైమరీ క్లాసుల్లో 32.80 శాతం ఉన్నారు. మిగిలినవారిలో 46.40 శాతం ఒకటో తరగతి, 18.70 శాతం సెకండ్ క్లాస్‌లో ఉన్నారు.
- నాలుగైదేళ్ల వయసు పిల్లల్లో 56.8 శాతం మంది బాలికలు ప్రభుత్వ ప్రీ ప్రైమరీ స్కూళ్లు/అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉండగా, బాలురు మాత్రం 50.4 శాతం మందే ప్రభుత్వ సంస్థల్లో ఉన్నారు.
- 8 సంవత్సరాల వయసు గలవారు 99.50 శాతం మంది ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్నారు.

## రాజకీయ సంకల్పం కొరవడటమే సమస్యకు మూలం


మన సమాజంలో ప్రబలంగా ఉన్న నిరుద్యోగం, కులవివక్ష, చట్టవిరుద్ధపాలన వంటి లోపాల్ని సరిచేసుకోవాలంటే మంచి ప్రమాణాలున్న విద్య ఒక్కటే మార్గం. అసర్ తాజా నివేదికలో

స్పష్టంగా ప్రస్తావించిన లింగ వివక్షను, గ్రామీణ-పట్టణ, పేద-ధనిక, తక్కువ ఆదాయం-భారీ ఆదాయం అంతరాల్ని నిర్మూలించాలన్నా విద్యాప్రమాణాలను మెరుగుపరచటమే మార్గం. నిధులేమైనా సమస్యా అంటే.. అదీ కాదు. తెలంగాణ, ఏపీల్లో ఒక్కో విద్యార్థి మీదా ఏడాదికి రూ.90,000 వరకూ ఖర్చు పెడుతున్నారు. ఓబుల్‌రెడ్డి స్కూలు వంటి మంచి చదువు అందించే ప్రైవేటు పాఠశాలలో ఫీజు కంటే కూడా ఈ మొత్తం చాలా ఎక్కువ. ప్రతి బిడ్డకూ మంచి చదువు రావాలన్న రాజకీయ సంకల్పం కొరవడటమే సమస్యకు మూలంగా కనిపిస్తుంది.

పాఠశాల విద్యాప్రమాణాలను పెంచేందుకు ప్రీ స్కూల్ స్థాయిలో ఒత్తిడిలేని సన్నద్ధత నుంచి మూడో అంచె ఫెడరలిజంలో భాగంగా స్థానిక ప్రభుత్వాల సాధికారత వరకూ కేంద్ర ప్రభుత్వం, తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలూ చర్యలు తీసుకుంటే తప్ప ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు చెప్పుకునే ఏ మార్పునూ వారు తీసుకురాలేరు. భవనానికి పునాదులు లేకుండా జిగేల్ రంగులేసుకుని ఉపయోగమేంటి! చదువంటే నాణ్యమైన చదువని తెలియని ప్రజలు ఎక్కువమంది ఉన్నారు కాబట్టి.. ఓట్ల చుట్టూ పథకాలు, కార్యక్రమాలు, నినాదాలతో పొద్దుపుచ్చితే- చరిత్ర ఎన్నటికీ క్షమించదు.

## స్కూల్‌లో ముందుగానో, ఆలస్యంగానో చేర్చటం వల్ల కూడా..

చట్ట ప్రకారం మన దేశంలో ఒకటో తరగతిలో (పూర్వ పాఠశాల తర్వాత) చేరాలంటే ఐదేళ్లు నిండి ఉండాలి. కానీ ఒకటో తరగతిలో చేరిన ప్రతి 10 మందిలో సగటున నలుగురు ఐదేళ్లు నిండనివారు లేదా ఆరేళ్లు దాటినవారు ఉన్నట్లు అసర్ సర్వే వెల్లడించింది. ఒకటో తరగతిలో చేరిన వారిలో ఏడెనిమిదేండ్ల వయసువారు 36.4 శాతం ఉండగా, నాలుగైదేండ్ల వయసువారు 21.9 శాతం ఉన్నట్లుగా వెల్లడైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆరు సంవత్సరాల కంటే తక్కువ వయసు పిల్లల్లో ఐదో వంతు కంటే ఎక్కువమంది 1వ తరగతి చదువుతున్నారు. భారతీయ తల్లిదండ్రులు మాత్రం.. అలవాటు పడతారన్నట్లు తమ పిల్లలను 4 ఏళ్ల లోపే పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. అతి తక్కువ వయసులోనే ఫస్ట్ క్లాస్‌లో చేరడం ద్వారా వారి కంటే పెద్దపిల్లలే గణనీయంగా మెరుగ్గా చదువులో రాణిస్తున్నారని నివేదిక సూచిస్తోంది. అంటే అక్షరాలతో పాటు సంఖ్యలను గుర్తించగలగడం, చదవగల సామర్థ్యం ఎక్కువగా పెద్దపిల్లల్లోనే ఉంటోందని తెలిపింది. పిల్లలను చిన్నవయసులోనే పాఠశాలల్లో చేర్పించడం వారి స్కూల్ లైఫ్, విద్యాప్రమాణాలు ఇతరుల వెనుక ఉండటానికి ఒక ముఖ్యమైన కారణమని నివేదిక పేర్కొంది. ఐదు లేదా ఆరేళ్ల వయసులో పిల్లలను పాఠశాలలో (1వ తరగతిలో) చేర్చుకోవటం వారి విద్యా విజయాలను మెరుగుపరచటమే కాకుండా నేరప్రవృత్తిని కూడా తగ్గిస్తుందని స్టాన్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం అధ్యయనం, పలువురు నిపుణుల పరిశీలనలు కూడా వెల్లడిస్తున్నాయి.




## ఈ నివేదికల్ని ఎక్కువమంది చదవాలి, విశ్లేషించాలి: జేపీ

అసర్ 2019-20 'ఎర్లీ ఇయర్స్' సర్వే నివేదికను ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌కు అసర్ సెంటర్ ప్రతినిధి ఇటీవల హైదరాబాద్‌లో అందచేశారు. ఎర్లీ ఇయర్స్ నివేదికను, 14-18 ఏళ్ల వయసు విద్యార్థుల మధ్య అంతకుముందు ఏడాది అసర్ చేసిన సర్వేను ఎక్కువమంది చదవాలని, విశ్లేషించాలని జేపీ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యలో మన వైఫల్యం మన ఆర్థిక వ్యవస్థను, ప్రజాస్వామ్యాన్ని, సమాజాన్ని కుంగదీస్తోందన్నారు.

2005లో అసర్ తొలి నివేదిక విడుదల కార్యక్రమంలో డా॥ జేపీ పాల్గొని ప్రోత్సాహాన్ని అందించారు. తెలుగునాట లోక్‌సత్తా నేతలు, కార్యకర్తలు కూడా ఎక్కడికక్కడ సర్వేలో పాల్గొని సహకారాన్నిచ్చారు. పార్టీగా మారాక మాత్రమే లోక్‌సత్తా అసర్ నివేదికల్లో ప్రత్యక్షంగా పాలుపంచుకోకుండా ప్రోత్సాహాన్ని కొనసాగిస్తోంది.



## కుల మతాల కొట్లాటలాపి, పిల్లలకు నాణ్యమైన పాఠశాల

# విద్య కోసం పోరాడండి: జేపీ

భవిష్యత్ భారత నిర్మాణంలో పాఠశాల విద్య కీలకమైందని, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములైతేనే విద్యాప్రమాణాలు మెరుగుపడతాయని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

గుంటూరు పేరేచర్లలోని శ్రీ గురుకుల విద్యావనం (ఎస్.జి.వి.ఆర్ ఉన్నత పాఠశాల)లో భైరపనేని సాంబ శివరావు కాంస్య విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. విశిష్ట అతిథిగా హాజరైన శ్రీమతి రాధా జయప్రకాష్.. మానుకొండ వెంకటరత్నం క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించారు.

హాకీ పోటీలను ప్రారంభించిన అనంతరం జేపీ మాట్లాడుతూ, రాష్ట్రంలో అనేక గ్రామాలలో ఇప్పటికీ కుల మతాల పేరుతో తన్నుకుచస్తున్నారని, వాస్తవాలను గ్రహించి కుల మతాలను వీడి పిల్లల భవిష్యత్తు కోసం పోరాడాలని అన్నారు. విద్యను నిర్లక్ష్యం చేసిన సమాజానికి భవిష్యత్తు ఉండదన్నారు. విద్యావనరులు అంతగాలేని కాలంలో పాఠశాల విద్య కోసం భైరపనేని సాంబశివరావు, మానుకొండ వెంకటరత్నం వంటి వారు ఎంతో కృషి చేశారన్నారు. ప్రస్తుతం పాఠశాల విద్య ఆశించిన ప్రమాణాలతో అందటం లేదన్నారు. ప్రభుత్వ ఖజానా నుంచి డబ్బులు ఖర్చవుతున్నాయి, మన జేబులు గుల్లవుతున్నాయి గానీ అత్యధికశాతం పిల్లలకు మంచి చదువులు మాత్రం అందటం లేదన్నారు. కార్పొరేట్ విద్యావ్యవస్థలో మార్కులు, ర్యాంకులు, బట్టీయం నైపుణ్యాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి తప్ప.. సమాజానికి ఉపయోగపడుతూ సంపదను సృష్టించే చొరవ, నైపుణ్యాలు కొరవడుతున్నాయన్నారు. ఇప్పటికైనా పాలకులు పాఠశాల విద్యను బాగు చేసేందుకు తగిన చర్యలు తీసుకోకపోతే చరిత్రహీనులుగా మిగిలిపోతారన్నారు.

కార్యక్రమానికి నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు రాయపాటి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పేరేచర్ల నుంచి అమరావతి వరకు వంద కిలోమీటర్ల సైకిల్ ర్యాలీలో పాల్గొన్నవారికి జేపీ పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ ఉపాధ్యక్షుడు భైరపనేని నరేష్, ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా రామారావు, డాక్టర్ భైరపనేని రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.ఎం సుభానీ, పాఠశాల కమిటీ అధ్యక్షుడు అంబటి చెంచు సుబ్బారావు, గడ్డం రాంబాబు, పాములపాటి శ్రీనివాస్, చిట్టినేని శ్యాంసుందరరావు, చిట్టినేని లక్ష్మీనారాయణ, పాలకమండలి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధినివ్వని, సమాజం పట్టని

# చదువులెందుకు?

మార్కులు తప్ప కొలువులు, సామాజిక నైపుణ్యాలు ఇవ్వని చదువులు ఎందుకు అని లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ప్రశ్నించారు. పారిశ్రామిక విప్లవంతో ప్రపంచవ్యాప్తంగా మొదలైన ఆధునిక సామాజిక మార్పులను మన దేశం సంలీనం చేసుకోనందువల్లే భారత విద్యావిధానం నేటికీ కునారిల్లుతోందన్నారు. మరియా మాంటిస్సోరీ 150వ జయంతిని పురస్కరించుకుని 'క్రియా' పేరిట మాంటిస్సోరీ విద్యావిధానంపై ఇండియన్ మాంటిస్సోరీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగిన సదస్సులో జేపీ పాల్గొన్నారు. 'సమాజంలో విద్య పాత్ర'పై మాట్లాడారు.

చదువు అంటే కేవలం ర్యాంకులు, మార్కులు అనే భావన విద్యార్థుల్లోని సహజసిద్ధమైన ప్రతిభను నిర్వీర్యం చేస్తున్నాయని జేపీ అన్నారు. విద్యావ్యవస్థలోని అనారోగ్య పోటీతత్వం పిల్లల ప్రతిభకు అవరోధంగా పరిణమిస్తోందన్నారు. చిన్నతనం నుంచే చదువుతోపాటు పనులు, వృత్తులను నేర్చుకుంటే సమగ్ర పౌరులుగా ఎదుగుతారన్నారు. జపాన్, దక్షిణ కొరియా, స్విట్జర్లాండ్ లాంటి దేశాల్లో ఇతరులపై ఆధారపడకుండా ఎవరి పనులు వారే చేసుకునేలా శిక్షణ ఇస్తారన్నారు. సినీ నటి అక్కినేని అమల మాట్లాడుతూ, తన జీవితంపై మాంటిస్సోరీ విద్యావిధానం ప్రభావం ఉందన్నారు. తాను చెన్నైలోని కళాక్షేత్ర సంస్థలో శాస్త్రీయ నృత్యం నేర్చుకునే రోజుల్లో మాంటిస్సోరీ విద్య గురించి పరిచయమైందన్నారు. చదువుతోపాటు రోజువారీ పనులను నేర్పడమే మాంటిస్సోరీ విద్యావిధానంలోని ప్రత్యేకతన్నారు. దీనివల్ల తాను నృత్యం, పనులు, చదువులు ఏకసమయంలో కొనసాగించగలిగానన్నారు. 3-6 ఏళ్లలోపు పిల్లలకు విద్యను బోధించటంలోని మెళకువలను మాంటిస్సోరీ విద్యావిధానం శిక్షణా నిపుణురాలు అనహిత గాంధీ వివరించారు. కార్యక్రమానికి అఖిల రాం నారాయణ, వివిధ రాష్ట్రాలు, మలేషియా, పోలెండ్ నుంచి వచ్చిన ప్రతినిధులు హాజరయ్యారు.



### బాలానందం స్ఫూర్తిని నిలిపేది నాణ్యమైన విద్యే

బాలానందం స్ఫూర్తి నిలవాలంటే ప్రతి బిడ్డకూ అవకాశాలు అందించే విద్య, అందరిలో సృజనాత్మకతను బైటికి తీసే ప్రయత్నం జరగాలని జయప్రకాష్ నారాయణ్ అన్నారు. వికాస కళలను విశ్వవ్యాప్తం చేయటంలో బాలానందం పాత్ర కీలకమైందన్నారు. ఎనిమిది దశాబ్దాలుగా ఎంతోమంది కళాకారులను తయారుచేసిన ఘనత వారిదన్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో నిర్వహించిన 'ఆంధ్ర బాలానంద సంఘం' 80 ఏళ్ల పండుగలో జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పిల్లల్లో సృజనాత్మకతను గుర్తించి ప్రోత్సహిస్తే సంపూర్ణ వ్యక్తిత్వం ఉన్న పౌరులుగా తయారవుతారని శాంతా బయోటెక్ అధినేత డా॥ కె.ఐ వరప్రసాదరెడ్డి అన్నారు. సినీ నిర్మాత, దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ, నటుడు, రచయిత తనికెళ్ల భరణి మాట్లాడారు. ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి ఎస్.వేణుగోపాలాచారి పాల్గొన్నారు. ఆంధ్ర బాలానందం అధ్యక్షుడు డా॥ ఎం.చిత్తరంజన్, కార్యదర్శి జేవీ కామేశ్వరి పర్యవేక్షించారు. తొలుత బాలానందం సంస్థాపకులైన రేడియో అన్నయ్య న్యాయపతి రాఘవరావు, న్యాయపతి కామేశ్వరి అక్కయ్యల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలానందం 80 సంవత్సరాల ప్రస్థానంపై రూపొందించిన 'పిల్లల దేవుళ్లు' లఘుచిత్ర ప్రదర్శన అనంతరం బాలబాలికలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. భక్త ప్రహ్లాద నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. అన్నయ్య న్యాయపతి రాఘవరావు రచించిన పిల్లల పాటలు 'బుజ బుజ రేకులు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. డా॥ ఎం.పద్మినీ చిత్తరంజన్ రచించిన 80 ఏళ్ల పండుగ గీతాన్ని ఆలపించారు.

### 1940లో మద్రాస్‌లో ప్రారంభం

పిల్లలకు సృజనాత్మక కళలు నేర్పించాలనే లక్ష్యంతో రేడియో అన్నయ్య, రేడియో అక్కయ్య 1940లో మద్రాస్‌లో ఆంధ్ర బాలానంద సంఘాన్ని స్థాపించారు. 1956లో నాటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ఆహ్వానం మేరకు అక్టోబర్ 23న హైదరాబాద్‌లో సంఘాన్ని ప్రారంభించారు. రేడియో ద్వారా సంస్కృతి, భాష, కళలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తూనే, పిల్లల కోసం 'బాల' పేరిట పత్రికను తీసుకొచ్చారు. పలు అంతర్జాతీయ మహాసభల వేదికలపై బాలానందం విద్యార్థులు ప్రదర్శనలు ఇచ్చి ఆకట్టుకున్నారు. ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, ముఖ్యమంత్రులు బూర్గుల, నీలం సంజీవరెడ్డి, కాసు బ్రహ్మానందరెడ్డి, దామోదరం సంజీవయ్య, మర్రి చెన్నారెడ్డి, టి. అంజయ్య తదితరులు బాలానందాన్ని సందర్శించి అభినందనలు తెలియజేశారు. బాలానందంలో శిక్షణ పొందిన పిల్లలు అనేకమంది ఉన్నతస్థానాల్లో ఉన్నారు.

## కరోనా లాంటివి విరుచుకుపడితే తట్టుకునే శక్తి భారత్‌కు లేదు..

# ప్రజారోగ్య వ్యవస్థను బాగుచేసుకోవటమే మన ప్రాణాలకు రక్షణ: జేపీ


కరోనా (కొవిడ్-19) వైరస్ ముప్పు భారత్‌కూ పొంచి ఉన్నా, దానిపై దేశంలోను, ప్రపంచంలోనూ పెద్దఎత్తున చర్చ జరుగుతున్నా కనీసం వైరల్ డయాగ్నోస్టిక్ కిట్‌లను అన్నిచోట్లా ఏర్పాటు చేసే ప్రయత్నం కూడా మన పాలకుల్లో కరవైందని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌లో ఒక్క మాట కూడా రాలేదన్నారు.

"కరోనా లేదా అలాంటి మరో వైరస్ పెద్దఎత్తున వస్తే తట్టుకునే శక్తి మనకు లేదు. ఇన్నేళ్లలో మనం ఆరోగ్య వ్యవస్థను అలా విఫలం చేశాం. ఒక్కసారి లైట్ ఆన్ చేస్తే వచ్చే మార్పు కాదిది. ఇప్పుడు ఆన్ చేస్తే.. ఆరు నెలలకో, సంవత్సరానికో లైటు వెలుగుతుంది. ఇంత జరుగుతున్నా కూడా మనం కనీసం లైట్ కూడా ఆన్ చేయటంలా. ఉపద్రవం కనిపిస్తున్నా లైట్ స్విచ్‌ను సైతం ప్రభుత్వం ఆన్ చేయటంలా" అని జేపీ అన్నారు. కరోనా వైరస్.. తక్షణ, దీర్ఘకాల పరిణామాలు, ఆరోగ్య వ్యవస్థలో చేపట్టాల్సిన చర్యలపై ఆయన మీడియాతో మాట్లాడారు (ఫిబ్రవరి రెండవ వారంలో).

ప్రభుత్వం అంటే మంత్రులు మాత్రమే కాదని, ఉద్యోగులు, ఇతర యంత్రాంగం చాలా పెద్దఎత్తున ఉంటుందని, వీరి మీద ప్రజాధనం బోలెడు ఖర్చవుతుంటుందని.. వీరు కూడా ప్రజల జీవితాలపై బాధ్యత లేకుండా అరకొరగా స్పందిస్తున్నారని జేపీ అన్నారు. అదృష్టవశాత్తూ కరోనా కట్టడికి కొన్ని నెలల్లోనే టీకా వచ్చే అవకాశముందని అంచనాలు వెలువడుతున్నాయని, కానీ వైరస్ ఏ రూపాన్ని సంతరించుకుంటుందో, మళ్లీ ఏ రకంగా విరుచుకుపడుతుందో ఎవరూ చెప్పలేరని అన్నారు. వైరస్ వ్యాప్తికి ఒక్కోసారి 2-3 ఏళ్లు కూడా పట్టవచ్చన్నారు.

"ప్రధానంగా రెండు రకాల వ్యాధి కారకాలపై మనకు స్పష్టత రావాలి. 1. బ్యాక్టీరియా. 2. వైరస్. ఈ రెంటి ప్రభావాల మధ్యా తేడా మనకు తెలియాలి.

బ్యాక్టీరియాలో జీవకణం ఉంటుంది, ప్రకృతిలో కూడా జీవించగలదు. మట్టి, దుర్గంధం, మురుగునీటి కాలువల ద్వారా వ్యాపిస్తుంది. కానీ వైరస్ అలా కాదు- దానికి జీవకణం లేదు, జన్యుపదార్థం తప్ప. ఏదోక జంతువు, మొక్క లేదా మనిషి శరీరంలోకి ప్రవేశించి బతకగలిగితేనే వైరస్ ప్రభావం చూపగలదు. జెనెటిక్ మెటీరియల్ ఆర్ఎన్ఏ, డీఎన్ఏ శరీరం కణంలోకి ప్రవేశించగలిగితే కొన్ని మార్పుల్ని ప్రవేశపెడతాయి. అక్కడి నుంచి రకరకాలుగా విస్తరిస్తుంటాయి. బ్యాక్టీరియా నియంత్రణకి పెన్సిలిన్ సహా మంచి మందులున్నాయి. కానీ వైరస్‌కి మందులు అలా తేలిగ్గా అందుబాటులో లేవు. వైరస్‌లకి పనిచేసే కొన్ని రకాల మందులు వచ్చాయని ఇటీవల చెబుతున్నారు. ఉదా: ఎయిడ్స్. ఎయిడ్స్ వైరస్‌కి మందులు వచ్చాయి. మనం సరైన సమయంలో రోగాన్ని కనుక్కున్నట్లయితే ఆ రోగి ప్రాణాన్ని కాపాడగలం, ఆ రోగికి మామూలు జీవితాన్ని గడిపే అవకాశం కల్పించగలం. అలాగే టీకాలు. బ్యాక్టీరియా, వైరస్ వ్యాధిరాకుండా పిల్లలకు, పెద్దలకు




కూడా కొన్ని వ్యాక్సిన్‌లు అందుబాటులోకి వచ్చాయి. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ కృషి వల్ల వచ్చిన ఎంఎఆర్ టీకాలు ఆ కోవలోవే. ఎయిడ్స్‌కి ఇంకా టీకా రాలేదు. డెంగీ జ్వరానికి ఫిలిప్పీన్స్‌లో టీకాను ప్రయోగించారుగానీ, అది ఆచరణలో విఫలమైంది. వ్యాక్సిన్ల తయారీ చాలా సంక్లిష్టమైనది. చాలా జాగ్రత్తగా పరీక్షలు చేస్తూ తయారుచేయాల్సి ఉంది. బ్యాక్టీరియాకి వాడే యాంటీబయోటిక్స్ అంత ప్రమాదకరం కాదు. కానీ వైరస్‌ని చంపే మందులు మనకి కూడా హాని చెయ్యొచ్చు. ఈ నేపథ్యాన్ని మనం అర్థం చేసుకోవాలి.

అలాగే ఇన్‌ఫ్లుయెంజా (ఫ్లూ) అంత ప్రమాదకరం కాదు. కొంత ఒళ్లునొప్పులు, జలుబు వంటి సమస్యలున్నా, కొన్నిరోజుల్లో తగ్గిపోతుంది. కానీ కొన్ని దేశాల్లో ఇదే జబ్బు ప్రమాదకరంగా ఉంటుంది. రెండేళ్లకోసారి జన్యు మార్పులు జరుగుతుండటం వల్ల ఒకసారి టీకాను తయారుచేసినా, మళ్లీ మార్పులకనుగుణంగా అప్‌గ్రేడ్ చేయాలి. పాత టీకాలు పనికిరావు. అంటే ఒక వ్యాధికే

అయినా టీకాల తయారీ నిరంతర ప్రక్రియగా సాగుతుండాలి" అని జేపీ అన్నారు.

### పటిష్ఠ చర్యలు లేకుంటే.. ఇప్పటికీ కోట్లమందికి ముప్పు

మొదటి ప్రపంచ యుద్ధకాలంలో వచ్చిన స్పానిష్ ఫ్లూ వల్ల ప్రపంచ జనాభాలో 6 శాతం దాకా చనిపోయారని, ప్రపంచీకరణ బాగా పెరిగిన నేపథ్యంలో ఇప్పుడు మనకు అందుబాటులో ఉన్న పరిజ్ఞానాన్ని, సాంకేతికతను వినియోగించుకుని పటిష్ఠ ఆరోగ్య చర్యలు తీసుకోకుంటే వైరస్‌ల వల్ల ఇప్పటికీ కోట్ల మంది చనిపోయే ప్రమాదముందన్నారు. కరోనా వైరస్‌లాంటివి 100 కోట్లమందికి సోకితే 2 శాతం మంది చనిపోయినా మరణాల సంఖ్య 2 కోట్ల దాకా ఉండవచ్చని, ఆధునిక యుగంలో అదేమీ ఆషామాషీ సంఖ్య కాదని అన్నారు. మన దేశంలో వైరస్ నివారణ దగ్గర్నుంచీ పటిష్ట చర్యలు లేవని గుర్తించాలన్నారు.

"చరిత్రలో కొన్ని ఉదాహరణలున్నాయి. 1918-20 మధ్య, మొదటి ప్రపంచం యుద్ధం ముగిశాక, స్పానిష్ ఫ్లూ వచ్చింది. అప్పట్లో యుద్ధం వల్ల లక్షలాది సైనికులు ప్రపంచంలో వివిధ చోట్ల పనిచేశారు. ఆ రోజుల్లో ఇన్ని వసతులు, సౌకర్యాలు, మందులు, టీకాలు లేవు. దీంతో సైనికులు అటూఇటూ తిరగటం వల్ల తేలిగ్గా స్పానిష్‌ఫ్లూ వ్యాపించింది. అప్పట్లో ప్రపంచ జనాభా 160 కోట్లు ఉంది. అందులో 50 కోట్ల మందికి ఆ ఫ్లూ వ్యాపించింది. అంటే ప్రతి ముగ్గురిలో ఒకరికి సోకింది. ఐదు నుంచి 10 కోట్ల మంది మరణించారు. మనకి లెక్కలు కరెక్టుగా లేవు. 30 శాతం మంది జబ్బుపడగా, 6 శాతం దాకా చనిపోయారని అంచనా. ఆధునిక ప్రపంచాన్ని కుదిపేసిన సాంక్రమిక వ్యాధి ఏదైనా ఉందంటే, ఆ ప్యాండమిక్.. స్పానిష్ ఫ్లూ. ఇప్పుడు సాంకేతికత, ప్రపంచీకరణ పెరగటం వల్ల దేశాల మధ్య ప్రయాణాలు కూడా పెరిగిపోయాయి. ఇటీవలికాలంలో చైనాలో 'సార్స్' వైరస్ వచ్చింది. 2009లో స్వైన్‌ఫ్లూ వచ్చింది. మధ్యలో బర్డ్‌ఫ్లూ. ఇది కూడా ఆగ్నేయాసియా, చైనాల నుంచే వచ్చింది. సార్స్‌లో 100కి 10 మంది చనిపోయారు. ఆఫ్రికాలో వచ్చిన ఎబోలాలో నూటికి 90 మంది మృతిచెందారు. అదృష్టం కొద్దీ ఎబోలా లక్షల, కోట్ల మందికి వ్యాపించలేదు. ఎబోలా వ్యాపించిన ప్రాంతాలలో ముందుజాగ్రత్తతో దూరం పాటించటం వల్ల ఆ ప్రమాదం తగ్గింది. మిగతా ఫ్లూలలో ఎక్కువ ప్రయాణాల వల్ల వ్యాపిస్తున్నాయి. ఇవి తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే కోట్ల మందికి వ్యాపిస్తాయి. ఇప్పుడు చైనాలో కరోనా దాదాపు లక్షమందికి సోకిందని అధికారికంగానే చెబుతున్నారు. దీన్ని క్వారంటైన్, టెస్టింగ్‌లు, మాస్కులు వంటి పద్ధతుల ద్వారా పక్కాగా అదుపుచేయకపోతే కొంతకాలం తర్వాత కోట్లకు సోకే అవకాశముంది. రూపం మార్చుకునైనా. ప్రస్తుతం 2 శాతం మంది చనిపోతున్నట్లు అంచనా. సన్నద్ధత సరిగా లేక ప్రపంచంలో 100 కోట్ల మందికి కరోనా సోకినా, అందులో రెండు శాతం అంటే 2 కోట్ల మంది మరణించే ప్రమాదముంది. ఆధునికకాలంలో ఇది చాలా ఘోరవైఫల్యం. వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, వృద్ధులు ఎక్కువగా ప్రమాదాన్ని ఎదుర్కొనే అవకాశముంది" అని జేపీ తెలిపారు.

### చైనా స్థాయిలో మనం ఊహల్లో కూడా స్పందించలేం

చైనాలో అడవి జంతువులను ఎక్కువగా తినే ఆహారపు అలవాట్ల వల్ల జూనోటిక్ వైరస్‌లు జంతువుల ద్వారా సంక్రమిస్తాయని, మన దేశంలో పూర్వీకుల ముందు జాగ్రత్త వల్ల మాంసాహారం తినే జంతువుల్ని తినే అలవాటు మనకు దాదాపు లేదని, అందు వల్ల మన వద్ద అలాంటి సాంక్రమిక జబ్బులు పుట్టే అవకాశం తక్కువని జేపీ అన్నారు. అయితే ప్రపంచీకరణ వల్ల ఇతర చోట్ల నుంచి వచ్చినా, మారిన పరిస్థితుల వల్ల మన వద్దే వైరస్ పుట్టి తొలి దశలో గుర్తించలేక వేగంగా వ్యాప్తిచెందినా.. చైనాలాగా అలాంటి ఉపద్రవాలను ఎదుర్కొనే శక్తి ఇండియాకు లేదన్నారు.

"చైనా తదితర దేశాలుండే తూర్పు ఆసియా ప్రాంతంలో మృగాలను చంపటం అలవాటు. కారుని తప్ప భూమ్మీద వెళ్లే ప్రతిదాన్నీ.. విమానం తప్ప ఆకాశం మీద వెళ్లే ప్రతిదాన్నీ, ఓడను, జలాంతర్గామినీ తప్పసముద్రంలో వెళ్లే ప్రతిదాన్నీ తింటామని అక్కడ సరదాగా చెప్పుకుంటుంటారు. మన దేశంలో శాకాహారం తినే జంతువుల్ని తప్ప, మాంసాహారం తినే జంతువుల్ని తినే అలవాటు అరుదు కాబట్టి మన వద్ద ఆ తరహా జబ్బులు పుట్టే అవకాశం తక్కువ. కరోనా విషయంలో ఇప్పటికి ఇంకా పూర్తి నిర్ధారణలు రాకున్నా.. సాధారణంగా మనుషుల మీద ప్రభావం చూపని వైరస్‌లు ప్రమాదకర వ్యాధులుగా మారటంలో ఆహారపు అలవాట్లు పెద్దపాత్ర పోషిస్తున్నాయని మనం గుర్తించాలి. పూర్వం కంటే మనకు నియంత్రణ, చికిత్స అవకాశాలు మెరుగ్గా ఉన్నా.. ఇటువంటి వ్యాధులు విజృంభిస్తే తట్టుకునే అవకాశం ఇండియాకు లేదు.

ఈ వైరస్‌లను అన్ని సందర్భాల్లో మొదట్లోనే గుర్తించగలం, వెంటనే అదుపు చేయగలం అనుకోవటం పొరపాటు. వైరస్ మ్యూటేషన్ల తీవ్రతకు, కొత్త వైరస్‌లకు, జిల్లాలు, రాష్ట్రాల సరిహద్దుల్ని దాటి ప్యాండమిక్‌గా మారే ప్రమాదానికి జనసాంద్రత గల దేశంగా మనం ఎప్పుడూ సన్నద్ధంగా ఉండాలి. కరోనా విషయంలో తొలుత కొన్ని తప్పిదాల్ని చేసినా.. వ్యాధిని ఎదుర్కొనే పనిని చైనా సమర్థవంతంగా చేసింది. చాలావేగంగా వ్యాధిరాకుండా ఐసొలేషన్ వార్డులు, క్వారంటైన్ మొదలైనవాటిని అందుబాటులోకి తెచ్చింది. అందుకు కావలసిన యంత్రాంగం, ఆర్థిక వనరులు, నైపుణ్యం చైనాకు పుష్కలంగా ఉన్నాయి. మనకు ఇక్కడ వైరస్ పరీక్షా కేంద్రం ఒక్క పూణెలో మాత్రమే ఉంది. ఆ మౌలిక సదుపాయాలు ఇంకెక్కడా లేవు" అని జేపీ అన్నారు.

### కరోనాను అవకాశంగా ఉపయోగించుకోవాలి..

### 600 జిల్లా కేంద్రాల్లో వైరాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేయాలి

కనీసం కరోనా పరిస్థితిని అవకాశంగా తీసుకుని ఓ వంద పెద్ద పట్టణాలు, నగరాల్లో వైరాలజీ ల్యాబ్, కిట్లు వంటివి కనీస స్థాయిలో ఏర్పాటు చేయాలని జేపీ అన్నారు. కరోనానో, రేపు ఇదే వైరస్ మరోరూపంలోనో, ఇంకో కొత్త వైరస్సో వచ్చినా తట్టుకునేందుకు తగిన ఏర్పాట్లను ఇప్పటి నుంచే చేయాలన్నారు.

"మనకు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లేదు. కరోనా పరిణామాల్ని అవకాశంగా వినియోగించుకోవాలి. మొన్న బడ్జెట్‌లోనే చేస్తారనుకున్నాను. కరోనా భయాలు మన ప్రజల్లోనూ ప్రవేశించినా ప్రభుత్వం స్పందించలేదు. 600 జిల్లా కేంద్రాల్లో వైరాలజీ ల్యాబ్‌లు, ఇతర ఏర్పాట్లు చేయాలి. మొదట 15-20లో మొదలు పెట్టి, ఆ తర్వాత అన్ని జిల్లాలకూ విస్తరించవచ్చు. జిల్లాకు 1 కోటి - 2 కోట్లు అవుతాయి. హైదరాబాద్‌లో అంతర్జాతీయ ప్రమాణాలు గల సీసీఎంబీ ఉంది. కానీ ప్రజలకు నిత్యఆరోగ్యావసరంగా ఉపయోగపడాలంటే ప్రతి జిల్లాలో ల్యాబ్‌ను అందుబాటులోకి తేవాలి. అలాగే ప్రైవేటు రంగంలో ఉన్న ల్యాబ్స్‌ని ఉపయోగించుకోవచ్చు. అయితే ఆ ల్యాబ్స్‌కి కరోనా వైరస్ జీనోమ్ వివరాలని ప్రభుత్వం అందించాలి. ఇప్పటివరకు పరిజ్ఞానాన్ని అందించలేదు. టీకా కూడా కావాలి. టీకాని అభివృద్ధి చేసి, ఉత్పత్తి చేసే శక్తి ఇండియాకి కూడా ఉంది. ప్రపంచంలో సగం కంటే ఎక్కువ టీకాల్ని ఇండియాలోనే తయారుచేస్తున్నారు. ఆ సంస్థలకి ప్రభుత్వం సాయం చేయకుండా కరోనా టీకా సాధ్యం కాదు. వ్యాపారంలో ఉన్నవారి శక్తిని, టెక్నాలజీని ఉపయోగించుకోవటానికి ప్రభుత్వం, సమాజం ముందుకు రావాలి. వేగంగా ప్రయత్నిస్తే 6 నెలల్లో టీకా వచ్చే అవకాశముంది. ఉత్పత్తిలో మనం ముందుండేలా ఉత్పత్తి కంపెనీలను ప్రోత్సహించాలి. అలాగే రెండోది, అవసరమైనవారికి టీకాల్ని సరఫరా చేయగలగాలి. ఆయుర్వేద, హోమియోపతిలో వైరస్‌కి మందులున్నట్లుగా ఆధారాలు లేవు. టీకాల్ని సరయిన పర్యవేక్షణ లోనే తయారుచేయాల్సి ఉంటుంది. లేకుంటే విషపూరి తంగా వికటించే అవకాశం ఉంది. మందులు విజయవంతంగా పని చేయటం మొదలైతే ఔషధాన్ని ఉత్పత్తి చేసే శక్తీ ఇండియాకి ఉంది. మిగతా దేశాల కంటే తక్కువ ధరకే మనం ఔషధాల్ని అందించగలం. ఆఫ్రికాలో ఎయిడ్స్ ప్రబలినప్పుడు అమెరికా వంటి దేశాలు ఖరీదైన మందుల్ని ఉత్పత్తి చేసేవి. ఎప్పుడైతే ఇండియా ఈ మందుల రంగంలో ప్రపంచ మార్కెట్‌లోకి ప్రవేశించిందో, అప్పుడు ఎయిడ్స్ మందులు రూ. 100 నుంచి 5లకు పడిపోయాయి. దీనివల్ల అనేకమంది ఆఫ్రికన్లు బతికిబట్టకట్ట గలిగారు. కొన్నిటిలో మనం అధ్వాన్నం, కొన్నిట్లో బాగున్నాం. ప్రపంచంలో అతి తక్కువ ఖర్చుతో మందుల ఉత్పత్తి ఇండియాదే. దీన్ని ప్రోత్సహించి పెంపొందించుకోగలిగితే ఆర్థికంగా కూడా దేశానికి లాభం" అని జేపీ అన్నారు.

**"కోట్ల సంఖ్యలో వచ్చి పడే మిడతల దండును నియంత్రించటానికి గతంలోనే ప్రొటోకాల్స్ ఉన్నాయి. కానీ ఈసారి రాజస్తాన్‌లో పంటలు ధ్వంసమైనాయని వార్తలు వస్తున్నాయి. కరోనా వైరస్ వంటి వాటి విషయంలో ముందు జాగ్రత్త చర్యలతో సన్నద్ధంగా ఉండాలి తప్ప, వచ్చాక గుండెలు బాదుకుని ప్రయోజనముండదు".**
**- డా॥ జేపీ**

### బలమైన ప్రజారోగ్య వ్యవస్థను శాశ్వతంగా నిర్మించుకోవటమే అంతిమ పరిష్కారం, ప్రాథమిక, కుటుంబ ఆరోగ్య వ్యవస్థని పటిష్ఠంగా ఏర్పాటు చేసుకోవాలి

కరోనా వైరస్‌లాంటివి విజృంభించినప్పుడు గుండెలు బాదుకోవటం, కరోనా వల్ల ప్రమాదం లేదని తెలిసాక మళ్లీ అంతా మర్చిపోయి నిర్లక్ష్యం చేయటం లాంటి ధోరణుల వల్ల మనం ఆరోగ్యానికి ఎప్పటికీ రక్షణ చేకూరదని జేపీ అన్నారు. వైరస్‌ల విషయంలో ముందు జాగ్రత్తల దగ్గర్నుంచి అన్ని రకాల వ్యాధులకూ నాణ్యమైన వైద్యాన్ని ఆర్థికభారం లేకుండా అందించే ప్రజారోగ్య వ్యవస్థను నిర్మించుకోవటం మన ఆరోగ్యానికి అంతిమంగా రక్షణన్నారు. ప్రాథమిక, కుటుంబ ఆరోగ్య వ్యవస్థని పటిష్ఠంగా ఏర్పాటు చేయకుండా అంటువ్యాధులని అరికట్టటం అసాధ్యమన్నారు.

### "కరోనా ఎమర్జెన్సీ పాఠాలతోనైనా మనం ఆరోగ్య వ్యవస్థను బాగుచేసుకోవాలి.

వైరస్‌ల విషయంలో తగిన ముందుజాగ్రత్తలు, తక్షణ స్పందనలు తప్ప మిగిలినవి మానవ తప్పిదం కాకపోవచ్చు. కానీ దోమల వల్ల వచ్చే డెంగీ వ్యాధిని ఆపటానికి కూడా మన పాలకులు తగిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. జాతీయ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకూ ఇదే వైఫల్యం.

డెంగీ సోకాక ఆరోగ్యశ్రీలో పెట్టటం, అందులో కూడా డబ్బులు సకాలంలో సర్దలేక విన్యాసాలు చేయటం, ప్లేట్‌లెట్స్ ఎక్కించటం గురించి మాట్లాడటం తప్ప.. డెంగీ నివారణకు దోమల నియంత్రణకు పటిష్ఠ చర్యల్ని మాత్రం ప్రభుత్వాలు తీసుకోవటం లేదు. తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యాన్ని ఎలా అందివ్వాలని ప్రయత్నించకుండా.. అతితక్కువ ఫలితాలు, అతి ఎక్కువ ఓట్లు వచ్చేలా నిధుల్ని ఖర్చు చేస్తున్నారు. ఆరోగ్య రంగానికి వెచ్చించే అరకొర డబ్బుల్ని కూడా దుర్వినియోగం చేస్తున్నారు. వ్యాధి ముదిరాక ఆరోగ్యశ్రీ చికిత్స కాకుండా.. వ్యాధి నివారణకు, తొలి దశలోనే నియంత్రణకు డబ్బు ఇవ్వటం లేదు. ప్రజారోగ్య విధానం పట్ల ఇంత నిర్లక్ష్యం వల్ల 70-80 శాతం మంది ప్రజలు చికిత్స కోసం జేబుల్లో నుంచి ఖర్చు చేస్తున్నారు. కేవలం ఆస్పత్రి ఖర్చులు భరించలేక ఏటా ఐదారుకోట్ల మంది ప్రజానీకం దిగువ మధ్యతరగతి నుంచి పేదరికంలోకి జారిపోతున్నారు.

పార్టీల, ప్రభుత్వాల ధ్యాసంతా ఎట్లాగొట్లా ఓట్లు సంపాదిద్దామని తప్ప.. ఓటర్ల ప్రాణాల్ని కాపాడదామని, వాళ్ల తెలివితేటల్ని వికసింపచేద్దామని, వాళ్ల ఆదాయాల్ని పెంచుదామని కాదు. ప్రజల్ని బిచ్చగాళ్లని చేయటం ఎట్లా, డబ్బులు పంచి లొంగదీసుకోవటం ఎట్లా, వాళ్లలో కులం, మతం వంటివి చొప్పించి వాళ్లని ఉన్మాదుల్ని చేయటం ఎట్లా అని మాత్రమే ఆలోచిస్తున్నాయి. ప్రజల ఆలోచనని పెంచటం ఎట్లా, వాళ్ల కాళ్ల మీద వాళ్లు నిలబడేలా చేయటం ఎట్లా అన్న సంకల్పమే పార్టీల్లో, పాలకుల్లో కొరవడింది.

కనీసం ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోండి. ప్రజల్లో ఆందోళన ఉంది. అవకాశంగా తీసుకుని ఒక బలమైన, వ్యాధుల్ని

నివారించగల ఆరోగ్య వ్యవస్థను తాత్కాలికంగా కాకుండా, శాశ్వతంగా నిర్మించండి. రేపు కరోనా వైరస్ తగ్గిపోతే మర్చిపోతాం. కానీ ఇది ఇక్కడితో ఆగదు. రేపు ఇంకోటి, ఎల్లుండి మరోటి వస్తుంది. ఇలాంటివి ప్రజల ప్రాణాలతోనే కాకుండా, దేశ ఆర్థిక వ్యవస్థతో కూడా చెలగాటమాడతాయి" అని జేపీ హెచ్చరించారు.

## డాక్టర్ల పాత్ర 5-10 శాతమే

"ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థ విఫలమవటం వల్ల ఆ భారమంతా డాక్టర్ల మీద పడుతోంది. వైద్యం విఫలమైతే ఆ బాధను ఎదురుగా తెల్లచొక్కా వేసుకున్న డాక్టర్, యూనిఫాంలో ఉన్న నర్సు మీద ప్రదర్శిస్తున్నారు. డాక్టర్ల మీద దాడి రోగులకీ మంచిది కాదు. నష్టపోయేది వైద్యవృత్తితోపాటు సమాజం కూడా. డాక్టర్ కంటే కష్టమైన వృత్తి లేదని చెప్పవచ్చు. అందుకే.. ఆరోగ్య రంగంలో ఉన్నా కూడా డాక్టర్లకు మిగతావాళ్ల కంటే సరాసరి జీవితకాలం 4 ఏళ్లు తక్కువ. వైద్యవృత్తిపరంగా ప్రజల్లో అవగాహన లేకపోవటంతోపాటు ఆరోగ్యవ్యవస్థ వైఫల్యమే ఈ పరిస్థితికి కారణం.

బ్రిటన్‌లో అదనపు ఆదాయం కోసం జూనియర్ డాక్టర్లు సమ్మె చేస్తే నూటికి 90 మంది ప్రజలు సమర్థించారు. ఎందుకంటే, బ్రిటన్‌లో అందరికీ నాణ్యమైన ఆరోగ్యాన్ని జేబులో నుంచి ఖర్చు లేకుండా అందించే విశ్వసనీయ వ్యవస్థను ఎప్పుడో 1948లోనే నిర్మించారు. అదే మన దగ్గర డాక్టర్లు సమ్మె చేస్తే నూటికి 95 శాతం మంది ప్రజలు జీతాల పెంపును వ్యతిరేకిస్తారు. ప్రాణాలు కాపాడే డాక్టర్లను తిట్టటం, కొట్టటంకన్నా వాళ్ల సేవల్ని సరిగా వినియోగించుకునే ఆరోగ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకోవటం మీద మనం దృష్టి పెట్టాలి. మానవ సమాజ చరిత్రలో ఎన్నడూ లేనిరీతితో ఎన్నో వ్యాధుల్ని ఇప్పుడు ఆపగలం, చికిత్స చేయగలం,. అందుకే 1500 సంవత్సర సమయంలో కేవలం 30 కోట్లు ఉన్న ప్రపంచ జనాభా ఇప్పుడు 700 కోట్లకు చేరింది. ఐదున్నర శతాబ్దాల్లో ఇన్ని రెట్లు పెరిగింది. కానీ మనం దేవుళ్లం కాదు. వివిధ కారణాల వల్ల అడపాదడపా కరోనాలాంటి తీవ్రవ్యాధులు తలెత్తుతుంటాయి. ప్రపంచస్థాయి పరిజ్ఞానం, సమాచారం, పరికరాలు, సాంకేతికత అందుబాటులో ఉన్నాయి. వ్యాక్సిన్లు ఉన్నాయి. కొన్నిరకాల ప్రమాదాలకు ముందుజాగ్రత్తలున్నాయి. బెంబేలెత్తి పోవాల్సిన పన్లేదు. నేను కరీంనగర్‌లో శిక్షణ పొందుతున్నప్పుడు.. స్కైలాబ్ పడుతుందని విపరీత ప్రచారం జరిగింది. అప్పట్లోనే అనేకమంది కోట్ల రూపాయల మేర ఇన్సూరెన్స్‌లు కూడా చేసుకున్నారు. దానివల్ల పెద్ద నష్టం ఉండదన్నా ఎవరూ వినలేదు. చివరకు సముద్రంలో పడి సద్దుమణిగింది. ఇప్పుడు కూడా గుండెలు బాదుకోవాల్సిన పన్లేదు. కానీ ఇప్పటికీ మేలుకోకపోతే, ఇక ముందు ఇలాంటి ఉపద్రవాలు రాకుండా తగిన చర్యలు తీసుకోకపోతే మన స్పందనకు అర్థముండదు. మనం హోటళ్లలో తాగేనీటిని వేళ్లు పెట్టి గ్లాసుల్లో ఇవ్వటం ఇప్పటికీ కొనసాగుతోంది. ఇలాంటి, చేతులు శుభ్రం చేసుకోవటం లాంటి చిన్న విషయాల్లో కూడా మనం జాగ్రత్త పడకపోవటం వల్ల మనలో లక్షలాదిమంది అకాల మరణాలకు, అనారోగ్యాలకు గురవుతున్నారు. ఇలాంటి చిన్న అంశాలతో మొదలుపెట్టి వ్యాధి నివారణ దగ్గర్నుంచి నాణ్యమైన చికిత్సను, ఆరోగ్యాన్ని అందించే ప్రజారోగ్య వ్యవస్థలను, పాలనా పద్ధతుల్ని మనం అభివృద్ధి చేసుకోవాలి.

ప్రపంచ దేశాల ఆరోగ్య వ్యవస్థల్ని సమగ్రంగా అధ్యయనం చేయటంతోపాటు జాతీయ హెల్త్ మిషన్ రూపకర్తగా చెబుతున్నాను.. భారత్‌కు తక్కువ ఖర్చుతో అందరికీ ఆరోగ్యాన్నందించే అవకాశం ఉంది. అలాంటి విధానాన్ని ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కూడా పంపాను. మన పక్కన ఉన్న అవినీతి ఎక్కువగా ఉన్న చిన్న దేశం బంగ్లాదేశ్ కూడా ఆరోగ్య సేవల్లో మనకంటే మెరుగ్గా ఉంది. ప్రజారోగ్యంలో డాక్టర్ల పాత్ర 5-10 శాతం మాత్రమే. మిగిలింది ప్రజారోగ్య వ్యవస్థలో భాగంగా ప్రభుత్వ బాధ్యత" అని జేపీ వివరించారు.

> **"బయలాజికల్, రసాయన ఆయుధాల తయారీని ప్రపంచం చాలా ఏళ్ల క్రితమే నిషేధించింది. చైనా బాధ్యత గల నాగరిక దేశాల్లో ఒకటి. తమ ప్రజల విద్య, ఆరోగ్యం కోసం, వారి ఆదాయాల్ని పెంచటం కోసం విశేష కృషి చేసిన దేశం. అలాంటి దేశం బయోవెపన్‌ల తయారీలో భాగంగా కరోనా వైరస్‌ను వెదజల్లిందంటే నమ్మటానికి ఆధారాలు లేవు. కాబట్టి ఇది వాస్తవం కాదు. ఒకవేళ చైనా అలాంటి పనే చేసి ఉంటే ఎల్లకాలం దాగదు. బయో ఆయుధాల్ని ఉపయోగిస్తున్న కొన్ని అనాగరిక దేశాల మీద ప్రపంచ సమాజం కఠిన చర్యల్ని తీసుకోవాలి. ఇకముందు అలాంటి ఉత్పాతం తలెత్తకుండా పటిష్ట నిబంధనల్ని అమలు చేయాలి".**
>
> **-డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

## ఇవి బోర్ కొట్టటమంటే.. మన జీవితాలు మనకు బోర్ కొట్టటమే

"ప్రజల ప్రాణాలను కాపాడే ఆరోగ్య వ్యవస్థను నిర్మించటం ప్రభుత్వం బాధ్యత. మన బతుకులను బాగుచేసేది విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత, నాణ్యమైన పౌరసేవలు వంటి అంశాలే. రాజకీయం, విధానాలు, పాలన.. ఈ మౌలికాంశాల మీదే దృష్టి సారించాలి. అందుకే మళ్లీ మళ్లీ ఇవే అంశాలు చెబుతున్నా. ఇవి బోర్ కొడుతున్నాయంటే, మన జీవితాల పట్ల మనకే ఆసక్తి లేనట్లు. ఐదువేల సంవత్సరాల అవిచ్ఛిన్న చరిత్ర, సంస్కృతి కలిగిన భారత్ తన భవిష్యత్తును కూడా ఉజ్వలంగా నిర్మించుకునే శక్తిని ప్రదర్శిస్తుందని నమ్ముతున్నాను" అని జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

### విద్య, ఆరోగ్యం, అధికార వికేంద్రీకరణలకు ఓట్లు వస్తాయని రుజువు చేసిన ఢిల్లీ..

# అన్ని పార్టీల్లో అంతర్మథనం కావాలి.. ఈ పాఠాలు దేశంలో మార్పుకి నాంది కావాలి: జేపీ

విద్య, ఆరోగ్యం, అధికార వికేంద్రీకరణలకు ఓట్లు వస్తాయని రుజువు చేస్తూ ఢిల్లీలో ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆప్) సాధించిన ఘనవిజయం భారతదేశానికి చారిత్రక అవసరమని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. దేశ రాజకీయాల్ని మార్చే ఒక మార్గంగా దీన్ని చూడాలన్నారు. ఆప్ ఓడిపోయి ఉంటే.. నిజాయతీగా, డబ్బు, మద్యం పంచకుండా చేసే రాజకీయానికి ఓట్లు పడవు, విద్య, ఆరోగ్యం కంటే కులం, మతం వంటి వాటికే ఓట్లు పడతాయి వంటివి నానుళ్లలా మరో పాతికేళ్లపాటు కొనసాగి ఉండేవన్నారు. ఈ పాఠాలు దేశమంతా మన ప్రజాస్వామ్యాన్ని మెరుగుపరచటానికి నాంది కావాలన్నారు. ముఖ్యంగా నగరాల్లో.. మార్పుకి అవకాశాలు ఇప్పటికిప్పుడే మనకు అందుబాటులో ఉన్నాయన్నారు.

ఢిల్లీ తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై మీడియాతో జేపీ మాట్లాడుతూ.. 2013లో, 2015లో సాధించిన విజయాలకంటే 2020లో ఆప్ సాధించిన విజయం గొప్పదన్నారు. భారత్‌లో విద్య, ఆరోగ్యాలకు ఎందుకు ఓట్లు రావు అని ప్రపంచంలో చాలామంది అడుగుతుంటారని, 'మేం విద్య, ఆరోగ్యం కోసం పనిచేశాం.. ఓటివ్వండి' అని దేశ చరిత్రలో మొదటిసారిగా ఓ పార్టీ ఈ ఎన్నికల్లో ఓటు అడిగి గెలిచిందన్నారు. దీంతోపాటు.. దేశంలో ఎవరూ ఎదుర్కోలేకపోతున్న, కేంద్రంలో అధికారంలో ఉన్న, విపరీతంగా డబ్బును వెదజల్లగలిగిన, మీడియాను ఏ స్థాయిలోనైనా శాసించగలిగిన, ఎన్నికల కోసం ఎంత బలగాల్నయినా మోహరించగలిగిన బీజేపీని, ప్రధానమంత్రి వ్యక్తిగత ఆకర్షణను, ఐదేళ్లు అధికారంలో ఉండటమనే ప్రతికూలతనూ అధిగమించి ఆప్ విజయం సాధించటం చిన్న విషయం కాదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 56 శాతం ఓట్లురాగా, ఆప్‌కి 18 శాతం ఓట్లు వచ్చాయని, కేవలం కొన్ని నెలల వ్యవధిలో సుమారు 50 శాతం ఓట్లతో మళ్లీ అధికారంలోకి రాగలిగిందన్నారు. ఓ పార్టీకి ఓట్లు ఇంత వేగంగా ఈ స్థాయిలో పెరిగిన దాఖలాలు ప్రపంచ చరిత్రలో లేవన్నారు. ఇది వాస్తవానికి ఏ పార్టీ ఓట్లు తగ్గటమో పెరగటమో కాదని, ప్రజలు లోక్‌సభ ఎన్నికలో ఒకలా, ఢిల్లీ నగరరాజ్య అసెంబ్లీ ఎన్నికల్లో ఇంకోలా తమకు ప్రయోజనకరమనుకున్నరీతిలో ఓటు వేసే పరిణతిని ప్రదర్శించారన్నారు. ఢిల్లీ పేరుకు రాష్ట్రమే అయినా, అక్కడ ముఖ్యమంత్రి గణనీయంగా అధికారాలున్న మేయర్‌తో సమానమని, ఈ స్థానిక స్వయంపాలన వల్ల ప్రజల్లో



**విద్యారంగాన్ని రాజకీయానికి, పాలనకు కేంద్రబిందువు చేసే లక్ష్యంతో పాఠశాల విద్యాపద్ధతుల్ని పరిశీలించేందుకు 'ఎక్స్‌ప్లోఎడ్యుకేషన్' పేరుతో 2019లో ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా నిర్వహించిన విద్యాయాత్రలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌తో జేపీ. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పంజాబ్, హర్యానా, ఢిల్లీల్లో ఇప్పటిదాకా విద్యాయాత్ర కార్యక్రమం జరిగింది.**

ప్రజాస్వామ్య చైతన్యం పెరిగిందన్నారు. సమర్థులైన, ఆలోచనాపరులైన యువత (ఇంటలెక్చువల్ క్యాపిటల్) దేశం మొత్తం కంటే ఢిల్లీలో ఎక్కువగా ఉండటం, దేశంలోని ఇతర ప్రాంతాల నుంచి లోక్‌సత్తా, ఇతర సంస్థలకు చెందినవారు కూడా అక్కడ వలంటరీగా పనిచేస్తుండటం వంటి అంశాలు కలిసివచ్చాయన్నారు. అందుకే సీఏఏ, ఎన్ఆర్‌సీ, ఎన్‌పీఆర్, రామజన్మభూమి, షాహీన్‌బాగ్ వంటివి ఎన్ని రకాలుగా రెచ్చగొట్టినా.. వాటన్నిటికన్నా తమ రోజువారీ జీవితం, తమ పిల్లల చదువు, ఆరోగ్యం వంటి అంశాలకే ప్రజలు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారన్నారు. అమెరికా వంటి పరిణతి

ప్రజాస్వామ్యంలో కూడా మతం, జాతి వంటి భావాలను రెచ్చగొడితే ప్రజల్లో కొంత ఓట్లు వస్తాయని, కానీ ఆ ధోరణి ఎల్లకాలం సాగదని, ఇప్పుడు ఆప్ విజయం కూడా అదే రుజువు చేస్తోందని అన్నారు.

అయితే దేశంలోని ఇతర చోట్ల ఇదే రీతిలో ఫలితాలు వెంటనే వచ్చే అవకాశం లేదని జేపీ అన్నారు. లోక్‌సత్తా రెండు, మూడు దశాబ్దాలుగా ఇదే ఎజెండా కోసం పోరాడుతున్నా, ఢిల్లీలో తలసరి ఆదాయం ఎక్కువగా ఉండటంతో పాటు స్థానికంగా అధికారాలున్న పాలన వల్ల తాము వేసే ఓటు- తమ ఆదాయావకాశాలకు, ఆరోగ్యానికి, తమ పిల్లల చదువుకు, భవిష్యత్తుకు ఉపయోగపడుతుందని ప్రజలు గుర్తించారన్నారు. హైదరాబాద్, బెంగళూరు, ముంబయి నగరాల్లోని మేయర్లకంటే ఎక్కువ అధికారాలున్నప్పటికీ, ప్రపంచంలోని ప్రముఖ నగరాల్లోని మేయర్లకున్న అధికారాలు ఢిల్లీ ముఖ్యమంత్రికి లేవని, ఆ పరిమిత స్థానిక సాధికారతకు కూడా ప్రజలు స్పందించారన్నారు. భూమి, శాంతిభద్రతలు, పోస్టింగులు వంటి విషయాల్లో ఢిల్లీ ప్రభుత్వానికి అధికారం లేదన్నారు. కనీసం ఢిల్లీ స్థాయిలోనైనా మనం నగరాల్లో స్థానిక పాలనకు స్వయంప్రతిపత్తి కల్పిస్తే ప్రజలు విజ్ఞతతో స్పందించటం మొదలుపెడతారన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో మన ఓటుకు-మన జీవితాలకు సంబంధంలేనిరీతిలో ఎన్నికల్ని నిర్వహించుకుంటున్నామన్నారు.

ఓటుకు-ప్రజల జీవితాలకు సంబంధముండేలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసుకునేందుకు పార్టీలకతీతంగా ఢిల్లీ ఎన్నికల నుంచి అన్ని రాష్ట్రాల్లో పాఠాలు నేర్చుకుంటే మనం ఢిల్లీ తరహా మార్పును సాధించుకోగలమని జేపీ అన్నారు. ఢిల్లీలో ఆరోగ్యంపై మంచి ఫలితాల్ని సాధిస్తున్నా, విద్య కోసం ఇంకా చేయాల్సి ఉందని, ఢిల్లీ పొరుగున ఉన్న హర్యానాలో ఆరోగ్యంతోపాటు బాలికావిద్యపై మంచి ప్రయత్నం జరుగుతోందని, ఇలా అన్ని రాష్ట్రాలూ చొరవ చూపాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు, ఇతర అవసరాల కోసం రాజకీయ నాయకుల అండ కోరుకునే గ్రామీణ ప్రాంతాల్లో వెంటనే ఇలాంటి మార్పు కష్టం కావచ్చుగానీ, కానీ మనం కాస్త తలచుకుంటే పట్టణ, నగర ప్రాంతాల్లో ఇలాంటి మార్పును సాధించవచ్చున్నారు. స్థానిక ప్రభుత్వాలకు సాధికారతనిస్తూ కనీసం నగర ప్రభుత్వాలకైనా నిధుల్ని, విధుల్ని అందిస్తే మార్పు మొదలవుతుందన్నారు. తెలంగాణలో ఇటీవల పోటాపోటీగా మునిసిపల్ ఎన్నికలను నిర్వహించారని, రూ.1000 కోట్లు ఖర్చయిందంటున్నారని, కానీ స్థానికంగా అధికారాల్ని ఇవ్వకపోతే మౌలికంగా పెద్ద మార్పేమీ రాదని అన్నారు. అధికార వికేంద్రీకరణ, విద్య, ఆరోగ్యం మీద దృష్టి పెడితే భారత్ వంటి పేద దేశంలో కూడా ఆ మేరకు మతం, కులం వంటి వాటికతీతంగా మంచి మార్పు సాధ్యమవుతుందన్నారు.

ఆప్ విజయంపై ప్రధాన పార్టీల్లో అంతర్మథనం రావాలని జేపీ అన్నారు. తాము కేవలం పల్లకీలు మోసే బోయీలంకాదని, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసి తమకు అవకాశం ఇస్తే ప్రతిభ చూపుతామని పార్టీల నాయకులు కూడా గళం విప్పాలన్నారు. మొత్తంగా ఆప్ విజయాన్ని పార్టీలకతీతంగా ప్రజాస్వామ్య బలోపేతానికి ఓ పెద్ద అవకాశంగా భారతదేశం ఆహ్వానించాలని, ఆస్వాదించాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

## మేడారం జాతరకు నార సంచుల్ని ఆవిష్కరించిన జేపీ



లోక్‌సత్తా గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు దోసపాటి రాము మేడారం జాతరలో పర్యావరణహితమైన నార సంచుల్ని పంపిణీ చేశారు. అంతకుముందు పంపిణీకి సిద్ధం చేసిన నార సంచుల్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఆవిష్కరించారు. ప్రజలు పాలిథిన్ సంచులను వాడకుండా పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలని రాము ఈ సందర్భంగా కోరారు. కుటుంబంతో వినోద విహారాలు వంటి వాటిని వదులుకుని ఆ డబ్బును వెచ్చించి రాము పర్యావరణహిత సంచుల్ని మార్కెట్లలో, ఇతర చోట్లా విస్తృతంగా పంపిణీ చేస్తున్నారు. మొక్కల పెంపకం, నీటి పొదుపు, పర్యావరణ పరిరక్షణ కోసం పలు రకాలుగా ప్రచారం సాగిస్తూ ప్రజల్లో అవగాహన పెంచుతున్నారు. నార సంచుల ఆవిష్కరణ కార్యక్రమంలో పలువురు లోక్‌సత్తా నేతలు పాల్గొన్నారు.

# సమానావకాశాలుంటేనే సరళీకరణ విజయవంతం




ప్రపంచంలోని 5 అత్యుత్తమ సంస్థల ఉన్నతాధికారులు భారతీయులు కావటం కాకతాళీయమే తప్ప అది మన విద్యావ్యవస్థ గొప్పతనం కాదని లోక్‌సత్తా, ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్) వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మన విద్యావ్యవస్థ మేడిపండు చందాన ఉందన్నారు. విద్యార్థుల్లో కేవలం 1 శాతం మాత్రమే ప్రపంచంతో పోల్చదగిన స్థాయిలో ఉన్నారన్నారు. మరో 15 శాతం మంది ఆ స్థాయిని శిక్షణతో అందుకోగలిగే స్థితిలో ఉండగా, దాదాపు 80 శాతం మంది అధమస్థాయిలోనే ఉండిపోతున్నారన్నారు. గతంలో పాఠశాలల్లో వసతులు సరిగా లేకున్నా నాణ్యమైన విద్య ఉండేదన్నారు. మార్కుల పరీక్షల ప్రాముఖ్యత పెరిగి, సామాజిక స్థాయిని బట్టి ఆంగ్ల మాధ్యమం, ప్రైవేటు పాఠశాలల ట్రెండ్‌అమాంతం పెరగటంతో.. విద్యావ్యవస్థలో ఉన్నకొద్దీ వ్యత్యాసాలు చొరబడ్డాయన్నారు. రాజకీయ పరమైన వికేంద్రీకరణ, ఆర్థికపరమైన పోటీతత్వం నడుమ.. నచ్చినది ఎంచుకోగల అవకాశం, సామాజికపరంగా సమానావకాశాలు ఉంటేనే సరళీకరణ ప్రక్రియ సార్థకమవుతుందన్నారు. హైదరాబాద్‌లోని వీఎన్ఆర్ విజ్ఞాన్‌జ్యోతి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్‌వీజేఐఈటీ)లో జరిగిన మూడు రోజుల యూత్ పార్లమెంట్ లీడర్‌షిప్ బూట్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు.

'ఆర్థిక, సామాజిక వ్యవస్థలలో సరళీకృత సంస్కరణల అవసరం'పై యూత్ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి, స్వతంత్రత వ్యవస్థాపకుడు రవి రాఘవేంద్ర జయప్రకాష్ నారాయణ్‌తో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు.

జేపీ మాట్లాడుతూ.. నాయకులుగా ఎదగాలనుకుంటున్న, ఎదగాల్సిన యువత సామాజిక అభివృద్ధిలో ప్రభుత్వం పాత్రను స్పష్టంగా అర్థం చేసుకోవటం అవసరమన్నారు. ప్రభుత్వం రూపొందించే ప్రతి చట్టమూ 'స్వేచ్ఛ, పురోగతి, అవకాశాలు' అనే మూడు

కోణాల్లో కచ్చితంగా మెరుగైన ఫలితాల్ని సాధించేలా ఉండాలన్నారు. అప్పుడే ఆ చట్టాలు ప్రభావశీలం కాగలవన్నారు. నాయకత్వం అనేది కేవలం నైపుణ్యాలకు సంబంధించినది కాదని, సమాజంలో నాయకులుగా రాణించాలంటే సంబంధిత రంగంలో నైపుణ్యాలనే కాక విలక్షణతల్ని కూడా అలవరచుకోవాలన్నారు. తమ ఓటు తమ భవిష్యత్తుని ప్రభావితం చేస్తుందని ప్రజలందరూ గుర్తించి స్థానిక ప్రభుత్వాల్లో భాగస్వాములు అవుతుండటమే నిజమైన ప్రజాస్వామ్యమన్నారు.

ఇలాంటి ప్రజాస్వామిక వాతావరణంలో యువత నాయకులుగా వేగంగా ఎదగగలుగుతారన్నారు. దేశభక్తి అంటే సరిహద్దుకి లోపల విడదీయలేని వారి పట్ల, సరిహద్దుకి ఆవల అనివార్యంగా ఉండే పొరుగుదేశం పట్ల వ్యతిరేకతతో ఊగిపోవటం కాదన్నారు. దేశభక్తి అంటే సమాజాన్ని మంచివైపు నడిపించే ప్రయత్నం చేయాలన్న అనురక్తి అన్నారు. మన సమాజంలో విలువలు అంతర్లీనంగా ఉండటం వల్లనే ఇప్పటికీ స్వతంత్ర భారతదేశం అవిచ్ఛిన్నంగా ఉందని, అన్ని సంస్కృతుల్లో ఉన్న మంచిని సొంతం చేసుకున్న దేశాలే సమగ్రాభివృద్ధి చెందాయని అన్నారు.

పౌర నాయకత్వంలో సమగ్రత, వ్యక్తిత్వం ప్రాముఖ్యతలను స్వామి బోధమయానంద వివరిస్తూ.. ఆలోచించే శిరసు, అనుభూతి చెందే మనసు, కృషి చేసే చేతులు ఉంటేనే నాయకులు కాగలరన్నారు. ధర్మం కోసం పాటుపడేవారే రాజకీయాలకు అవసరమన్నారు. 'నాయకత్వంలో నవకల్పనలు-సమారంభకుల పాత్ర' గురించిన చర్చా కార్యక్రమంలో స్టుమాగ్జ్ శ్రీచరణ్ లక్కరాజు, కివ్లా సత్యభార్గవ్, తక్షశిల ఐఏఎస్ అకాడమీ దుర్గాప్రసాద్, విశాల్‌రెడ్డి పాల్గొనగా, వేణు మారగాని సమన్వయకర్తగా వ్యవహరించారు. పర్యావరణహిత సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో నాణ్యమైన విద్య గురించి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి వివరించగా, సెంటర్ ఫర్ సివిల్ సొసైటీ పాలసీ అడ్వయిజర్ అమిత్‌చంద్ర సమన్వయం చేశారు. సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించటంలో క్రియాశీల పౌరసమాజం పాత్రను గురించి రోహిత్ వక్రాల నిర్వహించిన చర్చా కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలకు చెందిన లీలా లక్ష్మణ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాధవరెడ్డి, కరుణాకర్, మయూర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సెంటర్ ఫర్ ఇండివిడ్యువల్ లిబర్టీ వ్యవస్థాపకుడు నల్లమోతు చక్రవర్తి, స్టేట్ ఆఫ్ ఎడ్యుకేషన్ సెక్టార్ డైరెక్టర్ ఆఫ్ స్ట్రాటజిక్ ఇనీషియేటివ్స్ రాగిణి బజాజ్ చౌదరి, సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, అభయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బాలచంద్ర సుంకు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, గీతం విద్యాసంస్థల అధ్యక్షుడు ఎం.భరత్, సామాజిక విశ్లేషకుడు, మాజీ ఎమ్మెల్సీ డా॥ కె.నాగేశ్వర్, రైతు పురస్కార గ్రహీత లక్ష్మీనర్సింహ ఇక్కుర్తి, అమీరుల్లాఖాన్, భరత్ ప్రసాద్, దొంతినేని నరసింహ, వీ అండ్ షీ ప్రతినిధురాలు శ్రావ్యారెడ్డి, సందీప్, సిద్ధార్థ్ తదితరులు తొలి రెండు రోజుల కార్యక్రమాల్లో శిబిరాన్నుద్దేశించి మాట్లాడారు.

వివిధ రాష్ట్రాల నుంచి 150 మంది విద్యార్థులు, ఉద్యోగులు, సమాజసేవా సంస్థల ప్రతినిధులు మూడు రోజుల నాయకత్వ శిక్షణా శిబిరానికి హాజరయ్యారు. విజ్ఞాన్‌జ్యోతి సంస్థల అధ్యక్షుడు డా॥ డి.ఎన్ రావు, కళాశాల డైరెక్టర్ డా॥ చెన్నకేశవరావు, ప్రతినిధులు డా॥ బి.నరేంద్రకుమార్, డా॥ కె.పద్మజ, డా॥ చక్రవర్తుల కిరణ్, తదితరులు పాల్గొన్నారు. కళాశాల యాజమాన్యం సహకారంతో మూడు రోజుల నాయకత్వ శిక్షణా శిబిరాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని నిర్వాహకులు మనోజ్ చిట్టిమళ్ల, రవి రాఘవేంద్ర హర్షం వ్యక్తం చేశారు.




**"ఉన్న స్థితి నుంచి ఉన్నత స్థితికి చేరుకోవడానికి ఎన్ని అవకాశాలు ఉన్నాయో, అన్ని సదవకాశాలనూ వినియోగించటమే వివేకం"**

**-మహాత్మాగాంధీ**

# మహిళాసత్తా చాటిన నాన్సీ పెలోసి

- ఎ. అన్నపూర్ణ



మనం మహిళలుగా ప్రతి సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా 'మహిళా దినోత్సవాన్ని' జరుపుకుంటాం. అఫ్‌కోర్స్, కొందరు పురుషులు కూడా ప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ఈ మార్చి 8 ఉత్సవానికి, వారోత్సవాలకి వెన్నుదన్నుగా ఉంటారనుకోండి. 2020 మహిళా దినోత్సవం సందర్భంగా.. అమెరికన్ మహిళలకే కాకుండా, అమెరికాలో ఉండే నాలాంటి ప్రవాసులకు, ప్రపంచవ్యాప్తంగా పలువురు విద్యావంతులకు ఎంతో స్ఫూర్తినిస్తున్న ఓ స్త్రీమూర్తి ప్రస్తావన ద్వారా కొన్ని విషయాల్ని చెప్పాలనుకుంటున్నాను. అగ్రరాజ్యమైన అమెరికా దేశానికి స్పీకర్ ఆఫ్ ది హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ 52వ ప్రతినిధిగా డెమోక్రాటిక్ పార్టీ నుంచి రెండుసార్లు ఎన్నికై చరిత్ర సృష్టించిన మహిళ, 81 సంవత్సరాల నాన్సీ పెలోసి.. ఆ శక్తిమంతమైన నాయిక.

ఇటాలియన్-అమెరికన్ కుటుంబానికి చెందిన దంపతులకు చెందిన కుటుంబంలో ఆరుగురు అబ్బాయిల తర్వాత నాన్సీ జన్మించారు. బాల్టిమోర్ రాష్ట్రంలో 1940లో ఆమె జననం. నాన్సీ మాతృమూర్తి దక్షిణ ఇటలీ వాస్తవ్యురాలు. రాజకీయాల్లో చురుగ్గా పాల్గొనేవారు. చిన్నప్పటి నుంచే కుమార్తెకు సమాజసేవతోపాటు మంచి ప్రవర్తన, నైతిక విలువలు నేర్పించారు. తండ్రి పెలోసి కూడా రాజకీయాల పట్ల అవగాహన కలవారే కావడంతో నాన్సీకి సహజంగానే రాజకీయాలంటే ఇష్టం ఏర్పడింది. తండ్రితోపాటు ప్రచారానికి కూడా వెళ్లేది. అదే సమయంలో జాన్ ఎఫ్ కెన్నడీ అధ్యక్షుడిగా ఉన్నారు (1961). ఆయన ప్రసంగం విన్న నాన్సీ ఉత్తేజితురాలై రాజకీయ ప్రవేశానికి పునాది వేసుకుంది. చదువు పూర్తయిన తర్వాత కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్‌ఫ్రాన్సిస్కో నగరానికి వచ్చారు (బ్యాచిలర్ ఆఫ్ పొలిటికల్ సైన్సెస్‌లో పట్టా పొందారు). ఫిలిప్స్ బర్టన్ అనే కాంగ్రెస్ వ్యక్తిని కలిసి డెమోక్రాటిక్ పార్టీలో నేషనల్ కమిటీ సభ్యునిగా చేరి తన ప్రస్థానాన్ని ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రారంభించారు.

తన రాజకీయ ప్రస్థానానికి ఊతమిచ్చిన ఫిలిప్స్ బర్టన్ మరణానంతరం ఆయన భార్య సాలా కొద్దికాలంపాటు బాధ్యతలు నిర్వహించినప్పటికీ, ఆమె క్యాన్సర్ వ్యాధి బారిన పడటంతో రాజకీయాల నుంచి తప్పుకుని నాన్సీని ప్రోత్సహించారు.

కొందరికి అనుకోకుండా పదవులు, గుర్తింపు లభిస్తాయి. మరికొందరు, నిరంతర కృషి, అభిలాష, శ్రద్ధలతో అంచెలంచెలుగా ఎదిగే సోపానాలను నిర్మించుకుంటూ ఉన్నతస్థానానికి చేరుకునే అవకాశం పొందుతారు. స్వయంకృషితో సాధిస్తారు. ఈ రెండవ కోవకి చెందిన మహిళ నాన్సీ. స్పెషల్ ఎలక్షన్‌లో గెలిచి రెండవసారి పూర్తికాలానికి కిరీటాన్ని దక్కించుకోవడం విశేషమే కాదు, ఆమె ప్రతిభాపాటవాలకు, అంకితభావానికి నిదర్శనం.

స్పీకర్ పదవి అంటే అమెరికాలో ఏదో ఆషామాషీ పదవి కాదు. అధ్యక్షస్థానం తర్వాత అత్యున్నత పదవి వైస్ ప్రెసిడెంట్ కాగా, ఆ తర్వాతి స్థానం స్పీకర్‌దే. ఏ కారణం చేతనైనా అధ్యక్షుని పదవీకాలం పూర్తికాకుండా ఉన్నప్పుడు వెంటనే వైస్ ప్రెసిడెంట్ అధ్యక్షుడు (ఇంతవరకూ అమెరికాలో మహిళ అధ్యక్షురాలు కాలేదు కాబట్టి 'అధ్యక్షుడు' అనే వాడుతున్నాను) అవుతారు. వైస్ ప్రెజ్‌ను తొలగించాల్సి వచ్చినా, పదవీ కాలంలో ఆ స్థానం ఖాళీ అయినా స్పీకర్‌కే ఆ అధ్యక్ష పదవి దక్కుతుంది. ఇక్కడి పాలనా, ఎన్నికల విధానాలకు, భారతదేశంలోని విధానాలకు తేడా ఉందన్న సంగతి తెలిసిందే. అమెరికాలోని ఓటర్లలో ఎక్కువమంది వ్యక్తిగతానికంటే తమ ఉమ్మడి ప్రయోజనాలకు ఉపయోగపడే నేతలను ఎన్నుకోవటానికే ప్రాధాన్యత ఇస్తారు కాబట్టి, పార్టీలు కూడా సామర్థ్యం ఉన్నవారిని వేగంగా ప్రోత్సహిస్తాయి కాబట్టి.. నాన్సీ లాంటి ప్రతిభావంతురాలు ఇక్కడ అవరోధాలు లేకుండా రాజకీయాల్లో ఎదగగలిగారు, వరుసగా కూడా ఎన్నికల్లో నెగ్గగలిగారు. ఈ రకంగా ప్రజల ఆస్తిగా నిజమైన ప్రజాస్వామిక పార్టీని

నిర్మించేందుకే లోక్‌సత్తా ఉద్యమాన్ని రాజకీయ పార్టీగా కూడా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ విస్తరించారు. పార్టీ అధ్యక్ష పదవికి రహస్య బ్యాలెట్ ద్వారా ఓటింగ్‌ను నిర్వహించి ఎన్నుకోవటంతోపాటు, మిగిలిన పదవుల్లో మహిళలతోపాటు అణగారిన వర్గాల ప్రాతినిధ్యం జనాభాకనుగుణంగా లేకపోతే, విధిగా వారికి ప్రాతినిధ్యం కల్పించేందుకు అదనపు పదవుల్ని పార్టీ రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేశారు. అలాగే మన దేశ పరిస్థితుల దృష్ట్యా ఒక్క ఓటు ఎక్కువ వచ్చిన వారు మాత్రమే గెలిచినట్లు, మిగిలినవారికి ఎన్ని లక్షల ఓట్లు వచ్చినా ఓడిపోయినట్లే అనే ప్రస్తుత ఎఫ్.పి.టి.పి ఎన్నికల వ్యవస్థ స్థానంలో స్థానిక, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాధినేతల (మేయర్, ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి) పదవులకు ప్రత్యక్ష ఎన్నికలు, మిగిలిన ఎన్నికలకు దామాషా పద్ధతిని ప్రవేశపెట్టాలని సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నారు. ఇటీవల ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ), యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ)తో కలిసి ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్)/లోక్‌సత్తా ఆధ్వర్యంలో 'ఇండియన్ డెమోక్రసీ ఎట్ వర్క్' (ఆచరణలో భారత ప్రజాస్వామ్యం–ఐడీఏడబ్ల్యూ) అనే వేదికను ప్రారంభించారు. ఐడీఏడబ్ల్యూ 2020 వార్షిక కార్యక్రమంగా ఐఎస్‌బీలో 'మనీపవర్ ఇన్ పాలిటిక్స్'పై రెండు రోజులపాటు జాతీయ సదస్సును నిర్వహించి 'హైదరాబాద్ డిక్లరేషన్'ను వెలువరించారు. ఇందులో రాజకీయ నాయకులు, ఎన్నికల సంఘంలో పనిచేసిన, చేస్తున్నవారు, పాలనా అనుభవం గలవారు, న్యాయకోవిదులు, మీడియా ప్రతినిధులు, దేశవిదేశాల వర్సిటీలకు చెందిన అధ్యయనకారులు పాల్గొన్నారు. హైదరాబాద్ డిక్లరేషన్ కూడా పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం, విరాళాల సేకరణ పద్ధతుల్ని మార్చటం, ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా ఎన్నికల పద్ధతి కావాలని తీర్మానించింది. జేపీ చెప్పినట్లు.. ఏ ఎన్నికల వ్యవస్థా దానికదే చెడ్డది కాదు, మంచిదీ కాదు. కానీ అమెరికా ఉన్న పరిస్థితుల్లో అక్కడి ఎన్నికల వ్యవస్థ ప్రతిభావంతులను ఎన్నుకోగలుగుతోంది. అప్పుడప్పుడూ కొన్ని ఒడిదుడుకులున్నా, మహిళల పట్ల ఇంకా కొన్ని విభాగాల్లో వివక్ష ఉన్నా కూడా. కానీ మన దేశంలో అపుడప్పుడూ, అక్కడక్కడా తప్ప నాన్సీ పెలోసిలాంటి సమర్థులు, నిజాయతీపరులు ఎన్నికవటం లేదు.

ధనరాజకీయాలు ఏ స్థాయికి చేరుకున్నాయో తెలిపేందుకు ఐడీఏడబ్ల్యూ 2020 సదస్సు జరిగే సమయంలోనే తెలంగాణలో జరిగిన మునిసిపల్ ఎన్నికలు రుజువు చేశాయి. ఓటుకు రూ.30,000 పైగా పలికిందంటే, మనం ఏ రకమైన ప్రజాస్వామ్యంలో ఉన్నాం? ఈ డబ్బు జాడ్యం కేవలం తెలంగాణకే పరిమితం కాదు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక ఇలా పలు రాష్ట్రాల్లో పాతుకుపోయింది. ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరించింది. అమెరికా ఎన్నికల్లోనూ డబ్బు ఎక్కువగానే ఖర్చవుతుంది. కానీ అదంతా చట్టబద్ధంగానే లెక్కచెబుతారు. మన వద్ద చట్టవిరుద్ధంగా, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచేలా, అవినీతిని పెంచేలా ధనరాజకీయాలు సాగుతున్నాయి. డబ్బు ఖర్చు చేసినా ఎన్నికల్లో గెలవకపోవచ్చు, కానీ డబ్బు లేకపోతే ఎన్నికల్లో గ్యారంటీ ఓడిపోవటమే.

మహిళల్ని పూజిస్తామని చెబుతూనే, అమెరికాలో కంటే ఎక్కువ వివక్షను మన దేశంలో చూపుతున్నారు. మహిళలు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి అయ్యారు కాబట్టి ఇండియాలో లింగవివక్ష లేదనుకోవటం పొరపాటు.

ఈ నేపథ్యంలో.. మన దేశంలో విస్తారంగా ఉన్న అవిద్య, పేదరికం, భిన్నత్వానికి తగినట్లు ప్రత్యక్ష ఎన్నికలు, దామాషా పద్ధతిని ప్రవేశపెడితే ధనరాజకీయాలు, ఓటుకు నోటు ఎన్నికలు పోయి ప్రజాస్వామ్యానికి పరిణతి పెరుగుతుందని హైదరాబాద్ డిక్లరేషన్ వాదిస్తోంది. జేపీ సుదీర్ఘ కృషి ఫలించి ఈ రకంగా సామాన్యులు కూడా చట్టసభల్లోకి ప్రవేశించే పరిస్థితి వస్తే, అనేకమంది నాన్సీలు భారతీయ మహిళల నుంచి కూడా రూపుదిద్దుకుంటారు, అందరికీ ఎదిగే అవకాశాలు లభిస్తాయి, మహిళా దినోత్సవాలు మరింత సమున్నత లక్ష్యాల్ని నిర్దేశించుకోగలుగుతాయి.

కాలిఫోర్నియాలోని పలు జిల్లాలకు ప్రాతినిధ్యం, డెమోక్రాటిక్ జాతీయ కమిటీ సభ్యత్వం, 17వసారి కాంగ్రెస్‌ఉమన్ మొదలైన విశిష్ట విజయాల్ని సాధించిన నాన్సీ.. అమెరికాలో హౌస్ ఆఫ్ రిప్రజంటేటివ్స్ స్పీకర్‌గా ఎన్నికైన తొలి మహిళగా రికార్డు సృష్టించిన సందర్భంగా అధ్యక్షుడు జార్జి డబ్ల్యు బుష్ ఆమెను ప్రశంసిస్తూ చెప్పిన మాటలివి:

This is Historic moment for the Congress and for the women of the Country. It is a moment for which we have waited for more than 200 years. Never losing faith, we waited through the many years of struggle to achieve our rights. But women weren't just waiting; women were working. Never losing faith, we worked to redeem the promise of America that all men and women are created equal. For our daughters and granddaughters today we have broken the marble ceiling.
For our daughters and our grand-daughters the sky is the limit; anything is possible for them.

ఆర్థిక సర్వే 2019-20:

# అతిశయోక్తులున్నా.. అర్థవంతం, ఆశావహం!

ద్రవ్యలోటు లక్ష్యాల విషయంలో కొంత పట్టువిడుపులతో వెళ్తూ, విధానపరంగా కొన్ని మౌలిక మార్పుల్ని చేపడితే దేశ జీడీపీ వృద్ధిరేటు 2020-21లో 6-6.5 శాతానికి పుంజుకోవచ్చని ఆర్థికసర్వే అంచనా వేసింది.


హేతుబద్ధ విశ్లేషణతో, ఆచరణసాధ్యమైన సానుకూల రోడ్‌మ్యాప్‌తో భారతదేశానికి ఆశావహ ఆర్థిక ముఖచిత్రాన్ని 2019-20 ఆర్థిక సర్వే ఆవిష్కరించింది. ఆర్థిక శాఖ ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) కృష్ణమూర్తి సుబ్రమణియన్ నేతృత్వంలో రూపొందించించిన ఈ నివేదికను వార్షిక బడ్జెట్‌కు ముందు పార్లమెంటుకు సమర్పించారు.

2025 నాటికి భారత ఆర్థిక వ్యవస్థ పరిమాణం 5 లక్షల కోట్ల డాలర్లకు చేరాలంటే నైతిక పద్ధతుల్లో సంపదను సృష్టించటం కీలకమని.. వ్యవస్థ పట్ల నమ్మకాన్ని పెంచడంతో పాటు సాధికారిక మార్కెట్లు, వ్యాపార అనుకూల విధానాలు, రైతుల ఆదాయం పెంచే చర్యలు అవసరమని సర్వే పేర్కొంది.

ద్రవ్యలోటుకు సంబంధించి పట్టువిడుపులతో వెళ్లాలని.. ప్రజలు ఓటుతో ఇచ్చిన బలమైన తీర్పుని ఉపయోగించుకుని సంస్కరణలను వేగంగా అమలు చేయాలని.. భారత్‌ను ప్రపంచానికి తయారీకేంద్రం (అసెంబుల్ ఇన్ ఇన్ ఇండియా ఫర్ వరల్డ్)గా మార్చాలని.. ఆహార సబ్సిడీలను తగ్గించి ఉత్పాదకంగా ఆ కేటాయింపుల్ని వినియోగించాలని.. నాణ్యమైన మౌలిక సదుపాయాలకి భారీగా పెట్టుబడులు పెట్టాలని.. సంపద, ఉద్యోగాల సృష్టికర్తలయిన వ్యాపారస్తులను గౌరవంగా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి సూచించింది.

## వృద్ధి రేటును బలంగా పైకి తేవటమే ఇప్పుడు ప్రాధాన్యాంశం

2019-20 ఆర్థిక సంవత్సరానికి జీడీపీలో ద్రవ్యలోటును 3.3 శాతానికి పరిమితం చేస్తామని గత బడ్జెట్‌లో కేంద్ర ఆర్థికమంత్రి చెప్పినప్పటికీ.. కార్పొరేట్ పన్ను కోత, ఇతర పన్నుల వసూళ్లు తక్కువగా ఉండటం వంటి పరిస్థితుల వల్ల ద్రవ్యలోటు 3.8 శాతానికి చేరుతోందని అంచనా. అయితే, ఇప్పుడున్న పరిస్థితుల్లో వృద్ధి రేటును బలంగా పైకి తీసుకురావడమే ప్రాధాన్యమైన అంశంగా ఆర్థిక సర్వే అభిప్రాయపడింది. ఇందుకోసం ద్రవ్యలోటు లక్ష్య సవరణను పరిశీలించవచ్చని తెలిపింది. రూ.1.84 లక్షల కోట్ల మేర ఉన్న ఆహార సబ్సిడీలను తగ్గించుకోగలిగితే ద్రవ్యలోటు విషయంలో ప్రభుత్వానికి వెసులుబాటు లభిస్తుందని సూచించింది. ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నాక ప్రభుత్వం తన ఖర్చులను స్థిరీకరించుకోవచ్చని, పలు దేశాలు గతంలో ఇదే మార్గాన్ని అనుసరించాయని ఉటంకించింది.




## మౌలిక సదుపాయాలపై పెద్దఎత్తున పెట్టుబడుల్ని సకాలంలో పెట్టాలి

రెవెన్యూ వ్యయాలను తగ్గించుకోవడంతోపాటు మూలధన వ్యయాలను పెంచుకోవడం ద్వారా ఆస్తులను సృష్టించుకోవాలని ఆర్థిక సర్వే సూచించింది. పెద్దఎత్తున పెట్టుబడుల ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యమవుతుందని పేర్కొంది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల పునరుద్ధరణకు సాయంగా నిలవడం ద్వారా పెట్టుబడుల ఆధారిత వృద్ధి సాధ్యపడుతుందని అంచనా వేసింది. వ్యాపార నిర్వహణను సులభతరం (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) చేసేందుకు వీలుగా.. పోర్టుల్లో ఎగుమతులు పెంచేందుకు రెడ్‌టేపిజం (మితిమీరిన నియంత్రణలతో కూడిన విధానాలు) తొలగించాలని సూచించింది. 2024-25 నాటికి 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్థాయికి చేరేందుకు మౌలిక రంగంలో కనీసం రూ.1.4 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరమని తెలిపింది. "మౌలిక రంగంలో పెట్టుబడులు ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరం. విద్యుత్ కోతలు, చాలీచాలని రవాణా సదుపాయాలు అధిక వృద్ధి సాధన దిశగా అవరోధంగా నిలుస్తాయి. సాఫీగా, వేగవంతమైన వృద్ధి కోసం భారత్ నాణ్యమైన సదుపాయాల కల్పనకు సకాలంలో తగినన్ని పెట్టుబడులు పెట్టాలి" అని ఆర్థిక సర్వే తెలియచేసింది.

## ఎగుమతులు పెంచుకోగలిగితే..

ప్రపంచ ఎగుమతుల్లో భారత్ వాటాను గణనీయంగా పెంచుకోగలిగితే 2025 నాటికి 4 కోట్ల ఉద్యోగాలు, 2030 నాటికి 8 కోట్ల ఉద్యోగాలు అందుబాటులోకి రావచ్చని ఆర్థిక సర్వే అంచనా వేసింది. 'అసెంబుల్ ఇన్ ఇండియా ఫర్ ద వరల్డ్' వల్ల మన ఎగుమతుల వాటాను 2025 కల్లా 3.5 శాతానికి, 2030 కల్లా 6

శాతానికి పెంచుకునే వీలుంది. త్వరితగతిన కార్మిక సంస్కరణలు కూడా చేపట్టాలి.

## చైనాను ఆదర్శంగా తీసుకోవాలి

ఉద్యోగాల కల్పనకు చైనా అనుసరిస్తున్న విధానాలను భారత్ తీసుకోవాలని సూచించింది. బ్యాకింగేతర ఆర్థిక సంస్థలపై ఒత్తిడి పెరగటం, కుటుంబాలు చేస్తున్న ఖర్చు తగ్గిపోవటం, ప్రపంచ ఆర్థిక వృద్ధి రేటు మందగించటం, పన్ను వసూళ్లు తగ్గటం ప్రస్తుతం భారత్ ముందున్న సవాళ్లని పేర్కొంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో కేంద్రానికి ఉన్న వాటాలను ఓ కొత్త సంస్థను ఏర్పాటు చేసి దానికి బదిలీ చేయాలని, ఆయా కంపెనీల్లో ప్రభుత్వ వాటాల విక్రయాన్ని ఆ సంస్థే చూసుకొనేలా ఉండాలని సూచించింది. వ్యాపారాన్ని సులభతరం చేసేందుకు మెరుగైన చర్యలు చేపడుతున్న దేశాల జాబితాలో భారత్ స్థానం గణనీయంగా మెరుగైందని, పెట్టుబడులకు మూలధనం తగ్గింపు వల్ల దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడవచ్చని తెలిపింది.

## ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నష్టం - ప్రైవేటులో లాభం

ప్రభుత్వ రంగ బ్యాంకులను (పీఎస్‌బీలు) పలు సమస్యలు వేధిస్తున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. పీఎస్‌బీల కార్యనిర్వహణ దక్షతను పెంచేందుకు ఫిన్‌టెక్‌లను, ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్ కేటాయింపులు వంటి అవకాశాలను ఉపయోగించుకోవాలని సూచించింది. పీఎస్‌బీలలో ప్రభుత్వ ఈక్విటీ కింద రూ.4.30 లక్షల కోట్ల ప్రజాధనాన్ని పెట్టుబడిగా పెట్టారు. గత ఏడాదిలో పీఎస్‌బీలలో పెట్టుబడిగా పెట్టిన ప్రజాధనంలో రూపాయికి 23 పైసల మేర నష్టపోయారు. ఇందుకు భిన్నంగా, 90వ దశకం సంస్కరణల తర్వాత ప్రైవేటు బ్యాంకుల్లోని పెట్టుబడిలో ప్రతి రూపాయి విలువ 9.6 పైసల మేర పెరిగింది.

## వ్యవసాయ రంగంలో తగ్గనున్న వృద్ధి

వ్యవసాయ రంగంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 2.9 శాతంగా ఉంటుందని భావిస్తున్న వృద్ధి వచ్చే ఆర్థిక సంవత్సరం 2.8 శాతానికి తగ్గవచ్చని సర్వే అభిప్రాయపడింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యోల్బణం 4.1 శాతంగా ఉండవచ్చని, గత ఆర్థిక సంవత్సరం కంటే ఇది తక్కువని పేర్కొన్నది.

## రుణమాఫీల వల్ల రైతుల జీవితాల్లో మార్పేమీ రాలేదు

రుణమాఫీల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండటం లేదని ఆర్థిక సర్వే తేల్చింది. ఎన్నికలకు ముందు, తర్వాత అమలు చేస్తున్న ఈ మాఫీల వల్ల రైతులు అప్పుల ఊబి నుంచి బయటపడిన దాఖలాలు లేవని పేర్కొంది. 2008లో యూపీయే ప్రభుత్వం భారీస్థాయిలో రుణమాఫీ చేసిన తర్వాత అదే పంథాను ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్, మహారాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించాయి. దీనిపై 2016-18 మధ్యకాలంలో పలువురు ఆర్థికవేత్తలు పరిశోధనలు చేశారు. వీటిని ఉటంకించిన ఆర్థిక సర్వే.. రుణమాఫీ వల్ల అంతిమంగా నష్టమే జరిగిందని పేర్కొంది. "పేరుకుపోయిన రైతుల అప్పుల చెల్లింపునకే రుణమాఫీ కింద ప్రభుత్వ ఆదాయాన్నంతా ఉపయోగిస్తున్నారు. దీనివల్ల రైతుల భౌతిక, మానవ వనరుల అభివృద్ధికి పెద్దగా ప్రోత్సాహకాలేమీ లభించటం లేదు. 2008లో యూపీయే ప్రభుత్వం చేసిన రుణమాఫీ పథకం మిశ్రమ ఫలితాన్ని చూపింది. 2 హెక్టార్లు ఉన్నవారికి ఈ పథకం వర్తింపచేయటంతో 1.98 హెక్టార్ల భూమి ఉన్నవారికి పూర్తి రుణమాఫీ జరగగా, 2.02 హెక్టార్లు ఉన్నవారికి మాత్రం పాక్షికంగా జరిగింది. ఈ రైతుల వాస్తవ పరిస్థితుల్లో పెద్దగా తేడా లేకపోయినా, ప్రయోజనం మాత్రం సమానంగా దక్కలేదు. రుణాలు రద్దు చేసిన తరువాత కూడా రైతుల పరిస్థితి మెరుగవలేదు. జీడీపీలో 2% మేర చేసిన ఈ ఖర్చు వల్ల రైతుల జీవితాలపై ఎలాంటి అర్థవంతమైన వాస్తవ ప్రభావం కనిపించలేదు. ఎప్పుడైనా అసాధారణ పరిస్థితులు తలెత్తినప్పుడు ఎవ్వరూ ఊహించనివిధంగా ఈ పథకాన్ని అమలు చేసినప్పుడు మాత్రమే దాని ప్రయోజనం నెరవేరుతుంది. అలాకాకుండా ముందుగానే రుణమాఫీని ప్రకటించటం వల్ల ఎగవేతలు పెరిగిపోయాయి. ఎన్నికలకు వెళ్లే రాష్ట్రాల్లో రుణాల చెల్లింపులు భారీగా తగ్గిపోతున్నాయి. ప్రభుత్వాలు రుణమాఫీ చేస్తాయనే ఉద్దేశంతో రైతులు వ్యూహాత్మకంగా అప్పులు చెల్లించడం లేదు. ఒకసారి రుణమాఫీ లబ్ధి పొందినవారికి ఆ తర్వాత నుంచి బ్యాంకు రుణాలు తగ్గిపోతున్నాయి. నిపుణుల పరిశోధనలోనూ ఇదే తేలింది. ఎలాంటి షరతులు పెట్టకుండా అందరికీ రుణమాఫీ వర్తింపచేయడం మంచి ఆలోచన కాదు. నిజంగా నిస్పృహలో ఉన్న



## విశ్వసనీయ రోడ్‌మ్యాప్: జేపీ

విజయాల పట్ల అతిశయోక్తులున్నా ఆర్థిక సర్వే వచ్చే 10 ఏళ్లకు విశ్వసనీయ రోడ్‌మ్యాప్‌ను అందించేందుకు ప్రయత్నించింది. నెట్ ఉత్పత్తుల తయారీ, చట్టబద్ధపాలన, సులభతర వాణిజ్యం, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, నిత్యావసర వస్తువుల చట్టాన్ని రద్దుచేయటం, ఆహార సబ్సిడీల వ్యయాన్ని ఉత్పాదకంగా వినియోగించటం మొదలైన మార్గాల ద్వారా పెద్దఎత్తున ఉద్యోగాల సృష్టికి కీలక ప్రతిపాదనల్ని అందించింది.

రైతులను గుర్తించి పరిమితంగా ఉపశమనం కలిగించినప్పుడు మాత్రమే దీనివల్ల ప్రయోజనం ఉంటుంది" అని సర్వే పేర్కొంది.

సూక్ష్మరుణ వసూళ్లను నిషేధిస్తూ 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం (రోశయ్య ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు) జారీచేసిన ఆర్డినెన్స్ మిగతా క్రెడిట్ మార్కెట్లపై అంటువ్యాధి తరహా ప్రభావాన్ని చూపింది. ఆ ఆదేశాలతో సూక్ష్మరుణాల బకాయిలు భారీగా పెరిగిపోయాయి. ఆ ప్రభావం బ్యాంకు రుణాలకూ అంటువ్యాధిలా పాకింది. దానివల్ల బ్యాంకు రుణాల ఎగవేతలు 12.4%, మొండి బకాయిలు 24.5% మేర పెరిగాయి. తర్వాత రుణవితరణ దాదాపు సగానికి సగం తగ్గిపోయింది. రుణగ్రస్తులకు మేలు చేయడానికి ప్రభుత్వం తీసుకున్న ఆ చర్య చివరికి వారికి అప్పు పుట్టకుండా చేసింది. రుణమాఫీల కోసం 1987లో హర్యానా ప్రభుత్వం బడ్జెట్‌లో 17 శాతం కేటాయించగా, 2014లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 21 శాతం కేటాయించింది.

### ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణతో మెరుగైన ఫలితాలు

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్ఈలు) పెట్టుబడుల ఉపసంహరణను పెద్దఎత్తున చేపట్టాల్సిన అవసరాన్ని కూడా ఆర్థిక సర్వే ప్రస్తావించింది. గతంలో ప్రైవేటీకరించిన సీపీఎస్ఈల పనితీరు, ఆదాయం, లాభాలు, నికర విలువపరంగా ఎంతో అభివృద్ధి చెందిన విషయాన్ని గుర్తుచేసింది. గతంలో ప్రైవేటీకరించిన సీపీఎస్ఈల్లో వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణకు ముందు పదేళ్లు, ఆ తర్వాత పదేళ్ల కాలంలో వాటి పనితీరును సర్వే అధ్యయనం చేసింది. హిందుస్థాన్ టెలీ ప్రింటర్స్, ఎంఎఫ్ఐఎల్, టాటా కమ్యూనికేషన్స్ వంటి కొన్ని కంపెనీలు మినహా మిగిలినవాటి నికర విలువ, స్థూల ఆదాయం, నికర లాభాల మార్జిన్, ఆదాయాల వృద్ధి అన్నది ప్రైవేటీకరణకు ముందు నాటి కాలంతో పోలిస్తే ప్రైవేటీకరణ అనంతరకాలంలో ఎంతో మెరుగుపడినట్లు సర్వే వెల్లడించింది. పెట్టుబడుల ఉపసంహరణ అన్నది మొత్తానికి వాటి పనితీరు, ఉత్పాదకతను గణనీయంగా మార్చేసినట్లు తెలిపింది. అధిక లాభదాయకత, సమర్థత పెంపు, మరింత పోటీతత్వం కోసం వేగంగా వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను చేపట్టాలని సూచించింది.

### రెస్టారెంట్ పెట్టటం కంటే.. తుపాకీ కొనడం తేలిక

మన దేశంలో హోటల్ పెట్టటం కంటే పిస్తోలు వంటి మారణాయుధం కొనటం చాలా సులువు. ఢిల్లీలో రెస్టారెంట్ పెట్టాలంటే 26 అనుమతులు కావాలి. అదే బెంగళూరులో 36 డాక్యుమెంట్లు, వాటికి అనుమతులూ కావాలి. ముంబయిలో 22 అవసరం. ఢిల్లీ, కోల్‌కతాల్లో పోలీస్ ఈటింగ్ హౌస్ లైసెన్సు కూడా తీసుకోవాల్సి ఉంటుంది. అంటే పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి అదనపు క్లియరెన్స్ కింద మరిన్ని డాక్యుమెంట్లు సమర్పిం చాలన్నమాట. మొత్తం మీద ఈ రెండు మహానగరాల్లో ఓ రెస్టారెంట్ కోసం 45 డాక్యుమెంట్లు కావాలి. అదే ఓ రివాల్వర్ లేదా ఇతర మారణాయుధాల్ని కొనాలంటే కేవలం 12 నుంచి 18 డాక్యుమెంట్లు ఉంటే సరిపోతుంది. సింగపూర్ లేదా చైనాలో రెస్టారెంట్ ప్రారంభించాలంటే నాలుగు డాక్యుమెంట్లు మాత్రమే సరిపోతాయి. రెస్టారెంట్లు వంటివి ఉపాధిని కల్పించేవని, వాటికి అడ్డంకులు పెట్టడం సరికాదని సర్వే సూచించింది.

### అవకాశాల్ని సులభంగా అందించాలి

కొత్త వ్యాపారాల ప్రారంభంతోపాటు ప్రాపర్టీ రిజిస్ట్రేషన్, పన్ను చెల్లింపులు, కాంట్రాక్టుల అమలును మరింత సులభతరం చేసేందుకు అవసరమైన సంస్కరణలు చేపట్టాలని పేర్కొంది.

### పన్ను కోతతో లాభం పెద్ద కంపెనీలకే

కార్పొరేట్ పన్నులో గణనీయమైన తగ్గింపుతో ఎక్కువ ప్రయోజనం పెద్ద కంపెనీలకేనని, చిన్న కంపెనీలు అప్పటికే తక్కువ పన్ను రేటు చెల్లిస్తున్నాయని ఆర్థిక సర్వే పేర్కొంది. కార్పొరేట్ పన్నును 30 నుంచి 22 శాతానికి తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం గతేడాది సెప్టెంబర్‌లో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నిర్ణయం తీసుకునే నాటికే రూ.400 కోట్ల వరకు టర్నోవర్ ఉన్న కంపెనీలు (దేశంలో 99.1శాతం ఈ పరిధిలోనివే) 25 శాతం కార్పొరేట్ పన్ను పరిధిలో ఉన్న విషయాన్ని సర్వే ప్రస్తావించింది. అంటే కేవలం 0.9 శాతం కంపెనీలు (4,698 కంపెనీలు) రూ.400 కోట్ల టర్నోవర్ పైగా ఉన్నవి. ఇవి చెల్లించే రేటు 30.9 నుంచి 34.91 శాతం మధ్య (సెస్సులు కలుపుకుని) ఉంది. దీంతో కార్పొరేట్ పన్ను తగ్గింపు చిన్న కంపెనీలకు 3.2 శాతం నుంచి 13.5 శాతం మేర ప్రయోజనం కలిగిస్తే, పెద్ద కంపెనీలకు 18.5 శాతం నుంచి 27.3 శాతం మధ్య లాభం చేకూర్చినట్లు సర్వే వివరించింది.

### ఆర్థిక సర్వేలోని మరికొన్ని ముఖ్యాంశాలు:

- 2019-20లో పారిశ్రామిక ప్రగతి 2.5 శాతం మాత్రమే.
- గతేడాది ఏప్రిల్‌లో 3.2 శాతంగా నమోదైన ద్రవ్యోల్బణం డిసెంబర్‌లో 2.6 శాతానికి తగ్గడం ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ ఒత్తిడి బలహీనంగా ఉండటాన్ని ప్రతిబింబిస్తున్నది.
- విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెరగటం, జీఎస్టీ వృద్ధిలో సాను కూల వృద్ధి నమోదవడంలాంటి 10 అంశాలు ప్రస్తుత ఆర్థిక సంవత్సర ద్వితీయార్థంలో వృద్ధి రేటు పెరుగుదలకు దోహదం చేశాయి. గతేడాది ఏప్రిల్-నవంబర్ మధ్యకాలంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు 4.1 శాతం మేర పెరిగాయి.
- 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన-గ్రామీణ్ పథకం కింద 47.33 లక్షల ఇళ్ల నిర్మాణం జరిగింది. స్వచ్ఛభారత్ కార్యక్రమం కింద 2014 నుంచి గ్రామీణ ప్రాంతాల్లో 10 కోట్లకుపైగా మరుగుదొడ్ల నిర్మాణమయ్యాయి.
- ఆకర్షణీయ నగరాల మిషన్ పథకం కింద 100 నగరాల్లో రూ.2 లక్షల కోట్ల వ్యయంతో 5,151 పనులు చేపట్టాలని ప్రతిపాదిం చారు. ఇందులో రూ.22,569 కోట్లు విలువ చేసే 1,290 పనులు పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.
- 2022కి అందరికీ ఇళ్లు లక్ష్యంలో భాగంగా పట్టణాల్లో 1.03 కోట్ల ఇళ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. 60 లక్షల ఇళ్ల పనులు చేపట్టగా అందులో 32 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించారు.

■ 2018లో 1.24 లక్షల కంపెనీలు ఏర్పాటయ్యాయని, ఈ విషయంలో భారత్ ప్రపంచంలో మూడో స్థానంలో నిలిచిందని సర్వే వెల్లడించింది. ■ 2018-19లో రైల్వే ప్రయాణికుల సంఖ్య 1.85 శాతం పెరిగి 840 కోట్లకు, సరకుల లోడింగ్ 5.34 శాతం పెరిగి 120 కోట్ల టన్నులకు చేరింది. దీంతో ఇండియన్ రైల్వేస్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్యాసింజర్ క్యారియర్‌గా, సరకు రవాణాలో నాలుగో అతిపెద్ద సంస్థగా ఆవిర్భవించింది. అలాగే రైలు ప్రమాదాలు కూడా గణనీయంగా తగ్గాయి. ■ 2022కి లక్షన్నర ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయాలి.

## రహదారులకు రూ.19.63 లక్షల కోట్లు

మౌలిక సదుపాయాల కల్పనకు ఉద్దేశించిన నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్ పథకానికి 2020-25 మధ్యకాలంలో రూ.102 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం. అందులో భాగమైన జాతీయ రహదారులకు రూ.19.63 లక్షల కోట్లు కేటాయించాల్సి ఉంది. 2015-16 మధ్య సగటున రోజుకు 17 కిలోమీటర్ల రోడ్డు నిర్మించగా, ప్రస్తుతం 29.7 కి.మీ. నిర్మిస్తున్నారు.

## నిత్యావసర వస్తువుల చట్టాన్ని (ఈసీఏ) రద్దు చేయటం మేలు

నిత్యావసర వస్తువుల చట్టం ద్వారా ధరల హెచ్చుతగ్గులను అదుపు చేయలేకపోతున్నామని.. దానిని రద్దు చేయటం మంచిదని సర్వే సూచించింది. దీనిస్థానంలో ఒక 'క్రియాశీలక' ఆహారధాన్యాల విధానం అవసరమని తెలిపింది. కొత్తపద్ధతిలో ధాన్యం సేకరణ, పంపిణీ, నగదు బదిలీలను సులభతరం చేయాలని పేర్కొంది. ఈసీఏ కింద గతేడాది 76,000 దాడులు జరిగినా, ధరలపై ఎటువంటి ప్రభావం కనిపించలేదని వివరించింది.

## భోజనాల ఇబ్బందుల్లేవు

దేశ ప్రజలు భోజనాలకు ఇబ్బందులు పడటం లేదని సర్వే తేల్చింది. దేశమంతటి నుంచీ సేకరించిన సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చింది. 2006 నుంచి 2019 మధ్య శాకాహార భోజనం తీసుకునే సామర్థ్యం 29 శాతం మేర, మాంసాహార భోజన సామర్థ్యం 18 శాతం మేర పెరిగింది. కూరగాయల ధరలు అదుపులో ఉండటంతో అయిదుగురు సభ్యులు ఉన్న ఓ శాకాహార కుటుంబం ఈ అయిదేళ్లలో రూ.10,887, మాంసాహారం తినే కుటుంబం రూ.11,787 మేర లబ్ధి పొందింది. ఈ విశ్లేషణకు 'తాలినామిక్స్' అని పేరు పెట్టింది.

## ధరల స్థిరీకరణకు నిధి

2014 నుంచి తగ్గుతూ వస్తున్న వినియోగదారు ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం.. ఇటీవల పెరిగిందని ఆర్థిక సర్వే పేర్కొంది. ఆహార పదార్థాలు, పానీయాల ధరల్లో పెరుగుదలే ఇందుకు కారణమని తెలిపింది. ఉత్పాదకత సమస్యలు, బేస్ ఎఫెక్ట్ కారణాల వల్ల కూరగాయలు, పప్పులు లాంటి కొన్ని ఆహార పదార్థాల ధరలు పెరిగినట్లు సర్వే గుర్తించింది. అందుకే వ్యవసాయ, ఉద్యానవన ఉత్పత్తుల్లో కీలకమైన వాటి ధరల్లో ఒడిదొడుకుల నియంత్రణకు ధరల స్థిరీకరణ నిధి ద్వారా చర్యలు చేపట్టాలని, తద్వారా రైతుల ప్రయోజనాలను పరిరక్షించాలని సూచించింది. కనీస మద్దతు ధరను కూడా మరింత సమర్థంగా అమలు చేయాలని తెలిపింది. నిత్యావసర వస్తువుల చట్టం ద్వారా ధరల హెచ్చుతగ్గులను అదుపు చేయలేకపోతున్నామని.. దానిని రద్దు చేయటం మంచిదని సర్వే సూచించింది. దీనిస్థానంలో ఒక 'క్రియాశీలక' ఆహారధాన్యాల విధానం అవసరమని తెలిపింది. కొత్తపద్ధతిలో ధాన్యం సేకరణ, పంపిణీ, నగదు బదిలీలను సులభతరం చేయాలని పేర్కొంది. ఈసీఏ కింద గతేడాది 76,000 దాడులు జరిగినా, ధరలపై ఎటువంటి ప్రభావం కనిపించలేదని వివరించింది.

## ఒత్తిడిలో టెలికాం రంగం

తీవ్రమైన పోటీ, తక్కువ టారిఫ్‌ల కారణంగా 2016 నుంచి టెలికాం రంగం ఒత్తిడిలో ఉంది. డేటా ధరలు ప్రపంచంలోనే అతి తక్కువగా ఉన్నాయి. 2016లో గిగాబైట్‌కు రూ.200 చెల్లిస్తుంటే ఇప్పుడు రూ.7.7 చెల్లిస్తే సరిపోతుంది. దాంతో బ్రాడ్ బ్యాండ్ కనెక్షన్ల సంఖ్య 6.1 కోట్ల నుంచి 59.46 కోట్లకు పెరిగింది. సెల్ వినియోగదారుని నుంచి 2016లో నెలకు సగటున రూ.126 ఆదాయం వస్తే ధరలు తగ్గడం వల్ల ఇప్పుడు రూ.74.30 మాత్రమే వస్తోంది.

## ఇళ్ల ధరలను తగ్గించటం పరిష్కారం

అమ్ముడుపోని ఇళ్లు/అపార్ట్‌మెంట్లు అధిక సంఖ్యలో ఉండటంతో వీటిని తగ్గించుకునేందుకు నిర్మాణదారులు కొంతమేర ధరలను తగ్గించాల్సిన అవసరాన్ని ఆర్థిక సర్వే సూచించింది. రియల్ ఎస్టేట్ డెవలపర్లు కొంతమేర హేర్ కట్ (నష్టం) భరించి ధరలను తగ్గిస్తే త్వరగా అమ్ముడుపోతాయని పేర్కొంది. బిల్డర్లు ఈ విధంగా చేసినట్లయితే బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీల బ్యాలెన్స్ షీట్లు సానుకూలంగా మారతాయని తెలిపింది. 2015-16 నుంచి వృద్ధి నిలిచిపోయినప్పటికీ, ఇళ్ల ధరలు అధికస్థాయిలోనే ఉన్నట్లు పేర్కొంది.

# వ్యూహాత్మక పెద్ద అడుగు అవసరమైన సమయంలో చిల్లరమల్లరకు పరిమితం: కేంద్ర బడ్జెట్ 2020పై జేపీ

యువత, వ్యాపారులు, ఇతర ప్రజానీకం మార్పుకి సిద్ధంగా ఉన్నా వారి శక్తులన్నిటినీ కేంద్రీకరించి పెద్దమార్పుని సాధించే అవకాశాన్ని కేంద్ర బడ్జెట్ జారవిడిచిందని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. భారతదేశానికి ఇప్పుడు ఒక వ్యూహాత్మక పెద్ద అడుగు అవసరమని, చైనా అలాంటి అడుగులు వేసిందని, 1991లో పీవీ నరసింహారావు, డా॥ మన్మోహన్ సింగ్‌ల నేతృత్వంలో భారత్ అలాంటి అడుగు వేసిందని, కానీ ప్రస్తుత ప్రభుత్వం అలా మౌలిక మార్పు కోసం ప్రయత్నం లేకుండా కీలక సమయంలో చాలా యధాలాపంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు.

ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ 2020-21పై మీడియాతో జేపీ మాట్లాడుతూ.. చైనా స్థానాన్ని ఆక్రమించాలి, ఏడాదికి 1 కోటి ఉద్యోగాలను సృష్టించిన చైనాలాగా పెద్దఎత్తున ఉపాధిని సృష్టించాలి అనే ప్రయత్నమే బడ్జెట్‌లో కనిపించలేదన్నారు. ఈవేళ దేశంలో రోజుకు 36,000 మంది.. ఆదివారాలు, సెలవులు అన్నీ కలుపుకున్నా గంటకు 1500 మంది కొత్తగా ఉద్యోగాల మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నారన్నారు.

దేశం ఇప్పుడున్న పరిస్థితుల్లో కూడా 8 కోట్ల ఉద్యోగాల సృష్టి సాధ్యమని బడ్జెట్ ముందురోజున పార్లమెంటులో ప్రభుత్వం నుంచే ప్రవేశపెట్టిన ఆర్థికసర్వే స్పష్టంగా చెప్పిందని గుర్తుచేశారు. సొంత సర్వే చెప్పింది కూడా చేయలేదన్నారు. వియత్నాం, మెక్సికో వంటి దేశాల పాటి కూడా మనం ఉపాధి ఆధారిత ఆర్థికాభివృద్ధి అవకాశాల్ని ఉపయోగించుకోలేకపోతున్నామన్నారు. కీలక సమయం, పెద్ద అడుగులు పడతాయని ఆశిస్తే చాలా మామూలుగా, సాదాసీదాగా అడుగులు వేశారన్నారు. ఉద్యోగులకు ఆదాయపు పన్నులో కొంత వెసులుబాటు, ద్రవ్యలోటును మరీ ఎక్కువ పెంచకపోవటం, పరిశ్రమలకు కొన్ని పన్నుల రాయితీలు, వాటాదారులకు డివిడెండ్ పంపిణీ పన్ను రద్దు, నెట్ ఉత్పత్తుల తయారీ వంటి కొన్ని అంశాలను మినహాయిస్తే బడ్జెట్‌లో చెప్పుకోదగిన అంశాలులేవన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతారంగంగా చెబుతూ ఆర్థికమంత్రి 40 నిమిషాల పాటు ఏకరువు పెట్టిన వ్యవసాయంలో కూడా సుమారు పాతికేళ్ల క్రితం నుంచి చెబుతున్న మాటలే వల్లె వేశారు తప్పితే.. ఎగుమతుల్ని పెంచి రైతులకు ఆదాయాన్నిచ్చే విధానాల్ని ప్రకటించలేకపోయారని జేపీ అన్నారు. వ్యవసాయంలో మౌలిక మార్పుకి ఈ బడ్జెట్‌లో పునాది వేయలేదన్నారు. నిత్యావసర సరకుల చట్టం, లైసెన్స్ రాజ్ పద్ధతుల్ని తొలగించాలని, ఆహార సబ్సిడీ కోసం వెచ్చిస్తున్న రూ.1,80,000 కోట్లను ఉత్పాదకతని పెంచే రీతిలో ఖర్చు చేయాలని ఆర్థికసర్వే కూడా సూచించినా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. రైల్లేదో కొత్తగా తమ పరిధిలోకి వచ్చినట్లు ఇప్పుడు కిసాన్ రైళ్లు ప్రవేశపెడతామని చెబుతున్నారన్నారు. ఈ రకమైన చిన్న చర్యలతో, రైతేరాజు, వ్యవసాయం మీద ఆధారపడి అనేకమంది బతుకుతున్నారు వంటి డైలాగులతో, ఉచితాలు, రుణమాఫీలు వంటి స్కీములతో రైతుల జీవితాలు బాగుపడవన్నారు. రిటైల్ చెయిన్లను ఏర్పాటు చేయటం, మౌలిక వసతులు, టెక్నాలజీ వినియోగం, గ్రేడింగ్, ప్యాకింగ్ వంటి వన్నీ ప్రయివేటు సంస్థలే చేసుకునే ఏర్పాట్లు చేస్తే.. వినియోగదారులు చెల్లించే డబ్బులో రైతుకు రూ.70 దాకా లభిస్తుందని, ఇప్పుడు రూ.25-30 మాత్రమే దక్కుతోందని అన్నారు.

చిన్న ప్రభుత్వం, పెద్ద పాలన అంటే అంతా ప్రధానమంత్రి చేతిలో కేంద్రీకృతమై ఉండటం కాదని, ప్రభుత్వం తాను చేయాల్సిన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి పనులు చేస్తూ, గుత్తాధిపత్య నియంత్రణ తప్ప జోక్యం అవసరంలేని ఆర్థిక రంగ విభాగాల్లో ప్రయివేటు శక్తులను ఉపయోగించుకోవాలని, కానీ ఈ బడ్జెట్‌లో అందుకు విరుద్ధంగా చేశారని జేపీ అన్నారు. విద్యారంగంలో ప్రమాణాలు అధ్వాన్నంగా ఉన్నాయన్న విషయాన్నిగానీ, ఆరోగ్యరంగానికి నిధుల కొరత గురించి గాని ప్రస్తావించకుండా మొక్కుబడిగా కేటాయింపుల్ని చేశారన్నారు.

ఇంకొంతమంది గుమాస్తాల్ని నియమిస్తాం, ఇంకొన్ని ఫైళ్లను తయారుచేస్తాం, నాలుగు పథకాల్ని కొత్త పేర్లతో ప్రకటిస్తాం లాంటి ఉపన్యాసాలతో ఇలాంటి బడ్జెట్‌లు చాలాసార్లు వచ్చాయని, వీటితో మార్పు వచ్చిన దాఖాలాలు ఇప్పటిదాకా లేవని, ఇక ముందు వస్తాయనటానికి ఆధారాలు లేవని.. ఇలాంటి దిశలేని బడ్జెట్‌లు కాకుండా పరిష్కారాన్నిచ్చే వినూత్న పద్ధతులు ఇప్పుడు దేశానికి అవసరమని జయప్రకాష్ నారాయణ్ స్పష్టం చేశారు.

# కేంద్ర బడ్జెట్ 2020-21

నిరుద్యోగం, ఆర్థిక మందగమనం సవాళ్లు విసురుతూ ప్రజల్లో వ్యవస్థ పట్ల విశ్వసనీయత సన్నగిల్లుతున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం 2020-21 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. విరుగుడు చర్యలతో సంక్షోభాన్ని అధిగమించే సంజీవనిలా బడ్జెట్ ఉంటుందని ఎక్కువమంది ఆశించారు. సుదీర్ఘ సమయమైనా టీవీల్ని, మొబైళ్లను అంటిపెట్టుకుని బడ్జెట్ ప్రసంగాన్ని వీక్షించారు. అయితే సవాళ్ల తీవ్రతను గుర్తించటానికి కేంద్ర ప్రభుత్వం సుముఖత చూపకపోవటం, బడ్జెట్ ఘనంగా ఉందన్న భావనను కలిగించాలనుకోవటంతో.. ఆకాంక్షలు ఎక్కువ, ఆచరణ తక్కువ అన్నట్లు బడ్జెట్ రూపుదిద్దుకుంది. లక్ష్యాల సాధనకు ఎటువంటి కచ్చితమైన ప్రణాళికలూ లేకుండా పోయాయి. కీలక సమయంలో బడ్జెట్ ఇలా సాదాసీదాగా వెలువడటం, ప్రభుత్వం కూడా ఆకాంక్షలకే పరిమితమవటం పలువర్గాలను నిరాశ పరిచింది.

రూ.30,42,230 కోట్లతో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో బడ్జెట్ ప్రవేశపెట్టారు. బడ్జెట్ లోటు రూ.7,96,337 కోట్లుగా ఉంది. ఇది జీడీపీలో 3.5 శాతంగా ఉంటుంది. 2019-20లో స్థూల జాతీయోత్పత్తిని రూ.224, 89,240 కోట్లు (సుమారు 225 కోట్లు)గా లెక్కించారు.

ప్రపంచంలో భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థని, జీడీపీని 10 శాతానికి తీసుకెళ్తామని, రైతుల ఆదాయాన్ని మరో రెండేళ్లలో రెట్టింపు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. 'ప్రజల సుఖమయ జీవితం' అన్న ఆశయ సాధనలో భాగంగా సమ్మిళిత ప్రగతి కోసం నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు. "ఆకాంక్ష భారత్, అందరికీ ఆర్థికాభివృద్ధి, ఆదరించే సమాజం" అన్న ఇతివృత్తాలను స్వీకరించి, వివిధ శాఖలను ఈ మూడు విభాగాల కింద తెచ్చి కేటాయింపులు జరిపారు. మొదటిదైన ఆకాంక్ష భారత్ అన్న ఇతివృత్తం కిందికి ప్రజలతో ప్రత్యక్ష సంబంధమున్న వ్యవసాయం, నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి, ఆరోగ్యం, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్య, నైపుణ్యాల వంటి శాఖలను తీసుకొచ్చారు. వీటన్నింటికీ బడ్జెట్‌లో రూ.4,82,401 కోట్లు కేటాయించారు. వ్యవసాయ రంగానికి 16 సూత్రాల పథకం రూపొందించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి రంగాలకు రూ.2.83 లక్షల కోట్లు ఇస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. రెండో ఇతివృత్తమైన ఆర్థికాభివృద్ధిలో పరిశ్రమలు, వాణిజ్యం, పెట్టుబడులు, మౌలిక వసతులు వంటి శాఖలు ఉన్నాయి. వీటన్నింటికీ రూ.2,37,904 కోట్లు కేటాయించారు. 'నూతన ఆర్థిక రంగం' కింద డిజిటల్ విప్లవాన్ని ప్రోత్సహించే కృత్రిమ మేధ తదితర అంశాలను దీంట్లోనే చేర్చారు. రహదారులు, రైళ్లు వంటి మౌలిక వసతులన్నింటినీ ఒకే గొడుగు కిందకు తెచ్చే



'నేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పైప్‌లైన్' (ఎన్ఐపీ) ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఎన్ఐపీ కింద 2025 నాటికి 103 లక్షల కోట్లను వ్యయం చేయాలని నిర్ణయించి ఆ మేరకు కేటాయింపులు చెప్పారు. ఇందులో భాగంగా త్వరలో నూతన రవాణా విధానం తీసుకురానున్నారు. మూడో అంశమైన 'ఆదరించే సమాజం' కింద మహిళా-శిశు సంక్షేమం, సాంస్కృతిక, పర్యాటకం తదితర శాఖలున్నాయి. బీమా, పింఛన్ల పరిధిని విస్తరించాలని ప్రతిపాదించారు. ఈ విభాగాలు అన్నింటికీ కలిపి రూ.62,626 కోట్లు కేటాయించారు.

వృద్ధికి ఊతమిచ్చేందుకు వీలుగా పలురంగాలకు భారీగా కేటాయింపులు జరపాల్సిన నేపథ్యంలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని ప్రభుత్వం సడలించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్యలోటు లక్ష్యాన్ని జీడీపీలో 3.3 శాతంగా నిర్దేశించిన ప్రభుత్వం.. ఇప్పుడు దాన్ని 3.8 శాతానికి పెంచింది. అదేవిధంగా వచ్చే ఆర్థిక సంవత్సరం (2020-21) ద్రవ్యలోటు లక్ష్యాన్ని కూడా గతంలో 3 శాతంగా అంచనా వేయగా.. దీన్ని ఇప్పుడు 3.5 శాతానికి సడలించింది. తద్వారా మార్కెట్ నుంచి రూ.5.36 లక్షల కోట్లను సమీకరించాలని నిర్ణయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2019-20) రుణ సమీకరణను కూడా రూ.4.99 లక్షల కోట్లకు పెంచుతున్నట్లు ఆర్థికమంత్రి చెప్పారు.

దేశీయంగా తయారీని ప్రోత్సహించేందుకు వీలుగా వంటసామాగ్రి నుంచి ఎలక్ట్రికల్ పరికరాలు, ఫర్నిచర్, స్టేషనరీ, ఆటబొమ్మలు ఇలా పలు వస్తువులపై సుంకాలు పెంచారు. రైతు రుణాల లక్ష్యాన్ని 2020-21లో రూ.15 లక్షల కోట్లకు పెంచారు. కీలకమైన ఇంధనరంగానికి రూ.40,750 కోట్లు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ రంగాల్లో కొన్ని స్కీములకు కేటాయింపుల్ని పెంచటం ద్వారా ప్రభుత్వ వ్యయాన్ని 2020-21లో 13 శాతం మేర పెంచేలా

చర్యలు తీసుకున్నామన్నారు.

గత బడ్జెట్‌లో ప్రకటించిన కార్పొరేట్ పన్నును 30 నుంచి 22 శాతానికి తగ్గిస్తూ సెప్టెంబర్, 2019లో నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం.. తాజా బడ్జెట్‌లో కూడా కొన్ని రాయితీల్ని ప్రకటించింది. కొత్తగా ప్లాంట్లు నెలకొల్పే కంపెనీలకైతే 15 శాతం పన్నునే వర్తింపచేస్తామని మంత్రి చెప్పారు. డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ ట్యాక్స్ (డీడీటీ) నుంచి కూడా కార్పొరేట్ కంపెనీలకు ఉపశమనం కలిగించారు. డీడీటీని ఇకపై నిర్దేశిత శ్లాబులను అనుసరించి డివిడెండ్ పొందినవారే చెల్లించాల్సి ఉంటుంది. ఈ తాజా ప్రతిపాదనతో ప్రభుత్వానికి రూ.25,000 కోట్లు ఆదాయం తగ్గుతుందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ రంగ బ్యాంకులకు 'ఇంద్రధనుష్' పథకంలో భాగంగా ఇప్పటికే భారీగా మూలధనం అందించడం, పలు బ్యాంకులను విలీనం చేస్తూ నిర్ణయం తీసుకోవడం నేపథ్యంలో బడ్జెట్‌లో వీటికి సంబంధించి ఎలాంటి ప్రకటనలు చేయలేదు. స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా ఆర్థికమంత్రి కొన్ని చర్యల్ని మంత్రి ప్రకటించారు. ఓనర్‌షిప్ ప్లాన్‌పై అయిదేళ్లపాటు ట్యాక్స్ హాలిడే ప్రకటించారు. ప్రారంభదశలో ఉన్న స్టార్టప్ సంస్థలు నిపుణులైన సిబ్బందిని ఆకర్షించేందుకు, సంస్థను విడిచిపెట్టకుండా వారు కొనసాగేందుకు ఈ రాయితీలు ఉపయోగపడతాయన్నారు. ద్రవ్యలోటును పూడ్చుకోవటానికి ఎల్ఐసీలో వాటా విక్రయం అంశాన్ని ప్రభుత్వం తెర మీదకు తెచ్చింది. ప్రస్తుతం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌లో ప్రభుత్వానికి 100 శాతం వాటా ఉంది. దీనిలో కొంత వాటాను పబ్లిక్ ఆఫర్ (ఐపీవో) ద్వారా విక్రయించటం ద్వారా స్టాక్‌మార్కెట్‌లో లిస్టింగ్ చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ఇప్పటిదాకా ప్రభుత్వ రంగ సంస్థల్లో (పీఎస్‌యూ) వాటా విక్రయం (డిజిన్వెస్ట్‌మెంట్) ప్రక్రియలో ఎల్ఐసీ నుంచే (షేర్లను కొనిపించడం ద్వారా) ప్రభుత్వం నిధులను తీసుకుంటోంది. ఇప్పుడు వాటాను అమ్ముతోంది.

## కేంద్ర బడ్జెట్ 2020-21లోని మరికొన్ని ముఖ్యాంశాలు:

- రక్షణ రంగానికి 5.8 శాతం పెంపుతో రూ.3.37 లక్షల కోట్లు కేటాయింపు.
- ప్రభుత్వ రంగ సంస్థల వాటాల విక్రయం ద్వారా రూ.2.1 లక్షల కోట్ల ఆదాయాన్ని సంపాదించాలని లక్ష్యం.
- విద్యారంగానికి రూ.99,300 కోట్లు, నైపుణ్యాభివృద్ధికి మరో రూ.3,000 కోట్లు కేటాయింపు. త్వరలో నూతన జాతీయ విద్యావిధానం.
- ఆరోగ్య రంగానికి రూ.69,000 కోట్లు. ఆయుష్మాన్ భారత్ జాబితాలో దవాఖానాలు లేని ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంలో ఆస్పత్రుల ఏర్పాటు.
- బడ్జెట్‌కు 17 శాతం నిధుల్ని సమకూరుస్తున్న ఆదాయపు పన్నులో మార్పులు చేశారు. పన్ను భారం తగ్గించుకోవడానికి ప్రస్తుతం ఇస్తున్న మినహాయింపులను క్రమేణా ఎత్తివేయడానికి రంగం సిద్ధమయింది. ప్రస్తుతం ఆదాయపు పన్ను చట్టంలో 100కి పైగా మినహాయింపులు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందని, వీటిలో 70 అంశాలను తొలిగించామని, మిగిలినవాటిని సమీక్షిస్తామని మంత్రి తెలిపారు. మినహాయింపులతో ఎక్కువ పన్ను శ్లాబును ఎంచుకోవడమా? ఎలాంటి మినహాయింపులు లేకుండా తక్కువ శ్లాబును ఎంచుకోవడమా? అన్నదాన్ని చెల్లింపుదారునికే విడిచిపెట్టారు.
- దాతృత్వ సంస్థలకు ప్రత్యేకంగా యునీక్ రిజిస్ట్రేషన్ నెంబర్ (యూఆర్ఎన్). ఆ సంస్థలకు ఇచ్చే విరాళాలు రిటర్నులలో పేర్కొనాలి.
- జీఎస్‌టీ ఇన్‌వాయిస్‌లపై డైనమిక్ క్యూఆర్ కోడ్.
- బ్యాంకు డిపాజిట్లపై ఇప్పటి వరకూ ఉన్న రూ.1 లక్ష బీమా రక్షణను రూ.5 లక్షలకు పెంపు.
- క్వాంటమ్ కంప్యూటింగ్ సంబంధిత పరిశోధనలకు ఐదేళ్లకు 8,000 కోట్లు.
- జల్‌జీవన్ మిషన్‌కు రూ.11,500 కోట్లు.
- రైల్వే శాఖకు చేసిన కేటాయింపులో ప్రయాణికుల భద్రత, నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులపై దృష్టి.
- దేశవ్యాప్తంగా 15,500 కి.మీ. మేర జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టాలని, 9,000 కి.మీ. ఎకనామిక్ కారిడార్‌ను నిర్మించాలని ప్రతిపాదన. రహదారుల రవాణా, జాతీయ రహదారుల శాఖకు 2020-21లో రూ.91,823.22 కోట్ల కేటాయింపు. 2033 నాటికి ఢిల్లీ-ముంబయి ఎక్స్‌ప్రెస్‌వే, మరో రెండు ప్యాకేజీల నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయం. చెన్నై-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం. 6,000 కిలోమీటర్ల మేర 12 జాతీయ రహదారులను కుదువ పెట్టటం ద్వారా 2024 నాటికి నిధులు సేకరించాలని ప్రతిపాదన.
- పునరుత్పాదక ఇంధనాలు, విద్యుత్ రంగానికి రూ.22,000 కోట్లు. ఉద్గారాల కట్టడి నిబంధనలను అందుకోని పాత థర్మల్ విద్యుత్ కర్మాగారాలను మూసివేయాలని నిర్ణయం. క్రమంగా డీజిల్-రహిత వ్యవసాయాన్ని సాధించేందుకు 'పీఎం కుసుమ్' పథకాన్ని విస్తరించనున్నట్లు వెల్లడి. దీనికింద సౌర విద్యుత్‌ను రైతులు ఒడిసిపట్టేలా సాయం అందిస్తారు.
- ప్రధానమంత్రి పంటల బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పరిధి రైతుల్లో 28 శాతం మందికే పరిహారం అందుతున్నట్లు కేంద్రం గుర్తించింది. బీమా చేసే విస్తీర్ణం వచ్చే ఏడాది మరో 10 శాతం అదనంగా పెంచాలని నిర్ణయం. 2019-20లో పథకానికి రూ.13640.85 కోట్లను కేటాయించగా, వచ్చే ఏడాది రూ.15,695 కోట్లకు పెంపు. రైతులు బ్యాంకుల నుంచి తీసుకుంటున్న పంట రుణాలపై రాయితీ సొమ్ము చెల్లించేందుకు రూ.21,175 కోట్లు తాజా బడ్జెట్‌లో కేటాయింపు.

- ఉల్లి, టొమాటో వంటి ఆహారాల ధరలను అదుపులో ఉంచటానికి ఒక ధరల స్థిరీకరణ నిధి (పీఎస్ఎఫ్) ఏర్పాటు.
- స్తోమతు గల చిన్న నగరాలకూ విమాన ప్రయాణ సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు అమలు చేస్తున్న ఉడాన్ పథకాన్ని మరింత విస్తరించేందుకు వచ్చే అయిదేళ్లలో 100 విమానాశ్రయాల నిర్మాణం.
- మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు, సెమీ కండక్టర్ ప్యాకేజింగ్ తయారీని ప్రోత్సహించేందుకు కొత్తపథకం.
- మొబైల్ విడిభాగాలను కూడా దేశంలోనే తయారు చేసేందుకు వీలుగా కొన్ని విడిభాగాలపై దశలవారీగా కస్టమ్స్ సుంకం విధింపు. వచ్చే ఆర్థిక సంవత్సరం టెలికాం నుంచి రూ.1,33,027.2 కోట్ల ఆదాయం వస్తుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ అంచనా రూ.56,687 కోట్లు మాత్రమే.
- భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు కేంద్ర బడ్జెట్‌లో రూ.13,479.47 కోట్లు.. గత ఏడాదికన్నా ఇది 8 శాతం ఎక్కువ.
- దేశంలోని పెద్దనగరాలలో వాయు కాలుష్య నియంత్రణకు రూ.4,400 కోట్లు. 10 లక్షల జనాభా దాటిన నగరాల్లో ప్రజలకు శుభ్రమైన గాలి అందించేందుకు రాష్ట్రాలు రూపొందించే ప్రణాళికలకు ఈ నిధులు విడుదల చేస్తారు.
- ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలు ఇంజినీరింగ్ విద్యార్థుల్లో కొరవడుతున్నందున బీటెక్ డిగ్రీకి విలువ ఉండేలా ఉద్యోగార్హతలను పెంచేందుకు 'ఎగ్జిట్' పరీక్ష. దేశవ్యాప్తంగా ఏటా 7.20 లక్షల మంది బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలు పొందుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సంఖ్య సుమారు 1.50 లక్షల వరకు ఉంది.
- ఆర్టికల్ 370 రద్దుతో కేంద్రపాలిత ప్రాంతంగా మారిన జమ్మూ కాశ్మీర్‌కు రూ.30, 757 కోట్లు, లద్దాఖ్‌కు రూ.5,958 కోట్లు కేటాయించారు.
- ఆహారం, ఇంధనం, ఎరువుల రాయితీల కోసం కేటాయించే నిధుల్ని స్వల్పంగా పెంచారు. ఇందుకోసం రూ.2,27,793.89 కోట్లు కేటాయింపు.
- గ్రామీణ ప్రాంతాల్లో బ్రాడ్‌బ్యాండ్ అనుసంధానతను మరింత పెంచేందుకు 'భారత్‌నెట్' ప్రోగ్రాంలో భాగంగా రూ.6 వేల కోట్లు.
- ప్రభుత్వరంగ సంస్థలైన బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్‌లకు ప్రభుత్వం నుంచి రూ.37,640 కోట్లు. ముఖ్యంగా 4జీ స్పెక్ట్రం, స్వచ్ఛంద పదవీ విరమణ పథకం (వీఆర్ఎస్) అమలు కోసం ఈ నిధుల వినియోగం.
- కేంద్ర ప్రభుత్వ విభాగాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకుల్లో నాన్‌గెజిటెడ్, క్లరికల్, నాన్‌టెక్నికల్ (గ్రూప్ బీ, సీ, డీ కేటగిరీలు) పోస్టుల భర్తీకి ప్రత్యేక నియామక సంస్థ. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో వేగాన్ని పెంచేందుకు వీలుగా స్వయంప్రతిపత్తి కలిగిన జాతీయ నియామక సంస్థ (నేషనల్ రిక్రూట్‌మెంట్ ఏజన్సీ-ఎన్ఆర్ఏ) ఏర్పాటు.
- చదువుకోవాలని ఉన్నా, ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లేనివారి కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ డిగ్రీ కోర్సులను అందుబాటులోకి తేవటం.
- పట్టణ స్థానిక ప్రభుత్వాలలో యువ ఇంజినీర్లకు ఇంటర్న్‌షిప్ అవకాశం.
- పోలీసింగ్, ఫోరెన్సిక్, సైబర్-ఫోరెన్సిక్ విభాగాలను బలోపేతం చేసే దిశగా నేషనల్ పోలీస్ యూనివర్సిటీ, నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ విశ్వవిద్యాలయాల ఏర్పాటు.
- అధ్యాపకులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, సహాయకులు తమ అర్హతలను, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రత్యేక బ్రిడ్జి కోర్సుల రూపకల్పన.
- భారత్‌ను అంతర్జాతీయ విద్యాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు 'స్టడీ-ఇన్-ఇండియా' ప్రత్యేక కార్యక్రమం రూపకల్పన. ఆఫ్రికా, ఆసియా దేశాల్లో ఇండ్-శాట్ పరీక్ష నిర్వహణ ద్వారా విద్యార్థులను ఆకర్షించాలని నిర్ణయం.
- షెడ్యూల్డ్ కులాలు, ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీల) సంక్షేమానికి రూ.85,000 కోట్లు. షెడ్యూల్డ్ తెగలకు రూ.53,700 కోట్లు.
- కేంద్ర హోం శాఖకు రూ.1,67,250 కోట్లు. ఇందులో రూ.92,054.53 కోట్లు పారామిలిటరీ దళాలకు. జాతీయ విపత్తు సహాయ నిధికి రూ.25,000 కోట్లు.
- 2019-21లో వివిధ విభాగాల్లో 2,62,480 ఉద్యోగాల భర్తీ. మార్చి 1, 2019 నాటికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య 32,62,908.
- పేదలకు నాణ్యమైన ఔషధాలను సరసమైన ధరల్లో అందుబాటులో ఉంచేందుకు జన్ ఔషధి పథకాన్ని అన్ని జిల్లాలకు విస్తరించాలని నిర్ణయం. ప్రస్తుతం ప్రధానమంత్రి భారతీయ జన్ ఔషధి కేంద్రాలు దేశవ్యాప్తంగా 6,000 ఉన్నాయి.
- జాతీయ జౌళి సాంకేతిక మిషన్‌కు నాలుగేళ్లలో రూ.1480 కోట్లు.
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈలు) వృద్ధికి ఆయా సంస్థల ఖాతాల ఆడిట్ కోసం నిర్దేశించిన టర్నోవర్ పరిమితి రూ.కోటి నుంచి రూ.5 కోట్లకు పెంపు.
- చిన్న ఎగుమతిదార్ల కోసం ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. ఎగుమతి రుణ బీమా పథకంగా పిలిచే ఈ స్కీం కింద 90 శాతం అసలు, వడ్డీకి కవరేజీ లభిస్తుంది.
- తెలంగాణలోని సింగరేణి కాలరీస్‌కి రూ.2,300 కోట్లు.
- ఆధార్ కార్డు ద్వారా తక్షణమే పాన్ కార్డు.
- పీపీపీ విధానంలో రైల్వే శాఖ 'కిసాన్ ఏసీ రైల్'. దీని ద్వారా రైతులు తమ ఉత్పత్తులను రవాణా చేసుకోవచ్చు.
- నేషనల్ పోలీస్ యూనివర్సిటీ, నేషనల్ ఫోరెన్సిక్ యూనివర్సిటీ ప్రతిపాదన.
- అధిక బీమా కవరేజీ కోసం త్వరలో నిర్విక్ పథకం.

- సంప్రదాయ విద్యుత్ మీటర్ల స్థానంలో ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లు.
- 16,200 కిలోమీటర్ల నుంచి 27 వేల కి.మీ.లకు నేషనల్ గ్యాస్ గ్రిడ్.
- ఎదుగుతున్న వయసు బాలికల కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్.
- అహ్మదాబాద్‌లో 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెరిటేజ్ అండ్ కన్జర్వేషన్' (ఐఐహెచ్‌సీ)ని ఏర్పాటు చేయాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దేశవ్యాప్తంగా ఎనిమిది మ్యూజియంల ఏర్పాటుకు రూ.109 కోట్లు కేటాయించారు. ప్రస్తుత మ్యూజియాల అభివృద్ధికి రూ.180 కోట్లు కేటాయించారు. రాంచీలో గిరిజన మ్యూజియం ఏర్పాటుకు ప్రతిపాదన.
- ఇ-కామర్స్ లావాదేవీలపై 1 శాతం మేర మూలం వద్ద పన్ను మినహాయింపు (టీడీఎస్)ను కొత్త పన్నుగా విధించాలని ప్రతిపాదన.
- దేశవ్యాప్తంగా త్వరలో డేటా సెంటర్ పార్కులు

# రాష్ట్రాలకు తగ్గిన పన్నుల వాటా

పన్నులవాటాలో రాష్ట్రాలకు 1 శాతం కోత పడనుంది. 2020-21 సంవత్సరానికి రాష్ట్రాలకు ఇచ్చే కేంద్ర నిధులను 42 శాతం నుంచి 41కి తగ్గించాలని ఎన్.కె సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. జమ్మూ కాశ్మీర్, లద్దాఖ్ కేంద్రపాలిత ప్రాంతాలుగా ఏర్పడటం, వాటి భద్రతాపరమైన, ప్రత్యేకమైన అవసరాల కోసం కేంద్రమే నిధులు ఇవ్వాల్సి రావటంతో ఈ ఒక శాతం తగ్గిస్తున్నట్లు ఆర్థికమంత్రి తెలిపారు. 15వ ఆర్థిక సంఘం సూచనల మేరకు 2020-21లో స్థానిక ప్రభుత్వాలకు రూ.90,000 కోట్లు కేటాయిస్తున్నామని, డివిజబుల్ పూల్‌లో ఇది 4.31 శాతమని చెప్పారు. కాగా, 15వ ఆర్థిక సంఘం తీసుకున్న వివిధ కొలమానాల కారణంగా మొత్తం 8 రాష్ట్రాల వెయిటేజీ తగ్గిపోగా, 20 రాష్ట్రాలకు పెరిగింది. వెయిటేజీ తగ్గిపోయిన వాటిలో నాలుగు దక్షిణాది రాష్ట్రాలే. ఉత్తరాది రాష్ట్రాలలో అసోం, ఒడిషా, ఉత్తరప్రదేశ్‌లకు వెయిటేజీ తగ్గినా వాటికి పెద్దగా పన్ను నష్టం లేదు. కొత్తగా కొలమానాల వల్ల 8 రాష్ట్రాలు వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.18,389 కోట్లు నష్టపోతుండగా, అందులో తమిళనాడు మినహా నాలుగు దక్షిణాది రాష్ట్రాల వాటానే రూ.16,640.29 కోట్లు. కొత్త విధానంతో కర్ణాటక అత్యధికంగా రూ.8,367.21 కోట్లు కోల్పోతోంది. ఆంధ్రప్రదేశ్ రూ.1521 కోట్లు, తెలంగాణ దాదాపు రూ.2,400 కోట్లు నష్టపోతున్నాయి. 2021-22 నుంచి 2025-26 వరకు కేంద్రం నుంచి చేయాల్సిన నిధుల బదలాయింపునకు సంబంధించిన తుది నివేదికను ఈ ఏడాది అక్టోబర్ కల్లా ఆర్థిక సంఘం సమర్పిస్తుందని మంత్రి తెలిపారు.

# ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యంతో రైళ్లు

**ప్రభుత్వ-ప్రయివేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో 150 రైళ్లను ప్రయాణికుల కోసం నడపాలని బడ్జెట్‌లో ప్రతిపాదించారు. దీంతోపాటు సుప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలను కలుపుతూ తేజస్ తరహా రైళ్లను రైల్వే శాఖ నడపనుంది. రాయితీల భారాన్ని మోస్తున్న రైల్వే శాఖకు కేంద్రం నుంచి బడ్జెట్ పరమైన మద్దతు కింద రూ.70,000 కోట్లు ఇవ్వాలని ఆర్థికమంత్రి ప్రతిపాదించారు. 2020-21 ఆర్థిక సంవత్సరానికి మూలధన వ్యయం రూపేణా రైల్వేకు రూ.1.61 లక్షల కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇది ప్రస్తుత సంవత్సర అంచనా కంటే కేవలం 3 శాతం ఎక్కువ. 2019-20 సంవత్సరానికి సవరించిన అంచనాల కంటే 9.5 శాతం ఎక్కువగా రూ.2,25,613 కోట్ల ఆదాయాన్ని వచ్చే సంవత్సరం వివిధ మార్గాల్లో ఆర్జించాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. దేశంలో 27 వేల కి.మీ. రైలు మార్గాలను విద్యుదీకరించనున్నారు. నిర్వహణపరంగా కొద్దిపాటి మిగులు పరిస్థితికి చేరుకున్నామని మంత్రి తెలిపారు. డీజిల్ ఇంధనానికి కళ్లెం వేయటంలో భాగంగా.. రైలు మార్గాల వెంబడి నిరుపయోగంగా ఉన్న 51,000 హెక్టార్ల రైల్వే భూముల్లో సౌర విద్యుదుత్పత్తి ఫలకాలను ఏర్పాటు చేయనున్నారు. దాదాపుగా 10 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయటానికి ఈ భూములు సరిపోతాయి. రూ.18,000 కోట్లతో 148 కి.మీ. మేర బెంగళూరు సబర్బన్ రవాణా ప్రాజెక్టును చేపడతారు. 20% మొత్తాన్ని ఈక్విటీగా కేంద్రం ఇస్తుంది. నాలుగు రైల్వే స్టేషన్లను పునర్ అభివృద్ధి చేస్తారు.**

# కేంద్ర బడ్జెట్ సమగ్ర స్వరూపం (రూ. కోట్లలో)

| | 2018-19 వాస్తవ గణాంకాలు | 2019-20 బడ్జెట్ అంచనాలు | 2019-20 సవరించిన అంచనాలు | 2020-21 బడ్జెట్ అంచనాలు |
|---|---|---|---|---|
| 1. రెవెన్యూ వసూళ్లు | 15,52,916 | 19,62,761 | 18,50,101 | 20,20,926 |
| 2. పన్ను ఆదాయం | 13,17,211 | 16,49,582 | 15,04,587 | 16,35,909 |
| 3. పన్నేతర ఆదాయం | 2,35,705 | 3,13,179 | 3,45,514 | 3,85,017 |
| 4. మూలధన వసూళ్లు | 7,62,197 | 8,23,588 | 8,48,451 | 10,21,304 |
| 5. రుణాల తిరిగి వసూళ్లు | 18,052 | 14,828 | 16,605 | 14,967 |
| 6. ఇతర వసూళు | 94,727 | 1,05,000 | 65,000 | 2,10,100 |
| 7. రుణాలు, ఇతరాలు | 6,49,418 | 7,03,760 | 7,66,846 | 7,96,337 |
| 8. మొత్తం వసూళ్లు (1+4) | 23,15,113 | 27,86,349 | 26,98,552 | 30,42,230 |
| 9. మొత్తం వ్యయం (10+13) | 23,15,113 | 27,86,349 | 26,98,552 | 30,42,230 |
| 10. రెవెన్యూ ఖాతా | 20,07,399 | 24,47,780 | 23,49,645 | 26,30,145 |
| 11. వడ్డీ చెల్లింపులు | 5,82,648 | 6,60,471 | 6,25,105 | 7,08,203 |
| 12. మూలధన ఆస్తుల సృష్టి కోసం గ్రాంట్లు | 1,91, 781 | 2,07,333 | 1,91,737 | 2,06,500 |
| 13. మూలధన ఖాతా | 3,07,714 | 3,38,569 | 3,48,907 | 4,12,085 |
| 14. రెవెన్యూ లోటు (10-1) | 4,54,483 | 4,85,019 | 4,99,544 | 6,09,219 |
| 15. ద్రవ్య లోటు (9-(1+5+6)) | 6,49,418 | 7,03,760 | 7,66,846 | 7,96,337 |
| 16. ప్రాథమిక లోటు (16-11) | 66,770 | 43,289 | 1,41,741 | 88,134 |

# ప్రత్యక్ష స్థానిక ఎన్నికల్ని నిర్వహించాలి

రాష్ట్రంలో జరగనున్న స్థానిక ప్రభుత్వాల ఎన్నికల్ని ప్రత్యక్ష పద్ధతిలో జరపాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి రాసిన లేఖను ఆయన విజయనగరంలోని పార్టీ కార్యాలయంలో మీడియాకు విడుదల చేశారు.




సమర్థ, కొత్త నాయకత్వం రావాలంటే స్థానిక ఎన్నికల్లో, ముఖ్యంగా పుర, నగర పాలికల్లో ప్రత్యక్ష ఎన్నిక మేలని బాబ్జీ అన్నారు. గతంలో ఎన్.టి రామారావు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని, నేరుగా ఎన్నికయ్యే అవకాశం వల్ల మెరుగైన అభ్యర్థులు బరిలోకి దిగారన్నారు. ఆ తర్వాత వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ప్రత్యక్ష ఎన్నికల్ని రద్దు చేశారన్నారు. విభజన అనంతరం ముఖ్యమంత్రయిన చంద్రబాబు కూడా దీన్నే కొనసాగించారన్నారు. పరోక్ష ఎన్నికల వల్ల ఫిరాయింపులు, ముడుపులు పెరిగిపోయాయన్నారు. రాష్ట్రంలో ఎమ్మెల్యేలు కుటుంబ రాజకీయాల్ని చేస్తున్నారని, స్థానిక ప్రభుత్వాధినేతల్ని పరోక్షంగా ఎన్నుకోవటం వల్ల తమ కుటుంబ సభ్యుల్నే నేతలుగా చూపుతూ రాజకీయాల్ని శాసిస్తున్నారన్నారు. స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి ఎన్నికను కూడా ప్రత్యక్షంగా నిర్వహిస్తే ఎమ్మెల్యేల మీద ఆధారపడాల్సిన పని ఉండదని, శాసనసభ వెలుపల ఎమ్మెల్యే రాజ్యానికి అడ్డుకట్ట వేయవచ్చని అన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ ఆధ్వర్యంలో ధనరాజకీయంపై జరిగిన రెండు రోజుల సదస్సులో కూడా పలువురు నేతలు, విశ్లేషకులు, అధ్యయనకారులు ప్రత్యక్ష ఎన్నికలనే ప్రస్తుత భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయ వైఫల్యాలకు పరిష్కారంగా చూపారన్నారు. స్థానిక స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ ప్రభుత్వాధినేతల్ని ప్రత్యక్షంగా ఎన్నుకునే ఏర్పాటు ఉంటే, స్థానిక ప్రభుత్వాలు బాగా బలపడతాయన్నారు. ప్రచారానికి తక్కువ సమయం ఉండటంపై కూడా సదస్సులో చర్చ జరిగిందని.. తక్కువ సమయం ఉండటం వల్ల చిన్న పార్టీలకు, సాధారణ అభ్యర్థులకు అవకాశం ఇవ్వకుండా పెద్ద పార్టీలు, డబ్బున్న అభ్యర్థులు భారీయెత్తున సభల్ని ఏర్పాటు చేసి ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారని సదస్సులో పాల్గొన్న ఎన్నికల సంఘం ఉన్నతాధికారి తెలిపారన్నారు. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుని, చిన్న పార్టీల అభ్యర్థులు కూడా సవ్యంగా ప్రచారం చేసుకునేలా పటిష్ట ఏర్పాట్లు ఉండాలన్నారు. ప్రత్యక్ష ఎన్నికలతోపాటు స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని కూడా బదిలీ చేయాలన్నారు. ఈ ఏర్పాట్లు ఉంటేనే ప్రజలకు నాణ్యమైన సేవలు అంది గ్రామ సచివాలయాల లక్ష్యం నెరవేరుతుందన్నారు. లోక్‌సత్తా పార్టీ నాయకులు కోరాడ అరవింద్, శిమ్మ శ్రీను, బోర రమేష్, చిన్నారావు, ఎర్నిబాబు, అప్పారావు, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

## కల్తీ ఆహారం నిరోధానికి చర్యలు చేపట్టండి

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ మహానగరంలో కల్తీ ఆహారాన్ని నిరోధించే చర్యలు లేకపోవటం సిగ్గుచేటని, ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా గట్టి చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా జీహెచ్ఎంసీ అధ్యక్షుడు దోసపాటి రాము అన్నారు. లోక్‌సత్తా నేతలు లక్ష్మణ్‌రావు, గజేందర్‌రెడ్డి, శ్రీనివాసరావు, అర్చన, హిమబిందు తదితరులతో కలిసి అంబర్‌పేటలో మీడియాతో మాట్లాడుతూ.. ఆహార నాణ్యతా ప్రమాణాల్ని పాటించకపోవటం నాగరిక సమాజంలో అతిపెద్ద నేరాలలో ఒకటన్నారు. హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహారాన్ని అరికట్టడంలో జీహెచ్ఎంసీ విఫలమైందన్నారు. ఆహార పదార్థాల నాణ్యతా తనిఖీలు లేవన్నారు. కల్తీ ఆహారంతో అనేకమంది ఆస్పత్రుల పాలవుతున్నారన్నారు. ఆహార కల్తీని అరికట్టటానికి ప్రభుత్వం, జీహెచ్ఎంసీ సమగ్ర విధానంతో వేగంగా చర్యలు తీసుకోవాలన్నారు.



# ‘నేర్చుకోవటాన్ని నేర్చుకోవాలి, ఆలోచించటాన్ని నేర్చుకోవాలి’.. తెలుగు వికీపీడియా విస్తరణకు పెద్దఎత్తున కృషి జరగాలన్న జేపీ

ఇంగ్లీషులో నిక్షిప్తమై ఉన్న విజ్ఞానాన్ని తెలుగులోకి, ఇతర భారతీయ భాషల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం పెద్దఎత్తున జరగాలని, దీనివల్ల సమాచార లబ్ధిని మన దేశ ప్రజలు గరిష్ఠంగా పొందగలుగుతారని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. “నేర్చుకోవటాన్ని నేర్చుకోవటం, ఆలోచించటాన్ని నేర్చుకోవటం”.. ఇప్పుడు భారతీయుల ముందున్న పెద్ద పరిష్కార మంత్రమన్నారు. సాంకేతికత పెరగడంతో మనిషి మేధస్సు పెరిగినా, మనస్సు మాత్రం పెరగటం లేదన్నారు. మనం విషయాలతోపాటు వాటిపై సరైన ప్రమాణాలతో ఆలోచించటం కూడా నేర్చుకోవాలన్నారు. భారత్ వంటి వైవిధ్యం, విస్తృతి ఉన్న దేశంలో విషయ పరిజ్ఞానం సమృద్ధిగా ఉన్న వికీపీడియా స్థానిక భాషల్లో అందుబాటులో ఉంటే, ఎన్నో సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్నారు. గచ్చిబౌలి ట్రిపుల్‌ఐటీ–హైదరాబాద్‌లోని కోహ్లీ సెంటర్ ఆన్ ఇంటెలిజెంట్ సిస్టమ్స్ (కేసీఐఎస్) ఆడిటోరియంలో నిర్వహించిన ‘ప్రాజెక్ట్ తెలుగు వికీ’ సదస్సులో జేపీ పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ట్రిపుల్‌ఐటీతో కలిసి తెలుగు వికీపీడియా బలోపేతానికి పూనుకోవటం శుభపరిణామమని జేపీ అన్నారు. తెలుగులో విషయ పరిజ్ఞానాన్ని అందించటంలో, చారిత్రక, సామాజిక చైతన్య అంశాలను అందించటంలో వికీపీడియా పాత్ర కీలకమని, తెలుగు వికీ నాణ్యతతో వేగంగా ఎదగాల్సి ఉందని అన్నారు. నిబద్ధత గల యువ వలంటీర్లు వివిధ రంగాల నిపుణులతో కలిసి ఇందు కోసం అంకితభావంతో పనిచేయాలన్నారు. ప్రపంచం ఎల్లలు చెరిపేసిన సాంకేతిక పరిజ్ఞానం మన సమాజాభివృద్ధికి, దేశంలో అందరికీ సమానావకాశాలను అందించటానికీ సద్వినియోగం కావాలన్నారు.

దేశంలో ప్రస్తుతం డిజిటల్ లిటరసీ సమస్య ఉందని, ఆంగ్ల వికీపీడియాలో 70 మిలియన్ల వ్యాసాలుంటే, తెలుగులో కేవలం 72 వేల వ్యాసాలే ఉండటం శోచనీయమని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ రాజిరెడ్డి అన్నారు. ఆయా రంగాల్లో విషయ పరిజ్ఞానమున్న నిపుణులు, నిబద్ధత గల వలంటీర్లతో తెలుగు వికీ కమ్యూనిటీని తయారుచేయాలన్నారు. అనువాదానికి అవసరమైన ఆన్‌లైన్ ట్రాన్స్‌లేషన్ టూల్‌కిట్‌ను అభివృద్ధి చేసేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ కృషి చేస్తోందన్నారు. ఒక ప్రదేశం, ప్రాంతం, రాష్ట్రం గురించి ఇప్పటివరకూ తెలియని విషయాలను విశ్వసనీయ సాక్ష్యాధారాలు, ఉదాహరణలతో వికీపీడియన్లు తెలుగులో అందుబాటులోకి తేవచ్చన్నారు. టెక్నాలజీ, యంత్రాల ద్వారా స్థానిక భాషల్లో బల్క్‌గా కంటెంట్‌ను తయారుచేసి, ఆ తర్వాత నిపుణుల ద్వారా ఎడిట్ చేయవచ్చన్నారు. ఆంగ్లం, చైనీస్, జపనీస్, జర్మన్, ఫ్రెంచ్, ఇటాలియన్ భాషల్లో స్పీచ్ ట్రాన్స్‌లేషన్ జరుగుతుండగా.. భారతీయ భాషలు నిర్లక్ష్యానికి



గురవుతున్నాయన్నారు. భారతీయ భాషలన్నిటినీ వికీపీడియాలోకి తీసుకురావటం అత్యవసర కార్యక్రమంగా చూడాలన్నారు.

వికీపీడియాలోనే కాకుండా ఎక్కడైనా మాట్లాడే భాష, రాసే భాష వేరుగా ఉండాలనుకుంటారని, కానీ మాట్లాడే భాషలోనే రాయటం మంచిదని రాజకీయ విశ్లేషకుడు, జర్నలిజం కళాశాల ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ అన్నారు. విషయాల వ్యాప్తికి సాంకేతిక వేదికల్ని ప్రజలు విరివిగా ఉపయోగించుకోవాలన్నారు. వికీపీడియాలో వ్యాసాలు పెంచటం కోసం ప్రత్యేక యంగ్ బ్రిగేడ్‌ను తయారుచేసేందుకు ట్రిపుల్ ఐటీతో కలిసి పనిచేస్తున్నామని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అన్నారు. సాంస్కృతిక శాఖ ద్వారా అనేక చారిత్రక, భాషా, పండుగల కార్యక్రమాలు నిర్వహించి తెలంగాణ ఔన్నత్యాన్ని చాటుతున్నామన్నారు. ప్రాజెక్ట్ తెలుగు వికీ ప్రధాన పరిశోధకుడు, ట్రిపుల్‌ఐటీ ఆచార్యుడు వాసుదేవ వర్మ ప్రాజెక్టు కింద చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ట్రిపుల్‌ఐటీ ప్రాంగణంలో ఉచితంగా ప్రతీ శుక్రవారం మధ్యాహ్నం 2 నుంచి 6 గంటల వరకు వికీథాన్ కార్యక్రమాన్ని, ప్రతీ శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు వికీపీడియాపై శిక్షణను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ తెలుగు వికీ కోసం నాలుగు ఫోకస్ గ్రూప్‌లను ఏర్పాటు చేశామన్నారు. 50 లక్షల వ్యాసాలతో తెలుగు వికీని నిర్మించటమే తమ లక్ష్యమన్నారు. ఇంగ్లీషు వికీపీడియాలోని వ్యాసాల్లో ఎక్కువగా అమెరికా, ఐరోపావాళ్లు రాసినవేనని, తెలుగు వికీపీడియాలో వ్యాసాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు హైదరాబాద్‌లోని ట్రిపుల్‌ఐటీలో ప్రాజెక్ట్ తెలుగు వికీ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పీజే నారాయణన్ తెలిపారు. దాదాపు 800 మంది ఔత్సాహికులు తెలుగు వికీలో స్వచ్ఛంద సేవలకు ఇప్పటిదాకా నమోదు చేసుకున్నారు.

ట్రిపుల్‌ఐటీ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు శ్రీనిరాజు, ప్రొఫెసర్ మామిడి రాధిక, వెంకటేశ్వర్లు, దిలీప్ కొణతం, ప్రవీణ్ గరిమెళ్ల, ప్రాజెక్ట్ తెలుగు వికీ బృందం, పలువురు మేధావులు, ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లు, విద్యార్థులు, పరిశోధకులు, తదితరులు పాల్గొన్నారు.




**మార్పుని సాధించాలనుకుంటే.. ఆలోచించే శక్తిని పెంచుకోండి!**

“70 ఏళ్ల భారత రాజ్యాంగం”పై సివిల్ సర్వీస్ యాస్పిరెంట్ యువతతో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ముఖాముఖిలో ఎఫ్‌డీఆర్, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జేపీ







**యూత్ పార్లమెంట్ ‘లీడర్‌షిప్ బూట్‌క్యాంప్’ బృందంతో జేపీ**

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th March, 2020 Posting Date 15 &16th of every month






# ‘న్యూఇండియా: టర్నింగ్ టు రూట్స్, రైజింగ్ టు హైట్స్’

‘మూలాలను తరచి చూసుకోవటం, ఉన్నతస్థాయికి ఎదగటం, తద్వారా నూతన భారతదేశాన్ని నిర్మించటం’ గురించి ఇండియా ఐడియాస్ 6వ సదస్సు (ఐఐసీ 2020) గుజరాత్‌లోని నర్మద టెంట్ సిటీలో మూడు రోజులపాటు చర్చించింది. సదస్సులో పాల్గొన్న లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్.. మన పాలనను, ప్రభుత్వ వ్యవస్థలను సమూలంగా పునస్సమీక్షించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ప్రధానమంత్రో, ఆయన కేబినెట్ మంత్రులో, ముఖ్యమంత్రులో కష్టపడితేనే దేశంలో మార్పు రాదన్నారు. దేశంలోని ప్రతి కుటుంబం కష్టపడుతూ తమ వంతు తోడ్పాటునందిస్తేనే మార్పు సాధ్యమవుతుందని, అందుకు తగిన రీతిలో వ్యవస్థల్ని నిర్మించటమే నిజమైన నాయకత్వమని అన్నారు. రాజకీయాలు, పాలన ఢిల్లీలో ఉన్నాయనుకోవటం భ్రమని, అవి నిజంగా ఉన్నది రాష్ట్రాల్లోనేనన్నారు. అయితే రాష్ట్రాలు అనుత్పాదక ఉచితాల ఉచ్చులో పడి దివాళా తీసే పరిస్థితికి చేరుకుంటున్నాయన్నారు. అవినీతి, ఓట్ల కొనుగోలు, ఉచితాల తాయిలాలు, విపరీత పార్టీతత్వం, జవాబుదారీతనంలేని ప్రభుత్వోద్యోగ వ్యవస్థల నుంచి.. విలువలతో కూడిన బలమైన సమాజం, పౌరుని చుట్టూ పాలన, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా నాణ్యమైన సేవలు, మంచి ప్రమాణాల విద్య, ఆరోగ్యం, సమర్థులైన నిజాయతీపరులు గెలిచే ఎన్నికల వ్యవస్థలవైపు మళ్లటమే ఇప్పుడు భారతదేశం చేయాల్సిన అసలైన పని అని జేపీ అన్నారు.

**BOOK POST**

**PRINT MATTER**

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**